# కొత్తగూడెంలో నూతన ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం

- రోజుకు 300 నుంచి 400 మందికి సేవలు.. ముందస్తు నమోదు సదుపాయం
- జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలకు ఆధార్ సేవలను మరింత చేరువ చేసేందుకు కొత్తగూడెం పట్టణంలోని పాత కొత్తగూడెం ప్రధాన ఆసుపత్రి ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన సేవా కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉంచిన వసతులు, ఆధార్ సేవల నిర్వహణకు ఏర్పాటు చేసిన వ్యవస్థ, సాంకేతిక పరికరాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రం ద్వారా అందించే సేవలు, రోజువారీగా ఎంతమందికి సేవలు అందించే సామర్థ్యం ఉందనే వివరాలను కూడా పరిశీలించారు.

ఈ కేంద్రంలో కొత్తగా ఆధార్ నమోదు, ఆధార్ వివరాల్లో మార్పులు, చిరునామా మార్పు, సెల్‌ఫోన్ నంబర్ అనుసంధానం తదితర సేవలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. రోజుకు సుమారు 300 నుంచి 400 మంది వరకు ప్రజలకు సేవలు అందించే సామర్థ్యం ఈ కేంద్రానికి ఉందని వివరించారు. దీంతో కొత్తగూడెం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఆధార్ సేవలు సులభంగా, వేగంగా అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఆధార్ సేవలు పొందేందుకు ప్రజలు ముందుగానే అంతర్జాలం ద్వారా సమయాన్ని నమోదు చేసుకునే సదుపాయం ఉందని అధికారులు తెలిపారు. ముందస్తుగా సమయం నమోదు చేసుకుని నిర్ణీత సమయంలోనే కేంద్రానికి రావడం ద్వారా వేచి ఉండే సమయాన్ని తగ్గించుకోవచ్చని సూచించారు.

**దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదు**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ఆధార్ ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ అత్యంత ముఖ్యమైన గుర్తింపు పత్రమని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ ప్రభుత్వ సేవలు, బ్యాంకింగ్ తదితర అవసరాలకు ఆధార్ అవసరమవుతున్న నేపథ్యంలో ప్రజలకు ఆధార్ సేవలు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం ముఖ్యమన్నారు. కొత్తగూడెంలో నూతన ఆధార్ సేవా కేంద్రం అందుబాటులోకి రావడం వల్ల జిల్లా ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. గతంలో ఆధార్‌కు సంబంధించిన సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో ప్రజలకు ప్రయాణ సమయం, ఖర్చులు పెరిగేవని పేర్కొన్నారు. ప్రస్తుతం స్థానికంగానే ఆధార్ సేవలు అందుబాటులోకి రావడంతో ఆ ఇబ్బందులు తగ్గుతాయని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆధార్ ప్రాధికార సంస్థ ప్రాంతీయ కార్యాలయానికి చెందిన హైదరాబాద్ ప్రాజెక్టు నిర్వాహకుడు నరేష్ చంద్ర, టీబీఎల్‌ఎస్ సంస్థ ప్రాంతీయ నిర్వాహకుడు శ్రీనివాస్, భద్రాద్రి కొత్తగూడెం ఆధార్ సేవా కేంద్ర ప్రధాన నిర్వాహకుడు వంశీ, కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య, ఈ-జిల్లా నిర్వాహకుడు వైదేహరావు, తెలంగాణ రాష్ట్ర సాంకేతిక సేవల జిల్లా నిర్వాహకుడు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మహత్యల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

**ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీఎంహెచ్ఓ ఆదేశం**

**సూర్యాపేట, సెప్టెంబర్ 10: వుదయం ప్రతినిధి**




జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. పెండెం వెంకట రమణ, ఎండీడీఎస్ ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎం అండ్హెచ్ఓ డా. జె. చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. 10.09.2026న "ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం" సందర్భంగా జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలలో వైద్యాధికారులు మరియు పారా మెడికల్ సిబ్బందికి ఆత్మహత్యల నివారణ, మానసిక ఆరోగ్య ప్రాధాన్యత, ఒత్తిడి మరియు నిరాశ వంటి సమస్యలను గుర్తించడం, అవసరమైన సమయంలో మానసిక సహాయం పొందడం తదితర అంశాలపై డీఎంహెచ్ఓ అవగాహన కల్పించారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలు, ఒత్తిళ్ల కారణంగా కొంతమంది తీవ్ర నిరాశకు లోనయ్యే అవకాశం ఉందని, ముఖ్యంగా విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంటుందని, అలాంటి సమయంలో వారిని ఒంటరిగా వదిలివేయకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎం అండ్హెచ్ఓ డా. జె. చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంబేద్కర్ నగర్ నందు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మహత్యల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు మరియు ఆరోగ్య సిబ్బంది సహకారం అందించాలని సూచించారు. ఆత్మహత్య ఆలోచనలు కలిగిన వ్యక్తులను గుర్తించి, వారిని సానుభూతితో వినడం, ధైర్యం చెప్పడం, అవసరమైనప్పుడు నిపుణులైన మానసిక వైద్యులు లేదా కౌన్సిలర్ల సహాయం అందించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. "ఆత్మహత్యల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత – ఒకరి మాట వినడం, ఒకరి ప్రాణాన్ని కాపాడవచ్చు" అనే సందేశంతో అవగాహన మరియు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మానసిక వైద్య నిపుణులు డా. స్రవంతి, ప్రోగ్రాం అధికారులు డా. కోటి రత్నం, డా. నాజియా తబస్సుం, డా. పై శైలం, డా. నాగరాజు, వైద్యాధికారి డా. అమూల్య, డిప్యూటీ డెమో శ్రీ వి. సంజీవ్ రెడ్డి, శ్రీ శ్రీనివాస రాజు, శ్రీ ఆనంద్, డి. శ్రీదేవి, శ్రీ శేషయ్య, శిరోమణి, శ్రీ లక్ష్మీనారాయణ, శ్రీ టి. కృష్ణ మూర్తి, శ్రీ రవి మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

# నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పంచాయతీ రాజ్ శాఖ ఎస్ ఈ ని మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు



**అంబేద్కర్ స్టడీ సెంటర్ ను సందర్శించి పనుల పురోగతిని పరిశీలించిన ఎస్ ఈ, నాయకులు**

**యాదాద్రి భువనగిరి, 10/09/2026**



యాదాద్రి భువనగిరి జిల్లా పంచాయతీ రాజ్ శాఖ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మహేష్ కుమార్ ను గురువారం భువనగిరి కార్యాలయంలో ప్రజా సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం భువనగిరి సింగన్న గూడెం లో నిర్మిస్తున్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్టడీ సెంటర్ ను సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. మిగిలిపోయిన పనులు పూర్తి చేసి, అంబేద్కర్ స్టడీ సెంటర్ ను ప్రారంభించడానికి కృషి చేయాలని ఎస్ ఈ కాంట్రాక్టర్ మరియు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ భువనగిరి డివిజనల్ ఇంజనీర్ ప్రసాద్, యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్సీ /ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బండారు రవివర్ధన్, సామాజిక ప్రజా సంఘాల నాయకులు బర్రె సుదర్శన్, కొడారి వెంకటేష్, నల్ల కృష్ణ, పంచాయతీ రాజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆటుపోట్లను తట్టుకొని నిలిచిన వారే నిజమైన కమ్యూనిస్టులు




**ఘనంగా టీవీఆర్ చంద్రం 'ఎగరేసిన ఎర్రజెండా' పుస్తకావిష్కరణ**

**భద్రాచలం, సెప్టెంబర్ 10 (ఉదయం ప్రతినిధి):**

ఆటుపోట్లను తట్టుకొని, ఎన్ని కష్టాలు ఎదురైనా పార్టీ సిద్ధాంతాలకు కడవరకు కట్టుబడి ప్రజా ఉద్యమాల్లో నిలిచిన వారే నిజమైన కమ్యూనిస్టులని వ్యవసాయ కార్మిక సంఘం అఖిలభారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. భద్రాచలంలోని కేకే ఫంక్షన్ హాల్‌లో అమరజీవి టీవీఆర్ చంద్రం జీవిత చరిత్ర ఆధారంగా ఆయన కుమారుడు జగన్ రచించిన 'ఎగరేసిన ఎర్రజెండా' పుస్తకాన్ని గురువారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు సీనియర్ కమ్యూనిస్టు నాయకులు సింగు నరసింహారావు అధ్యక్షత వహించారు. పుస్తకావిష్కరణ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, టీవీఆర్ చంద్రం కుటుంబ సభ్యులు, అభిమానులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా బి.వెంకట్ మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీల చీలిక అనంతరం టీవీఆర్ చంద్రం సీపీఐ(ఎం) పక్షాన అత్యంత నిబద్ధతతో నిలిచారని గుర్తు చేశారు. భద్రాచలం నియోజకవర్గంలో పార్టీ తొలి శాఖ ఏర్పాటులో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలపై విశ్వాసంతో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన టీవీఆర్ చంద్రం జీవితం నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. రాజకీయ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు, కష్టనష్టాలు ఎదురైనా ఆయన ఎర్రజెండాను వీడలేదని పేర్కొన్నారు. పదవులు, వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా ప్రజల కోసం, పార్టీ కోసం పనిచేసిన నాయకుల జీవితాలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఐ(ఎం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు అంటేనే త్యాగానికి ప్రతిరూపమని అన్నారు. పార్టీ సిద్ధాంతాలకు, నిర్ణయాలకు కట్టుబడి టీవీఆర్ చంద్రం తన జీవితాన్ని ప్రజా ఉద్యమానికి అంకితం చేశారని తెలిపారు. ఎలాంటి వ్యక్తిగత స్వార్థం లేకుండా ప్రజల కోసం, పార్టీ కోసం పనిచేసినందువల్లే ఆయన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి షబ్బీర్ పాషా మాట్లాడుతూ.. భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధిలో కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన నాయకుల్లో టీవీఆర్ చంద్రం ఒకరని పేర్కొన్నారు. భద్రాచలం నియోజకవర్గంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి ఆయన చేసిన కృషి ప్రత్యేకమైనదని అన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఎలమంచి రవికుమార్, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు చిటూరు వెంకట్రావు తదితరులు మాట్లాడుతూ.. భద్రాచలం, పరిసర ప్రాంతాల ప్రజల కోసం కమ్యూనిస్టు నాయకులు చేసిన పోరాటాలు, త్యాగాలు మరువలేనివని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తమ జీవితాలను అంకితం చేసిన నాయకుల సేవలను గుర్తు చేసుకోవడం సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. సీనియర్ కమ్యూనిస్టు నాయకులు సింగు నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్, పోటు రంగారావు, ముర రమేష్, ఎంబీ నర్సారెడ్డి, కొలగాని బ్రహ్మాచారి, కారం పుల్లయ్య, గడ్డం స్వామి తదితర నాయకులు పాల్గొన్నారు. టీవీఆర్ చంద్రం కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# దోపిడీ, పీడన ఉన్నంత కాలం మార్క్సిజం ఉంటుంది

**సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాయం చిన్న చంద్రన్న**

**గంగారం సెప్టెంబర్ 10( వుదయం):**




ప్రజలపై దోపిడీ, పీడన కొనసాగినంత కాలం మార్క్సిజం సజీవంగా ఉంటుందని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాయం చిన్న చంద్రన్న గురువారం అన్నారు. మహబూబాబాద్ జిల్లా గంగారం, కొత్తగూడ మండలాల ముఖ్య కార్యకర్తల జనరల్ బాడీ సమావేశం పందెం గ్రామంలో ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ఈక బిక్షం అధ్యక్షత వహించగా, పాయం చిన్న చంద్రన్న ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సమావేశం లో వెనుకబడిన ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసి, గిరిజన, ఇతర పేద ప్రజలకు అండగా నిలిచి భూమిని సంపాదించి పెట్టడంలో విప్లవకారుల కృషి, త్యాగాలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. పాలకవర్గాల విమర్శలు కమ్యూనిస్ట్ విప్లవ పార్టీల కాలం చెల్లిందనే ప్రచారాన్ని నమ్మవద్దని, అవినీతి, అక్రమాలు, తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసం చేస్తున్న పాలకవర్గాల అబద్ధపు మాటలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు స్థానిక సమస్యలు గంగారం, కొత్తగూడ మండలాల్లో ఎండుతున్న పంటలను అధికారులు వెంటనే సర్వే చేయాలని, మహబూబాబాద్ డివిజన్ కార్యదర్శి పూనెం ప్రభాకర్ డిమాండ్ చేశారు,

ఎండిన పంటలను వ్యవసాయాధికారులు తక్షణమే సర్వే చేయాలి. నష్టపోయిన ప్రతి ఎకరాకు రూ. 30,000 పంట నష్టపరిహారం అందించాలి. విపరీతంగా పెరిగిన ఎరువులు మరియు నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గొంది సమ్మయ్య, కురుసం రంగయ్య, జోగరామయ్య, పూనం రవికుమార్, చిత్తారి పాపయ్య, వాసం పాపయ్య, కురుసం సురేష్, నాగేశ్వరరావు, బుచ్చి రాములు, నారాయణరెడ్డి, వసంతరావు, కల్తీ ఎర్రక్క, సతీష్, సురేష్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సిబ్బంది ప్రత్యేక క్యాంపు

**యాదాద్రి భువనగిరి ,10/09/2026**




యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి ప్రభుత్వ విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో గురువారం T X హాస్పిటల్ వైద్య సిబ్బంది ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. సందర్భంగా హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ మీసాల నవీన్ మాట్లాడుతూ,అనునిత్యం ఉద్యోగ బాధ్యతలతో బిజీగా ఉండే ఉద్యోగులకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించక అనేక అనారోగ్యాలు కొని తెచ్చుకుంటున్నారని,ఆ క్రమంలోని క్యాంపు ల ద్వారా వివిధ పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిస్థితులను బట్టి వారికి కావలసిన చికిత్స అందించబడుతుందని సందర్భంగా తెలిపారు. క్యాంపు ద్వారా ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితిని పూర్తిగా తెలుసుకోవడం జరిగిందని వారికి కావలసిన చికిత్సలు హైదరాబాద్ ఉప్పల్ లోని తమ TX హాస్పిటల్ ద్వారా అందిస్తామని తెలిపారు. ఎమర్జెన్సీ కు సంబంధించి 9849408983 కు ఫోన్ ద్వారా సంప్రదించాలన్నారు. క్రమంలో డాక్టర్ కిరణ్, ల్యాబ్ టెక్నీషియన్,ఏఎన్ఎం జిఎన్ఎమ్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# మండల స్థాయి ఎస్జిఎఫ్ క్రీడల ప్రారంభం

**చిలుకూరు, సెప్టెంబర్ 10:( వుదయం )**

మండల పరిధిలోని రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎస్,జి, ఎఫ్, క్రీడా పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రామాపురం గ్రామ సర్పంచ్ వేమూరి సతీష్ ముఖ్యఅతిథిగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్ జి శివకుమారి, మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టుగా పనిచేసే మనస్తత్వం, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

మండల స్థాయి ఎస్ జి ఎఫ్ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడా మైదానంలో విద్యార్థుల ఉత్సాహభరిత ప్రదర్శనలు, పోటీతత్వం, క్రీడాస్ఫూర్తి ఆకట్టుకున్నాయి. విజయం కంటే క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, పరస్పర గౌరవం ముఖ్యమని నిర్వాహకులు విద్యార్థులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో, మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జనపనేని రామారావు, చిత్తలూరి రాజారావు, కోదాడ నియోజకవర్గ ఎస్ జి ఎఫ్ కార్యదర్శి సునీల్, శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం. సీతారాంరెడ్డి, పి. ప్రకాష్, శోభన్, నరసింహారావు, ఏ. లెనిన్, పాఠశాల క్రీడా నిర్వహణ కమిటీ కార్యదర్శి కదిరి బ్రహ్మారెడ్డి, ఉపాధ్యాయులు టివైఎల్ఎన్ స్వామి, ఐ. రామాంజలీదేవి, ఎస్. అరుంధతి, డి. వెంకట్ రెడ్డి, కె. వెంకన్న, స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిల్లుట్ల రామ్మూర్తితో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# వర్షాల కోసం గ్రామ దేవతలకు పూజలు

**ఎండుతున్న పంటలను కాపాడాలని రైతుల వేడుకోలు**

**గంగారం సెప్టెంబర్ 10(వుదయం):**

మహబూబాబాద్ జిల్లా గంగారం మండల కేంద్రంలో రైతులు తాము నమ్మిన గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా నెలకొన్న వాతావరణ పరిస్థితుల ప్రభావంతో గంగారం ఏజెన్సీ మండలంలో వానలు మొహం చాటేశాయి. ఈ ఏడాది ప్రారంభంలో కురిసిన వర్షాలకు ఆశపడిన రైతులు.. మొక్కజొన్న, వరి, పత్తి, కంది వంటి పంటలను సాగు చేశారు. అడపా దడపా కురిసిన వర్షాలకు పంటలు ఏపుగా పెరిగి రైతన్నల్లో ఆశలు చిగురింపజేశాయి. అయితే, గత వారం రోజులుగా ఒక్క చినుకు కూడా పడకపోవడంతో ఏపుగా పెరిగిన పంటలన్నీ నేలచూపులు తొక్కుతున్నాయి. వర్షాలు లేక పొలాలు బీడువారే పరిస్థితి రావడంతో పెట్టుబడి నష్టంపోతామనే ఆందోళన రైతులను నిద్రలేకుండా చేస్తోంది. మండల కేంద్రంలోని రైతులంతా ఏకమై స్థానిక గ్రామ దేవతలైన బొడ్రాయి, ముత్యాలమ్మ, ఆంజనేయ స్వామితో పాటు గంగమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వానలు కురిపించి తమ పంటలను, బతుకులను కాపాడాలని అమ్మవారిని వేడుకున్నారు. అన్నదాతల కష్టాలు తీరి, వరుణ దేవుడు కరుణించాలని కోరుకుంటూ గ్రామస్థులు ఈ పూజా కార్యక్రమాల్లో పెద్దఎత్తున పాల్గొన్నారు.

# అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు.. టీఆర్ఎస్ యువనేతలకు పోలీసుల అడ్డుకట్ట




**మునగాల, సెప్టెంబర్ 10 (వుదయం):**

అసెంబ్లీ సాక్షిగా టీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై జరిగిన ఘటనను నిరసిస్తూ, పార్టీ అధినేత కేసీఆర్‌ను చంపుతామని బెదిరింపులకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ టీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు సీఎం రేవంత్‌రెడ్డి నివాస ముట్టడికి హైదరాబాద్ తరలుతున్న టీఆర్ఎస్ యువ నాయకులను మునగాల పోలీసులు అరెస్టు చేశారు. మండల కేంద్రం నుంచి బయలుదేరుతున్న నాయకులను అడ్డుకుని అదుపులోకి తీసుకోవడంపై టీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. బెదిరింపుల ఆరోపణలపై చర్యలు తీసుకోకుండా ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాలరాస్తూ పోలీసు బలంతో ప్రతిపక్ష గొంతులను నొక్కాలని చూస్తున్నారని ఆరోపించారు. అరెస్టులతో ఉద్యమాన్ని అణచివేయలేరని, ఒక్కరిని అరెస్టు చేస్తే వందలాది మంది ఉద్యమంలోకి వస్తారని హెచ్చరించారు. అధికార పక్షానికి ఒక న్యాయం, ప్రతిపక్షానికి మరో న్యాయం అన్నట్టుగా వ్యవహరిస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు. కేసీఆర్‌పై బెదిరింపుల ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అసెంబ్లీలో జరిగిన ఘటనపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అరెస్టులు తమ పోరాటాన్ని ఆపలేవని, ప్రజాస్వామ్య హక్కుల కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. టీఆర్ఎస్ యువ నాయకులు నవీన్‌రెడ్డి, పొన్నాల అంజి, కోట వెంకటేశ్వర్లు, నారాయణ, వెంకన్న, శ్రీనివాస రెడ్డి, వంశీ, డాన్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు అండగా ప్రభుత్వం



- రైతుల సమస్యలపై కలెక్టరేట్ లో ప్రత్యేక సమావేశం
- రాయితీలు, సౌకర్యాలు కల్పిస్తామన్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి తీగల నాగయ్య

**సూర్యాపేట, సెప్టెంబర్ 10:**

ఆయిల్ పామ్ తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ద్వారా అన్ని రకాల వసతులు, రాయితీలు కల్పిస్తామని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ అధికారి తీగల నాగయ్య అన్నారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో ఆయిల్ పామ్ రైతు సంఘం ప్రతినిధులు, ఆయిల్ ఫెడ్ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు, డ్రిప్ కంపెనీ సిబ్బందితో సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ఇటీవల కాలంలో సూర్యాపేట జిల్లాలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులు సంఘంగా ఏర్పడ్డారు. వారి అభ్యర్థన మేరకు అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులు తమ పలు డిమాండ్లను జిల్లా ఉద్యాన అధికారి దృష్టికి తీసుకెళ్లారు. రైతుల డిమాండ్లపై స్పందిస్తూ జిల్లా అధికారి తీగల నాగయ్య మాట్లాడుతూ... రైతుల డిమాండ్లను పై అధికారులకు తెలియపరిచి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా FFB (Fresh Fruit Bunches) పేమెంట్ విషయంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా సంబంధిత అధికారుల చొరవతో వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూస్తామన్నారు. జిల్లాలో ఉన్న ఆయిల్ పామ్ సిబ్బంది కొరతను త్వరలో తీర్చి, రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందేలా సమన్వయంతో పనిచేస్తామన్నారు.

ఉద్యాన శాఖ ద్వారా రైతులకు అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని, పెద్ద ఎత్తున రైతులు ఆయిల్ పామ్ సాగు చేసే విధంగా రైతు సంఘం నాయకులు తమ వంతుగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సాంకేతిక అధికారి ముత్తినేని మహేష్, ఉద్యాన అధికారులు కట్టా స్వాతి, పి. అనిత, ఎల్. ప్రదీప్తి, వి. ప్రమిత, ఆయిల్ ఫెడ్ జిల్లా మేనేజర్ అలీమ్, ఎంఐ ఇంజనీర్ నరేష్, అకౌంటెంట్ పులి మురళి, ఆయిల్ పామ్ రైతు సంఘం నాయకులు మన్నెం సదాశివారెడ్డి, బ్రహ్మారెడ్డి, తూముల ఇంద్రసేనారావు, మల్లెల నాగిరెడ్డి, మహానందరెడ్డి, బాబురావు, వెంకటేశ్వర్ రెడ్డితో పాటు ఉద్యాన విస్తరణ అధికారులు, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్లు, డ్రిప్ కంపెనీ అధికారులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యమా నిర్మాణ లోపమా..?

**బేతవోలు ఎస్బిఐ బ్యాంకులో అపరిశుభ్రంగా మూత్రశాల గదులు**

**చిలుకూరు, సెప్టెంబర్,10: ( వుదయం )**



మండల పరిధిలోని బేతవోలు గ్రామంలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 'ఎస్బిఐ' శాఖలో నిర్వహణ లోపంతో కంపు కొడుతున్న మూత్రశాలా గదులు నిరుపయోగంగా పడి ఉన్నవి, బ్యాంకు నిర్వాహనకు నిధులు జమవుతున్నాయా లేక జమ అవుతున్న నిధులు సంబంధిత కార్యనిర్వాహణ అధికారులు దుర్వినియోగపరుస్తున్నారా వారి నిర్లక్ష్యం వల్ల బ్యాంకులోని మూత్రశాల గదులు ఈ విధంగా ఉన్నవి అని వివిధ పార్టీల నాయకులు కుల సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు, బేతవోలు గ్రామంలో ఉన్నటువంటి ఎస్బిఐ బ్యాంకు కి సుమారు చుట్టుపక్కల ఏడు గ్రామాల నుండి నిత్యం డ్వాక్రా సంఘాల మహిళలు వచ్చి పోతుంటారు, ఖాతాదారులు వచ్చిపోతుంటారు అని నిర్వాహన నిర్లక్ష్యంతో వాటిని వినియోగించడం కష్టంగా ఉందని మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని వీటిని వెంటనే ఉపయోగంలోకి తీసుకొని రావాలని బిజెపి చిలుకూరు మండల పార్టీ అధ్యక్షులు పారెల్లి మహేష్ అన్నారు.

# ప్రజా సంక్షేమమే...బ్రహ్మాస్త్రం

**రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్**

**కల్లూరు, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)**



దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టిస్తున్న సంక్షేమ సునామీ చూసి ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్ట దయానంద్ విజయ్ కుమార్ కుండబద్దలు కొట్టారు. సామాన్యుడి కన్నీళ్లు తుడిచే ఆయుధాలుగా కాంగ్రెస్ పథకాలు క్షేత్రస్థాయిలో అద్భుతాలు సృష్టిస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ పదేళ్ల వంచన కాంగ్రెస్ 1000 రోజుల పాలన గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనను ఒక చీకటి అధ్యాయంగా అభివర్ణించిన డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ ఆ నిరంకుశ ప్రభుత్వంలో పేదలకు కనీసం రేషన్ కార్డులో తప్పులు సరిదిద్దుకునే ప్రాథమిక హక్కు కూడా కరువైందని దుయ్యబట్టారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో ఊరు బయట వంద ఇళ్లు కట్టి చేతులు దులుపుకున్న కేసీఆర్ సర్కార్, పేదల సొంతింటి కలను ఒక ఎండమావిగా మార్చాడని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యంలో ప్రజల నాడి తెలుసుకుని పాలించడమే నిజమైన ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉక్కు సంకల్పంతో రేవంత్ సర్కార్ అడుగులు గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి లోటు బడ్జెట్ అప్పగించినా, కేంద్రంలోని బీజేపీ సవతి తల్లి ప్రేమ చూపుతూ నిధులు ఆపుతున్నా... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపకుండా ఉక్కు సంకల్పంతో ముందుకు సాగుతున్నారని డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ ప్రశంసించారు. మంత్రుల సమన్వయంతో పేదల పక్షాన నిలబడుతున్న ప్రభుత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు ఒక అద్భుతం అని ప్రశంసిస్తూ గూడు లేని పేదవాడికి సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం, దానికి తోడు రూ. 5 లక్షల బీమా కవచం అందించడం దేశంలో ఎక్కడా లేదని అన్నారు. ప్రతిపక్షాలు తమ ఉనికిని కాపాడుకునేందుకు ఎన్ని కుట్రలు చేసినా, ఎంత విషప్రచారం చేసినా వాస్తవాలు గ్రహించే విజ్ఞత తెలంగాణ సమాజానికి ఉందని డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ తేల్చి చెప్పారు. దశాబ్దాలుగా పేదల పక్షాన నిలబడిన కాంగ్రెస్ పార్టీ, తన రికార్డులను తానే బద్దలు కొడుతూ రాబోయే దశాబ్దం పాటు తెలంగాణ గడ్డపై తిరుగులేని శక్తిగా ప్రజలకు సేవలందిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# వరి సాగులో ఆధునిక పద్ధతులపై రైతులకు శిక్షణ

**చర్ల, సెప్టెంబర్ 10: (వుదయం ప్రతినిధి)**




చర్ల మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ కార్యక్రమం ద్వారా రైతులకు వివిధ పంటల సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. భద్రాచలం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బి. సుధాకర్ రావు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా వరిలో నేరుగా విత్తే పద్ధతి (డియస్ఆర్), సన్న రకాల వరి సాగు, భూసార పరీక్షల ప్రాధాన్యత, ఆయిల్‌ఫామ్ సాగు తదితర అంశాలపై రైతులకు వివరించారు. అలాగే ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం పరిస్థితుల్లో మార్పులు సంభవించే అవకాశం ఉన్నందున, వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలను సాగు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. రైతులు ఆధునిక సాగు పద్ధతులను అవలంబించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. భూసార పరీక్షలు నిర్వహించుకుని నేల స్వభావానికి అనుగుణంగా పంటలు, ఎరువులను ఎంపిక చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రవితేజ రెడ్డి, మైరాడా అగ్రానమిస్ట్ షణ్ముఖ సాయి, వ్యవసాయ విస్తరణ అధికారి అఫ్రిద్, ఐటీసీ సోషల్ మొబిలైజర్ నవీన్, నాగేశ్వరరావుతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దాం

**-- పర్యావరణహితంగా గణేశ్ ఉత్సవాలు నిర్వహించాలి.**
**-- 2 వేల మట్టి విగ్రహాల ఉచిత పంపిణీ చేసిన కలెక్టర్, ఎస్పీ.**

**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబరు 10 (వుదయం ప్రతినిధి) :**



పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజలకు పిలుపునిచ్చారు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాలకు బదులుగా మట్టితో తయారు చేసిన విగ్రహాలను వినియోగించాలని సూచించారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితే ప్రారంభించారు. అనంతరం పర్యావరణ హిత గణేశ్ ఉత్సవాలపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లాలో 2 వేల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పర్యావరణహితంగా నిర్వహించాలని అన్నారు. ప్రకృతి, జలవనరులను పరిరక్షిస్తూ భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల అధికారులు, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఏఈఈ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి జిల్లాలో ఆహార భద్రత శాఖ ప్రత్యేక తనిఖీలు



**పెద్దపల్లి ,సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్ర ఆహార భద్రత కమిషనర్ మరియు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, ప్రజలకు సురక్షితమైన, పరిశుభ్రమైన మరియు నాణ్యమైన ఆహారం అందుబాటులో ఉండేలా నేడు పెద్దపల్లి జిల్లాలోని పలు ఆహార వ్యాపార సంస్థలపై ఆహార భద్రత శాఖ ప్రత్యేక తనిఖీలు నిర్వహించింది.

బ్రెడ్ తయారీలో పరిశుభ్రత పాటించడం లేదని అందిన ఫిర్యాదు మేరకు బేకరీని తనిఖీ చేయగా, విక్రయానికి ఉంచిన బ్రెడ్‌పై ఫంగస్ పెరిగి ఉండటం గుర్తించబడింది. అదేవిధంగా, ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం, 2006 ప్రకారం తప్పనిసరిగా పొందవలసిన FSSAI నమోదు/లైసెన్స్ లేకుండానే బేకరీ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. దీంతో అవసరమైన FSSAI నమోదు/లైసెన్స్ పొందే వరకు మరియు ఆహార భద్రత నిబంధనలను పూర్తిగా పాటించే వరకు బేకరీ కార్యకలాపాలను తక్షణమే నిలిపివేయాలని ఆదేశించారు. సంబంధిత చట్టపరమైన చర్యలు ప్రారంభించబడ్డాయి.

గత తనిఖీలో జారీ చేసిన ఆదేశాల అమలును పరిశీలించేందుకు ఫాలో అప్ తనిఖీ నిర్వహించబడింది. తనిఖీలో కృత్రిమ ఆహార రంగుల వినియోగాన్ని నిలిపివేసినట్లు గుర్తించబడింది. అయితే, రెస్టారెంట్‌లో ఇంకా పచ్చి గుడ్లతో తయారు చేసిన మయోనైస్‌ను తయారు చేసి వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ఇది ప్రజారోగ్యానికి హానికరమయ్యే అవకాశం ఉన్నందున వంటగదిలో ఉన్న సుమారు 3 కిలోల పచ్చి గుడ్ల మయోనైస్‌ను అక్కడికక్కడే పారవేయించి, వెంటనే దాని తయారీ మరియు వినియోగాన్ని నిలిపివేయాలని ఆహార వ్యాపార నిర్వాహకుడిని ఆదేశించారు. నిబంధనలు పాటించని పక్షంలో తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి. రెస్టారెంట్ అత్యంత అపరిశుభ్రమైన పరిస్థితుల్లో నిర్వహించబడుతున్నట్లు గుర్తించబడింది. డ్రైనేజీ వ్యవస్థ మూసుకుపోవడంతో వంటగదిలో నీరు నిల్వ ఉండటం, అధిక సంఖ్యలో ఈగలు సంచరించడం గమనించబడింది. వంట చేసే ప్రదేశం చుట్టూ కూడా నీరు నిల్వ ఉండటం వల్ల, ముఖ్యంగా వర్షాకాలంలో ఆహారం కలుషితమయ్యే ప్రమాదం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం, 2006 ప్రకారం పరిశుభ్రత ప్రమాణాలను వెంటనే అమలు చేయాలని మరియు లోపాలను సరిదిద్దాలని ఆహార వ్యాపార నిర్వాహకుడిని ఆదేశించారు. సంబంధిత అమలు చర్యలు ప్రారంభించబడ్డాయి.

ఆహార భద్రత నిబంధనలను ఉల్లంఘించే ఆహార వ్యాపార సంస్థలపై కఠినమైన చర్యలు కొనసాగుతాయని ఆహార భద్రత శాఖ స్పష్టం చేసింది.

ప్రజారోగ్య పరిరక్షణ మరియు వినియోగదారులకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందుబాటులో ఉండేలా పెద్దపల్లి జిల్లాలో తనిఖీలు మరియు అమలు చర్యలు నిరంతరం కొనసాగుతాయి.

# గణేశ్ ఉత్సవాలకు సమన్వయంతో ఏర్పాట్లు

**-- మండపాల నిర్వాహకులు పోలీస్, విద్యుత్ శాఖ వద్ద వివరాలు నమోదు చేసుకోవాలి.**
**-- కలెక్టర్ గరిమ అగ్రవాల్.**

**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబరు 10 (వుదయం ప్రతినిధి) :**



గణేశ్ నవరాత్రి ఉత్సవాలను వైభవంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వినాయక చవితి ఏర్పాట్లపై ఎస్పీ మహేష్ బి. గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల అధికారులతో కలిసి గురువారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు.ఉత్సవాల సందర్భంగా మున్సిపల్, పోలీస్, విద్యుత్, మత్స్య, రవాణా, ఆర్అండ్‌బీ, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో నిమజ్జనానికి అవసరమైన క్రేన్లు, జేసీబీలు, విద్యుత్ దీపాలు,

నీటి సదుపాయాలను సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మండపాల వద్ద డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసి పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు.నిమజ్జన మార్గాల్లో విద్యుత్ తీగల వల్ల ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎన్‌పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసి సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. మండపాల నిర్వాహకులు తమ వివరాలను విద్యుత్ శాఖ వద్ద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తెలిపారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధితో పాటు గ్రామ పంచాయతీల్లో నిమజ్జనం సందర్భంగా జాలర్లను అందుబాటులో ఉంచాలని మత్స్య శాఖ అధికారులకు సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 24 గంటలూ అంబులెన్స్‌లు, మందులు, ప్రథమ చికిత్స కిట్లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. సిరిసిల్ల జీజీహెచ్, వేములవాడ ఏరియా ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు సమన్వయంతో భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, నిమజ్జనం సజావుగా జరిగేలా రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. విగ్రహాలు వెళ్లే మార్గాల్లో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో బారికేడింగ్, లైటింగ్, క్రేన్లను ముందుగానే సిద్ధం చేయాలని తెలిపారు. నిమజ్జనం అనంతరం రెండు, మూడు రోజులపాటు వార్డులు, గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు.సిరిసిల్ల,

వేములవాడ డివిజన్లతో పాటు మండల స్థాయిలో ఆర్డీవోలు, తహసీల్దార్లు వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఉత్సవాల ప్రారంభం నుంచి నిమజ్జనం వరకు చేపట్టాల్సిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు.

వివరాల నమోదు తప్పనిసరి..

జిల్లాలోని గణేశ్ మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. నిమజ్జనం రోజున నిర్ణీత సమయానికి విగ్రహాలను తరలించాలని కోరారు. ప్రతి మండపం వద్ద ప్లాస్టిక్ డ్రమ్‌లలో నీరు, ఇసుక అందుబాటులో ఉంచాలని సూచించారు.మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, వారికి ఎలాంటి ఇబ్బంది కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

ఈ సమావేశంలో ఆర్డీవోలు శ్రీధర్‌బాబు, కేఎస్‌బీ కుమారి, డీఎస్పీలు నాగేంద్రాచారి, శ్రీనివాసులు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్, ఎక్సైజ్ అధికారి హిమశ్రీ, అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, ఈఈ పీఆర్ సుదర్శన్‌రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారి దయాకర్, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రులసహకారం కీలకం

"దివ్యాంగులు" అనే పదం కంటే "ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన పిల్లలు" అని ప్రోత్సహించాలి: అదనపు కలెక్టర్ (రెవెన్యూ ) బి. శ్రీరాములు

**పెద్దపల్లి, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)**

శిక్షణ, జిల్లా విద్యాశాఖ మరియు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు (Children with Special Needs - CWSN) విద్యార్థుల తల్లిదండ్రుల కోసం జిల్లా స్థాయి Sensitisation కార్యక్రమం గురువారం పెద్దపల్లిలోని శ్రీనివాస గార్డెన్స్‌లో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ ) బి.శ్రీరాములు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల సమగ్ర అభివృద్ధి, విద్య, ఆరోగ్యం మరియు భవిష్యత్ అవకాశాల కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.

CWSN విద్యార్థులను కేవలం "దివ్యాంగులు" అని పిలవడం కంటే, వారిలో ఉన్న ప్రత్యేక నైపుణ్యాలను గుర్తించి, ప్రోత్సహించి, వారి ప్రతిభను వెలికితీయడం సముచితమని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై నమ్మకంతో, ప్రేమతో, ప్రోత్సాహంతో ముందుకు నడిపించాలని సూచించారు.

వైకల్యాన్ని అధిగమించి స్ఫూర్తిగా నిలిచిన అంజారెడ్డికార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న శ్రీ అంజారెడ్డి తన జీవిత అనుభవాలను పంచుకున్నారు. సుమారు 25 సంవత్సరాల క్రితం జరిగిన ప్రమాదంలో రెండు కాళ్లను కోల్పోయినప్పటికీ, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగిన తన ప్రయాణాన్ని వివరించారు. ఆయన అందించిన ప్రేరణాత్మక సందేశం CWSN విద్యార్థుల తల్లిదండ్రులకు

దిక్సూచిగా నిలిచింది.దివ్యాంగుల ప్రతిభకు విద్యే బలమైన సాధనండా. మధుసూదన్ రెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపల్, SRR కళాశాల మాట్లాడుతూ, దివ్యాంగులైన అనేక మంది అధ్యాపకులు తమ ప్రతిభతో ఉన్నతంగా రాణించి, తల్లిదండ్రులే CWSN పిల్లలకు అండ

హైదరాబాద్‌కు చెందిన హరిబాబు (NGO ప్రతినిధి )మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల జీవితంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ప్రేమ, సంరక్షణ, ప్రోత్సాహం మరియు అండదండల వల్లే పిల్లలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగగలరని వివరించారు.CWSN పిల్లల శారీరక, మానసిక వికాసంపై సూచనలు డా. ఏ. జగదీష్,సీనియర్ కన్సల్టెంట్ - నియోనేటల్ & పీడియాట్రిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్(న్యూరో డెవలప్‌మెంటల్ డిజెబిలిటీస్), డెవలప్‌మెంటల్ పీడియాట్రిక్స్, హెచ్‌ఓడీ - DHC, అపోలో హాస్పిటల్స్, హైదరాబాద్,CWSN పిల్లల శారీరక, మానసిక మరియు న్యూరో డెవలప్‌మెంటల్ వికాసానికి అవసరమైన అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లల అభివృద్ధిలో ప్రారంభ దశలోనే సరైన గుర్తింపు, చికిత్స, శిక్షణ మరియు నిరంతర పర్యవేక్షణ ఎంతో ముఖ్యమని సూచించారు.ఈ కార్యక్రమంలో ఐ.ఈ. కోఆర్డినేటర్ శ్రీమతి జి. కవిత, ప్లానింగ్ కోఆర్డినేటర్ చేపూరి మల్లేష్ గౌడ్, డా. మధుసూదన్ రెడ్డి, డా. ఏ. జగదీష్, హరిబాబు, మండల విద్యాధికారులు, CWSN విద్యార్థుల తల్లిదండ్రులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కష్టాలు ఎన్ని ఉన్నా జీవించి సాధిద్దాం

**-- హనుమకొండ జిల్లా డిఎంహెచ్‌ఓ డాక్టర్ ఏ అప్పయ్య**

**హసన్ పర్తి సెప్టెంబర్10 (వుదయం ప్రతినిధి):**



ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కష్టాలు ఎన్ని ఉన్నా జీవించి సాధించాలని డాక్టర్ అప్పయ్య అన్నారు. కమిషనర్ కుటుంబ సంక్షేమ, తెలంగాణ ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు హసన్ పర్తి మండలం సిద్ధాపూర్ గ్రామ ప్రభుత్వ జిల్లా ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఆత్మహత్యల నివారణ దినోత్సవం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య హాజరై మాట్లాడుతూ...., కమిషనర్ కుటుంబ సంక్షేమ శాఖ, తెలంగాణ ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు విద్యా సంస్థల్లో ఆత్మహత్యల నివారణ గురించి జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని విద్యా సంస్థల్లో నిర్వహించాలని ఆయన సూచించారు. ఆత్మహత్యల నివారణ, మానసిక ఆరోగ్యం, చదువులో పిల్లలు ప్రతి ఒక్కరూ ఏ రోజు హోంవర్క్ ఆ రోజే పూర్తి చేయాలని, పిల్లల్లో ఎవరైనా వారికి వారే మాట్లాడు కోవడం, ఒంటరిగా ఉండడం, ఏమన్నా మానసిక ఆరోగ్య సమస్యలు ఇబ్బందులు తలెత్తినట్టయితే తల్లిదండ్రులతో, టీచర్స్‌తో పాల్పంచు కోవాలని తెలిపారు. 14416, 104 టోల్ ఫ్రీ నెంబర్ ల యొక్క ప్రాధాన్యత పై తెలియజేశారు. మాట్లాడుదాం విందాం అండగా నిలుద్దాం ప్రాణాలను కాపాడుదాం ప్రతి జీవితం విలువైనదే ఆత్మహత్య నివారణ మన అందరి బాధ్యత అని డిఎంహెచ్వో డాక్టర్ ఏ అప్పయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్సిడిప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మురళి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీపాల్, జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులుపాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకం




**జయశంకర్ భూపాలపల్లి జిల్లా సెప్టెంబర్ 10(వుదయం ప్రతినిధి)**

చాకలి ఐలమ్మ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని కొనసాగిద్దాం అని ఐస విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షురాలు బుర్ర స్వాతి తెలిపారు జిల్లాకేంద్రంలో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఐసా విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షురాలుబుర్రస్వాతి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల హక్కు కోసం పేదల కోసం,అనవారిన వర్గాల కోసం ఆత్మగౌరవం కోసం ధైర్యంగా పోరాడిన మహావీరనారిఅని తెలిపారు భూస్వామ్య దోపిడీకి అన్యాయానికి వ్యతిరేకంగా చూపిన ధైర్యం తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. చాకలి ఐలమ్మ పోరాటం కేవలం ఒక వ్యక్తి పోరాటం కాదని పేదలు బడుగు బలహీన వర్గరాత్మ గౌరవం కోసం కొనసాగిన సామాజిక పోరాటాన్ని ప్రతీక అని అన్నారు నేటి సమాజంలో కూడా బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ, అనగారిన వర్గాల సమాన అవకాశాలు సామాజిక న్యాయం రాజకీయ ప్రధానిత దక్కించుకోవాల్సిన అవసరం ఉందన్నారు చాకలి ఐలమ్మ స్ఫూర్తిగా తీసుకొని సామాజిక న్యాయం కోసం పోరాడుతామని ఐస విద్యార్థి సంఘం నిరంతరం పోరాడుతుందన్నారు.

# మేడపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో రాజారెడ్డి

**నల్లబెల్లి, సెప్టెంబర్ 10( వుదయం):**



మండల పరిధిలోని మేడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ బి. రాజారెడ్డి గురువారం సందర్శించారు. ఆసుపత్రిలోని రికార్డులను తనిఖీ చేసి, వైద్య సేవల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోగులకు సకాలంలో మెరుగైన వైద్యం అందించాలని, ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలను చేరుకుంటూ రికార్డుల నిర్వహణలో కచ్చితత్వం పాటించాలని వైద్యాధికారి జ్యోతి, సిబ్బందికి ఆదేశించారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**రూ. 4,500 నగదు సీజ్, ఎనిమిది మందిపై కేసు నమోదు**

**నల్లబెల్లి, సెప్టెంబర్ 10( వుదయం):**

మండల పరిధిలోని నందిగామ గ్రామంలో గురువారం సాయంత్రం విశ్వసనీయ సమాచారం మేరకు నల్లబెల్లి పోలీసులు దాడి చేసి, పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై సాయి ప్రసన్నకుమార్ తెలిపిన వివరాల ప్రకారం. గ్రామంలో రహస్యంగా పేకాట స్థావరం నిర్వహిస్తున్నారనే సమాచారంతో పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పట్టుకుని, వారి వద్ద నుంచి రూ. 4,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**ఎస్ పి ఎం కార్మికుల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించిన**

# ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబుకు కార్మికుల కృతజ్ఞతలు



**కాగజ్‌నగర్ (వుదయం ప్రతినిధి)**

సిర్పూర్ పేపర్ మిల్లులో కార్మిక సంఘాల గుర్తింపు (వెరిఫికేషన్) ఎన్నికలను వెంటనే నిర్వహించాలని సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు గురువారం రోజు అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరడంపై ఎస్ పి ఎం కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.సిర్పూర్ పేపర్ మిల్లులో కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని, ఎన్నికల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, గత నాలుగు నెలలుగా కార్మికులు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం వెంటనే స్పందించాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే హరీష్ బాబు కోరినందుకు కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ పి ఎం కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈరోజు SPM ప్రధాన గేటు ముందు బాణాసంచా పేల్చి, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబుకు ధన్యవాదాలు తెలిపారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు. కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు నిర్వహించడం ద్వారా కార్మికులు తమకు నచ్చిన సంఘాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకునే అవకాశం కల్పించాలని JAC నాయకులు కోరారు. కార్మికుల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే హరీష్ బాబుకు ఈ సందర్భంగా వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఎస్ పి ఎం గుర్తింపు ఎన్నికల ప్రక్రియను ప్రభుత్వం వెంటనే ప్రారంభించి, కార్మికుల ప్రజాస్వామ్య హక్కును కాపాడాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు.

# పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

**అదనపు కలెక్టర్ యువరాజ్ మార్మాట్.**

**ఆసిఫాబాద్(వుదయం ప్రతినిధి ):**




ప్రీప్రైమరీ పాఠశాలల్లో సుందరీకరణ, పెయింటింగ్ పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) యువరాజ్ మర్మాట్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆసిఫాబాద్, రెబ్బెన మండలాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఆసిఫాబాద్ మండలం బుర్గుడ, రెబ్బెన మండలం తల్లాలపల్లి గ్రామాల్లోని పూర్వ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి, పాఠశాల ఆవరణలో చేపడుతున్న సుందరీకరణ,

రంగుల పనులను పరిశీలించారు. చిన్నారులకు ఆహ్లాదకరమైన, ఆకర్షణీయమైన వాతావరణంలో విద్య అందేలా పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం పాఠశాల చిన్నారులతో అదనపు కలెక్టర్ ఆప్యాయంగా ముచ్చటించారు. వారి చదువు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారులను ఉత్సాహపరిచారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు చిన్నారుల ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ ఆశయాలు ఆదర్శనీయం

మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి

**ధర్మపురి,సెప్టెంబర్ 10 (వు దయం ప్రతినిధి):**

భూమి కోసం, భుక్తి కోసం, పేదల హక్కుల కోసం దొరల పెత్తనానికి వ్యతిరేకంగా ధైర్యం గా పోరాడిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ అని ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి కొనియాడారు. తెలంగాణ రైతాంగ పోరాటంలో ఆమె చూపిన ధైర్యసాహసాలు, ఆత్మగౌరవం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.ధర్మపురి పట్టణ నంది చౌక్ వద్ద రజక సంఘం అధ్యక్షుడు కొనపర్తి రాజేందర్ ఆధ్వర్యంలో గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ నాగలక్ష్మి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా చైతన్యానికి, చాకలి ఐలమ్మ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనబట్ల దినేష్, కౌన్సిలర్లు చిపిరిశెట్టి రాజేష్, సంగి ఆనంద్, రజక సంఘం ప్రధాన కార్యదర్శి బండపెల్లి సత్తయ్య, కోశాధికారి గుండారపు ఆర్జయ్య, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

**హనుమకొండ, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి) :**



రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు హనుమకొండలోని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 3వ తేదీన జరిగిన హనుమకొండ జిల్లా సబ్ జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలలో పాఠశాలకు చెందిన విద్యార్థులు పోలేపాక విల్, పోలేపాక విష్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది.

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని తిలక్ స్టేడియంలో సెప్టెంబర్ 11 నుండి 13 వరకు జరగనున్న 11వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో వీరు హనుమకొండ జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. మత్యాస్ రెడ్డి, డైరెక్టర్ జి. సునీత రెడ్డి, కోచ్ పోలేపాక వినయ్ మరియు వ్యాయామ ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో కూడా అద్భుత ప్రతిభ కనబరిచి పాఠశాలకు, హనుమకొండ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ ఎమ్మార్వో ప్రారంభం

**పేదల ఆరోగ్యానికి అండగా 200 మందికి వైద్య పరీక్షలు..**

**రాయపర్తి, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):**



ఉచిత వైద్య శిబిరాన్ని రాయపర్తి గ్రామంలో మండల తహసిల్దార్ ముల్కనూరి శ్రీనివాస్ గ్రామ సర్పంచ్ గారే సహేంద్ర బిక్షపతి కలిసిప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మెడికవర్ హాస్పిటల్‌కు చెందిన వివిధ విభాగాల వైద్య నిపుణులు శిబిరంలో పాల్గొని గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య సమస్యలను పరిశీలించారు.అవసరమైన వారికి వైద్య సూచనలు, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా శిబిరాన్ని నిర్వహించినట్లు గ్రామ సర్పంచ్ గారే సహేంద్ర బిక్షపతి తెలిపారు.ప్రజల ఆరోగ్యమే లక్ష్యం.. ఉచిత వైద్య సేవలే ధ్యేయం అనే సంకల్పంతో శిబిరాన్ని నిర్వహించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి వైద్య శిబిరాలను భవిష్యత్తులోనూ నిర్వహించి ప్రజలకు మరింత చేరువగా వైద్య సేవలు అందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి,ఉప సర్పంచ్ మచ్చ రమేష్, ఎండి నహీం,పంచాయతీ కార్యదర్శి గుగులోతు యాకూబ్ నాయక్, కారోబార్ కారుపోతుల రామచంద్రయ్య, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆత్మగౌరవాన్ని చాటేందుకు వేలాదిగా తరలిరావాలి

**వరంగల్ జిల్లా నల్లబెల్లి వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 10.**



ఆర్యవైశ్యుల ఆత్మగౌరవం, ఐక్యత, సంఘటిత శక్తిని చాటేందుకు ఈ నెల 13న హైదరాబాద్ లో నిర్వహించనున్న ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనానికి జిల్లా నుంచి వేలాదిమంది ఆర్యవైశ్యులు తరలిరావాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా కోశాధికారి గందె శ్రీనివాస్ గుప్తా పిలుపునిచ్చారు.ఈ సమ్మేళనం కేవలం ఆత్మీయ కలయిక మాత్రమేకాదని, ఆర్యవైశ్యుల ఐక్యతను, సామాజిక చైతన్యాన్ని, సంఘటితశక్తిని చాటే వేదికగా నిలవనుందన్నారు. ప్రతి కుటుంబం నుంచి ప్రతినిధులు పాల్గొని సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆర్యవైశ్యులంతా ఒక్కతాటిపై నిలిచి మన ఆత్మగౌరవాన్ని చాటేలా భారీ సంఖ్యలో తరలివచ్చి సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని శ్రీనివాస్ గుప్తా విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా తీజ్ ముగింపు ఉత్సవాలు

**నర్సంపేట వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 10:**



ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), నర్సంపేటలో బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే తీజ్ ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి గోర్ సిక్వాడి నేషనల్ అసాభి కునోసోత్ హాత్యానాయక్ ముఖ్య అతిథిగా, వరంగల్ గోర్ బంజారా ప్రధాన కార్యదర్శి బాదావత్ సీతారాం నాయక్ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ గొప్పతనమని, విద్యార్థులు ఆధునిక విద్యతో పాటు తమ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించి పరిరక్షించుకోవాలని సూచించారు. తీజ్ పండుగ బంజారా జీవన విధానం,

ప్రకృతి ఆరాధన, కుటుంబ అనుబంధం, సామాజిక ఐక్యతకు ప్రతీక అని అతిథులు పేర్కొన్నారు. తీజ్ ఉత్సవ కమిటీ కన్వీనర్ డాక్టర్ బద్రు భూక్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించిన బిఆర్ఎస్ పార్టీ నేతలు

**ఖానాపురం, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):**



మండలంలోని బుధరావుపేట గ్రామ శివారు రామలింగయ్యపల్లెకు చెందిన కుర్రముల ఎల్లయ్య(65) మృతి చెందగా మృతదేహాన్ని బిఆర్ఎస్ పార్టీ నాయకులు సందర్శించి మృతదేహంపై పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎస్ కే యాకూబ్ పాషా, నాయకులు కాసా ప్రవీణ్ కుమార్, ఎస్.కె మౌలానా, సుధా గాని మురళి, ఎస్.కె జుబేర్, ఎస్ కే రహీం, బండి రాజు, చెడిపాక శీను, బానోతు నగేష్, ఎర్రబెల్లి మల్లయ్య, బొల్లం వీరస్వామి, ఆకుల లక్ష్మణ్, బాబు, అఫ్జల్, సింగు పాండరి తదితరులు పాల్గొన్నారు.

# విశ్వబ్రాహ్మణ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా కమిటీలు ఏర్పాటు



**పరకాల సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):**

తెలంగాణ విశ్వబ్రాహ్మణ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్, హనుమకొండ జిల్లాలకు నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా కుంటమల్ల అరవింద్, ప్రధాన కార్యదర్శిగా మునిగంటి అమరేంద్ర చారి; హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా ఉల్లి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా దంచనాల రాజు ఎన్నికయ్యారు.వరంగల్‌లోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణ మండపంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు తూములూరి సత్యనారాయణ మాట్లాడుతూ జర్నలిస్టుల వృత్తిపరమైన సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం సమిష్టిగా పనిచేయాలని సూచించారు. స్థానిక సమస్యలను

రాష్ట్రస్థాయికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని నూతన కమిటీలకు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు అలుగూరి హరినాథ్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ మండలోజు కృష్ణ ప్రసాద్, ఇతర రాష్ట్ర నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో పోటీకి 'సై' అంటున్న శిల్పి నగర్, కేజీబీవీ విద్యార్థులు

**భద్రాచలం, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):**



ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, వారి అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని భద్రాచలం మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాసరావు అన్నారు. భద్రాచలం మండలంలోని శిల్పి నగర్ ప్రాథమిక పాఠశాల, కేజీబీవీ భద్రాచలం పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన స్థాయిని, పాఠశాలలో అమలు చేస్తున్న వివిధ విద్యా కార్యక్రమాలను, మౌలిక వసతులను, పరిశుభ్రత, పచ్చదనం, మధ్యాహ్న భోజన నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ బెక్కంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో సమానంగా పోటీపడే విధంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. శిల్పి నగర్ ప్రాథమిక పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థులు ఎంతో చురుకుగా, ఉత్సాహంగా విద్యను అభ్యసిస్తూ తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారని చెప్పారు. గుణాత్మకమైన విద్యతో పాటు విద్యార్థి కేంద్రంగా బోధన సాగడం వల్ల పిల్లల్లో చదువుపై ఆసక్తి, ఆత్మవిశ్వాసం పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల రిసోర్స్ పర్సన్ టి. రామకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయిని కృష్ణకుమారి, ఉపాధ్యాయిని స్రవంతి, స్వచ్ఛ మిత్ర సేవకురాలు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి

- కలెక్టర్లకు వాణి ప్రసాద్ ఆదేశం
- జ్ఞాన భారతం మిషన్ లో ప్రాచీన గ్రంథాల డిజిటలైజేషన్ - పర్యాటకం, జ్ఞాన భారతంపై వీడియో కాన్ఫరెన్స్

**సూర్యాపేట, సెప్టెంబర్ 9: వుదయం ప్రతినిధి**

ప్రతి జిల్లాలో ఉన్న ప్రత్యేక పర్యాటక సామర్థ్యాన్ని గుర్తించి, పర్యాటక అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఏ. వాణి ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం పర్యాటక అభివృద్ధి, జ్ఞాన భారతం మిషన్ అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సమీకృత కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాణి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ప్రతి జిల్లాలోని ముఖ్య పర్యాటక ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 142 వీకెండ్ గేట్ వే పర్యాటక ప్రాంతాలను గుర్తించామని, వాటి అభివృద్ధికి మౌలిక వసతులు, పెట్టుబడి అవకాశాలు, ప్రచార కార్యక్రమాలను రూపొందించాలన్నారు. ప్రతి జిల్లాకు మూడేళ్ల పర్యాటక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, పీపీపీ విధానంలో ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించాలని సూచించారు. జ్ఞాన భారతం మిషన్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, చారిత్రక ప్రదేశాలు, దేవాలయాల్లో ఉన్న ప్రాచీన గ్రంథాలు, శాసనాలు, మాన్యుస్క్రిప్టులను గుర్తించి సంరక్షించి డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయి సమావేశం నిర్వహించి సమగ్ర సర్వే చేపట్టి నివేదిక సమర్పించాలని, అదనపు కలెక్టర్లు నోడల్ అధికారులుగా వ్యవహరించాలని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, సీసీ కెమెరాలు, సైన్ బోర్డులు, సమాచార కియోస్క్ లు, గైడ్లు, ఫుడ్ కోర్టులు, దివ్యాంగులకు అనుకూల మార్గాలు వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. 8 జిల్లాల్లో 16 వారసత్వ ప్రదేశాలను రూ.8.45 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్ఓ ప్రేమ్ రాజ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు రవితేజ, అనూష, యూత్ వెల్ఫేర్/పర్యాటక శాఖ అధికారి వెంకట్ రెడ్డి, జీఎం ఇండస్ట్రీ భారతి, టూరిజం ఏఈ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.




## తాడ్వాయి లిఫ్ట్ కు శాశ్వత నీటి వసతి కల్పిస్తాం

- లో లెవెల్ కాలువ, పైపులైన్ మంజూరుకు కృషి చేస్తా
- సర్పంచ్ కొలిశెట్టి రాంబాయమ్మ బుచ్చిపాపయ్య

**మునగాల, సెప్టెంబర్ 10 (వుదయం):**



తాడ్వాయి గ్రామ శివారులోని కవంచిగడ్డ వాగుపై ఏర్పాటు చేసిన లిఫ్ట్ పంపు మోటార్లను స్థానిక సర్పంచ్ కొలిశెట్టి రాంబాయమ్మ బుచ్చిపాపయ్య ప్రారంభించారు. అనంతరం లిఫ్ట్ ప్రాంతాన్ని, వాగులోని నీటి పరిస్థితిని పరిశీలించారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా లిఫ్ట్ ద్వారా నీటిని అందించేందుకు అవసరమైన చర్యలపై రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతి రెడ్డి సహకారంతో మునగాల మొదటి లిఫ్ట్ నుంచి తాడ్వాయి లిఫ్ట్ వరకు లో లెవెల్ కాలువ, పైపులైన్ మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ పనులు పూర్తయితే తాడ్వాయి పరిసర ప్రాంతాల రైతులకు సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆమె పేర్కొన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి సౌకర్యాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని, సంబంధిత అధికారులతో మాట్లాడి కాలువ, పైపులైన్ మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వట్యావుల సైదులు, 9వ వార్డు సభ్యుడు జిల్లేపల్లి సుమన్, కొండమీది లక్ష్మీనారాయణ, రైతులు వల్లోజ్ శీను, చిర్ర శీను, పరెడ్డి శ్రీనివాసరెడ్డి, విరబోయిన సైదులు, వట్యావుల సైదులు, బెల్లి మధు, సతీష్, దేశగాని శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 13న జరగబోయే సెమినార్ ను జయప్రదం చేయండి




**సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాములు**

**చిలుకూరు సెప్టెంబర్ 10 :( వుదయం )**

అఖిలభారత పూర్వపు కార్యదర్శి అమర జీవి కామ్రేడ్ సీతారాం ఏచూరి ద్వితీయ వర్ధంతి సందర్భంగా సెప్టెంబర్ 13వ తేదీ ఆదివారం ఉదయం 10:30 గంటలకు ఎస్వీ డిగ్రీ కళాశాల ఆడిటోరియం సూర్యాపేట నందు సెమినార్ జరుగుతుందని ఈ సెమినార్ కు ప్రజలందరూ అధిక సంఖ్యలో హాజరు కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు తెలిపారు ఆయన గురువారం మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో సెమినార్ కరపత్రాన్ని ఆవిష్కరించారు ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ, భారత రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన సీతారామ్ ఏచూరి అన్నారు రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజాస్వామ్యం కోసం లౌకిక విలువల కోసం నిరంతరం పోరాడిన గొప్ప నాయకుడు ఏచూరి అని అన్నారు, అలాంటి మాహ బావుని ఆశయ సాధన కోసం పునరంగితం కావాలని పిలుపునిచ్చారు వారి వర్ధంతి సందర్భంగా సెమినార్ కు ముఖ్య అతిథులుగా న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రభీర్ పుర్కాయస్థ న్యూఢిల్లీ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మల్లు లక్ష్మి , హాజరవుతున్నారని ఆయన తెలిపారు, ఈ సెమినార్లో జిల్లాలో ఉన్నటువంటి మేధావులు విద్యార్థులు ఉపాధ్యాయులు ప్రజలు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు,ఈ యొక్క కార్యక్రమంలో, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మేదర మెట్ల వెంకటేశ్వరరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జల్లేపల్లి నరసింహారావు, సిపిఎం మండల కార్యదర్శి నాగాటి రాములు, సిపిఎం సీనియర్ నాయకులు వేనేపల్లి వెంకటేశ్వర రావు, గ్రామ సర్పంచి కత్తి బాబు, లింగ, మల్లయ్య, మాదాస్ కోటయ్య ,రామారావు, బాబు, తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్ పై తాతా మధు వ్యాఖ్యలు అనుచితం

**అనంతగిరి సెప్టెంబర్ 10 వుదయం**



అసెంబ్లీ స్పీకర్ గా గౌరవ ప్రద మైన రాజ్యాంగ బద్ధ పదవిలో ఉన్న గడ్డం ప్రసాద్ కుమార్ పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను విద్యావేత్త, గోండ్రియల గ్రామవాసి మాగి యాకోబు తీవ్రంగా ఖండించారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ స్పీకర్ పదవికి అత్యంత గౌరవం,హోదా ఉంటుందని,అలాంటి ఉన్నత స్థానంలో ఉన్న దళిత బిడ్డపై వ్యక్తిగతంగా అవమానకర వ్యాఖ్యలు చేయడం తాతా మధు రాజకీయ సంస్కారానికి అద్దం పడుతోందని ఆయన మండిపడ్డారు.రాజకీయ విమర్శలకు హద్దులు ఉంటాయని,పదవిలో ఉన్న వ్యక్తిని కించపరిచేలా మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని అన్నారు.రాజ్యాంగబద్ధ పదవులపై బురదజల్లే ప్రయత్నాలు చేయడం ప్రజలు సహించరని హెచ్చరించారు. దళిత సమాజానికి చెందిన వ్యక్తి రాష్ట్ర శాసనసభ స్పీకర్ గా అత్యున్నత స్థానంలో ఉండటాన్ని జీర్ణించుకోలేకనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారా అని ఆయన ప్రశ్నించారు.నాయకులు పార్టీలకు అతీతంగా గౌరవంగా ప్రవర్తించాలని,స్పీకర్ పై చేసిన వ్యాఖ్యలకు తాతా మధు వెంటనే బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

## వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు సాగాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్
- కలెక్టరేట్ లో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి
- పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమన్న ఎస్పీ నరసింహ

**సూర్యాపేట, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):**



పోరాటంలో వీరనారి చాకలి ఐలమ్మ చూపిన ధైర్యం, పోరాట పటిమ తరతరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పేర్కొన్నారు.బుధవారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ పోరాటంలో అప్పటి అణచివేత, భూస్వామ్య వ్యవస్థకు ఎదురొడ్డి నిలిచిన ఐలమ్మ చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, ఆ స్ఫూర్తితో సమాజ పురోగతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శం – ఎస్పీ నరసింహ**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరవనిత చాకలి ఐలమ్మ చూపిన తెగువ, పోరాట స్ఫూర్తి నేటి సమాజానికి ఎంతో ఆదర్శనీయమని జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు. చరిత్రను చదువుకోవడమంటే గతాన్ని నెమరువేసుకోవడమే కాకుండా, నాటి స్ఫూర్తితో మార్గదర్శకంగా ముందుకు సాగడమేనని అన్నారు. 1895లో జన్మించిన ఐలమ్మ, నాటి సామాజిక, ఆర్థిక అణచివేత పరిస్థితులను ఎలాంటి చదువు, విజ్ఞానం లేకపోయినా తన గుండె ధైర్యంతో ఎదుర్కొన్నారని కొనియాడారు. విస్నూరు దేశ్‌ముఖ్ దౌర్జన్యాలకు, దొరల గడీల అన్యాయాలకు ఎదురొడ్డి 40 ఎకరాల కౌలు భూమి కోసం పోరాటం సాగించి, తన కుటుంబాన్నే కాకుండా సమాజాన్ని రక్షించుకోవడానికి ముందడుగు వేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, ఆర్వో ప్రేమ్ రాజ్, బీసీ వెల్ఫేర్ అధికారి విశాల్, నాయకులు డాక్టర్ ఊరా రామ్మూర్తి యాదవ్, భొమ్మగాని శ్రీనివాస్, బంటు కృష్ణ, చింతల పాటి చిన్న శ్రీరాములు, మట్టిపల్లి సైదులు, పోతుగంటి వీరాచారి, చల్లమల నరసింహ, తల్లమల్ల హుస్సేన్, ధున్నా శ్యామ్, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

**సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు**

**మునగాల సెప్టెంబర్ 10 (వుదయం):**




తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు షేక్ సైదా పిలుపునిచ్చారు. మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మను స్మరించుకుంటూ ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొల్లం యమున లింగరాజు, ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు షేక్ ఖాజాబీ, సిపిఎం మండల కమిటీ సభ్యులు వీరబోయిన వెంకన్న, వెంపటి వీరబ్రహ్మం, వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు అమరగాని కనకయ్య, కోడి ఎంకన్న, వెంపటి వీరబాబు, గడ్డ మల్లయ్య, రెడ్డబోయిన మల్లేశం, బొల్లం సైదులు, బొల్లం రవి, వెంపటి మైసమ్మదొడ్డి సుభద్ర, బి. సక్కుబాయమ్మ, రెడ్డబోయిన రాములు, బొల్లం పద్మతో పాటు పలువురు మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆత్మకూర్(ఎస్) పీహెచ్‌సీలో సురక్షిత ప్రసవం

**ప్రభుత్వాసుపత్రిలో నాణ్యమైన సేవలు**

**డాక్టర్ రమ్య బృందానికి అభినందనలు**

**సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్), సెప్టెంబర్ 10:(వుదయం ప్రతినిధి)**



మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) లో వైద్యులు మరోసారి తమ సేవలను చాటుకున్నారు. ఆత్మకూర్ (ఎస్) గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి (29, రెండవ కాన్పు) గురువారం పురిటి నొప్పులతో ఆసుపత్రిలో చేరారు. డ్యూటీ వైద్యాధికారిణి డాక్టర్ రమ్య తన వైద్య సిబ్బందితో కలిసి ఎలాంటి ఆపరేషన్ లేకుండా ఆమెకు సురక్షితంగా సాధారణ ప్రసవం చేశారు. భాగ్యలక్ష్మి ఆరోగ్యకరమైన మగబిడ్డకు జన్మనిచ్చారు. ప్రస్తుతం తల్లీబిడ్డలిద్దరూ క్షేమంగా ఉన్నారని డాక్టర్ రమ్య తెలిపారు. సకాలంలో స్పందించి మెరుగైన వైద్య సేవలు అందించిన డాక్టర్ రమ్యతో పాటు హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎం, ఆశా వర్కర్ల బృందాన్ని బాధితురాలి కుటుంబ సభ్యులు, స్థానికులు అభినందించారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న నాణ్యమైన వైద్య సేవలను గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా వైద్య సిబ్బంది కోరారు.

ప్రసవంలో పాల్గొన్న సిబ్బంది: డాక్టర్ రమ్య, నర్సింగ్ ఆఫీసర్ మానస, ఓపీ ఏఎన్ఎం మహబూబా, ఆత్మకూర్ ఏఎన్ఎం అన్నపూర్ణ, ఆశా వర్కర్ మాధవి, సీహెచ్‌వో యాదగిరి, హెల్త్ అసిస్టెంట్ కొండా శ్రీను.




## వినాయక మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి

**ఎస్సై బండి మోహన్ బాబు**

**చిలుకూరు సెప్టెంబర్ 10:( వుదయం )**

వినాయక ఉత్సవాల నిర్వహణపై మండపం నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం గురువారం చిలుకూరు పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసి పలు కిలక సూచనలు ,ఎస్సై బండి మోహన్ బాబు వారికి వివరించారు, మండలంలో ఎక్కడ వినాయక మండపం ఏర్పాటు చేసినా ముందస్తుగా పోలీస్ స్టేషన్ లో అనుమతి తీసుకోవాలని సూచించారు. ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఎస్సై మోహన్ బాబు తెలిపారు..

## ఖానాపురంలో కంటి వైద్య శిబిరం

**అనంతగిరి సెప్టెంబర్ 10 వుదయం**



మండల పరిధిలోని లోని ఖానాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ కంటు లాజర్ రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామీణ పేదలకు నాణ్యమైన కంటి వైద్య సేవలు అందించేందుకు శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తదుపరి వైద్య పరీక్షలు, చికిత్స అవసరమైన వారిని హైదరాబాద్‌లోని శంకర కంటి ఆస్పత్రికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అక్కడ వైద్య పరీక్షలతో పాటు అవసరమైన చికిత్స అందించనున్నట్లు పేర్కొన్నారు. రోగులకు భోజన సదుపాయం కల్పిస్తూ ఆస్పత్రి బృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జగన్, మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు నాగేంద్రబాబు, ఉపాధ్యక్షుడు వేముల గోపి, మాజీ సర్పంచ్ గింజుపల్లి రఘు, చెరువు డైరెక్టర్ రెడ్డబోయిన ఉపేందర్, ముదిరాజ్ సంఘం నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలి

**అనంతగిరి ఎస్ఐ ఏడుకొండలు**

**అనంతగిరి సెప్టెంబర్ 10 వుదయం**



శాంతియుత వాతావరణంలో వినాయక ఉత్సవాలను జరుపుకోవాలని అనంతగిరి ఎస్ఐ ఏడుకొండలు సూచించారు.గురువారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో వినాయక మండపాల నిర్వాహకులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండపానికి పోలీసు అనుమతి తప్పనిసరని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.డీజేలకు అనుమతి లేదని,నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.భక్తి శ్రద్ధలతో పండుగను జరుపుకుంటూ పోలీసు శాఖకు సహకరించాలని,అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా ముందుగానే రూట్ మ్యాప్ తయారు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు,పోలీసు సిబ్బంది,మండలంలోని వివిధ గ్రామాల వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండ జిల్లా ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు అల్లి అంజన్ నియామకం

**నల్గొండ జిల్లా**

**వుదయం వార్త ప్రతినిధి సెప్టెంబర్ 10**



నల్లగొండ పట్టణ కేంద్రంలో ఎన్నో అధ్యక్షులుగా అల్లి అంజన్ నియమించడంలో నకిరేకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ వేముల వీరేశం ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, NSUI ని జిల్లాలో మరింత బలోపేతం చేయడంలో అల్లి అంజన్ కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.




## అక్రమ అరెస్టులతో విద్యార్థులకు ఇచ్చిన హామీల నుంచి తప్పించుకోలేరు

- ముందస్తు అరెస్టుల పేరుతో నల్లగొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో నిర్బంధం
- బీఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున ముదిరాజ్

**నల్గొండ జిల్లా వుదయం వార్త ప్రతినిధి సెప్టెంబర్ 10**

నల్గొండ పట్టణ కేంద్రంలో రాష్ట్రంలో ఈరోజు బీఆర్ఎస్వి ఎలాంటి నిరసనలకు పిలుపునివ్వకున్నా విద్యార్థి నాయకులకు బయపడి ముందస్తు అరెస్టుల పేరుతో నిర్బంధించడం సిగ్గుచేటని బీఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున మండిపడ్డారు. ఈ సందర్భంగా బొమ్మరబోయిన నాగార్జున మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అక్రమంగా అరెస్టు చేసిన బీఆర్ఎస్వి నాయకులను తక్షణమే విడుదల చేయాలని, విద్యాశాఖను తనవద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేని చేతగాని సీఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## భూ రీ-సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- సీతాయిగూడెంలో రీ-సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్ అంకిత్
- హద్దులను ఖచ్చితంగా నిర్ధారించి శాశ్వత గుర్తులు ఏర్పాటు చేయాలి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)**



భూ రీ-సర్వే ద్వారా భూముల హద్దులు, విస్తీర్ణం, సర్వే నంబర్లు, పట్టాదారు వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపవచ్చని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. చంద్రుగొండ మండలం సీతాయిగూడెం గ్రామంలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, సర్వే ప్రక్రియను వేగవంతంగా, పూర్తి ఖచ్చితత్వంతో నిర్వహించాలని ఆదేశించారు. సీతాయిగూడెం గ్రామ పరిధిలో మొత్తం 1,823 ఎకరాలకు భూ రీ-సర్వే చేపట్టాల్సి ఉండగా, ప్రస్తుతం గ్రామ సరిహద్దుల నిర్ధారణతో పాటు భూముల వివరాల పరిశీలన కొనసాగుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటికే గ్రామ సభ నిర్వహించి, అన్ని శాఖల సమన్వయంతో రీ-సర్వే ప్రక్రియను కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

గ్రామంలో సుమారు 200 నివాసాలు ఉన్నాయని అధికారులు వివరించారు. భూమి ఉన్నప్పటికీ పట్టాదారు పాస్‌బుక్‌లు లేని వారు, పాస్‌బుక్‌లు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో భూమి వివరాలు సరిపోలని వారు, రికార్డుల్లో భూముల వివరాలు నమోదు కాని సందర్భాలు ఉన్నట్లు తెలిపారు. రీ-సర్వే పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయిలో భూముల వాస్తవ పరిస్థితిని గుర్తించి, అవసరమైన రికార్డు సవరణలు చేపట్టడంతో పాటు అర్హులైన భూహక్కుదారులకు పట్టాదారు పాస్‌బుక్‌లు పొందే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ గ్రామంలోని గిరిజనులతో నేరుగా మాట్లాడి భూ రీ-సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. రీ-సర్వే ప్రక్రియ తమకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని గిరిజన రైతులు తెలిపారు. గతంలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా భూములకు సంబంధించిన రికార్డుల సవరణలు, ఇతర ప్రక్రియలను పూర్తి చేసుకోలేకపోయిన వారికి ప్రస్తుత రీ-సర్వే ద్వారా మేలు జరుగుతుందని చెప్పారు. పాత భూ రికార్డులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో ఉన్న భూములను గుర్తించడం ద్వారా తమ భూ హక్కులకు మరింత స్పష్టత లభిస్తుందని పేర్కొన్నారు.

గ్రామ పరిధిలో అటవీ భూములు కూడా గణనీయంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెద్దగూడెం అటవీ ప్రాంతంలో సుమారు 5,000 హెక్టార్ల అటవీ భూమి ఉండగా, సీతాయిగూడెం గ్రామ పరిధిలో సుమారు 700 నుంచి 800 ఎకరాల వరకు అటవీ భూమి ఉన్నట్లు వివరించారు. ఈ ప్రాంతం రామవరం, చంద్రుగొండ తదితర అటవీ పరిధుల్లో ఉన్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ పాత భూ రికార్డులు, పటాలను పరిశీలించారు. సుమారు 1920ల నాటి పాత పటాలు, రికార్డులను పరిశీలిస్తూ అప్పటి భూముల హద్దులు, చెట్లు, కుంటలు, చెరువులు, తోటలు తదితర వివరాలను ఏ విధంగా నమోదు చేశారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఏర్పాటు చేసిన భూ హద్దు రాళ్లు ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో కనిపించడం లేదని అధికారులు వివరించారు. దీంతో రీ-సర్వేలో హద్దులను స్పష్టంగా నిర్ధారించి, భవిష్యత్‌లో సైతం సులభంగా గుర్తించే విధంగా శాశ్వత హద్దు గుర్తులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. భూ రీ-సర్వేలో భూముల వాస్తవ విస్తీర్ణం, హద్దులు, సర్వే నంబర్లు, పట్టాదారు వివరాలను పాత రికార్డులతో సరిపోల్చి ఖచ్చితంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. భూమి ఉండి రికార్డుల్లో నమోదు కాకపోవడం, పాస్‌బుక్ ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో భూమి వివరాలు సరిపోలకపోవడం వంటి సమస్యలను గుర్తించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ జగదీశ్వర ప్రసాద్, సర్వే అధికారులు, అటవీ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్–2027కు ఉచిత శిక్షణ

**ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులకు ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ స్కీమ్**

**ఈనెల 23 వరకు దరఖాస్తులకు అవకాశం.. అక్టోబర్ 5 నుంచి తరగతులు ప్రారంభం**

**భద్రాచలం, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):**

తెలంగాణ రాష్ట్రానికి చెందిన అర్హులైన ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులు యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్ష–2027లో విజయం సాధించేలా ఉచిత శిక్షణ, మార్గదర్శకత్వం అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన సాంస్కృతిక పరిశోధన మరియు శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో, శ్రీరామ్స్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్ష–2027కు సంబంధించి ప్రిలిమ్స్, మెయిన్స్, పర్సనాలిటీ టెస్ట్‌కు సమగ్రంగా సిద్ధం చేసేందుకు 'ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ స్కీమ్' కింద అభ్యర్థుల ఎంపికకు అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఎంపిక ప్రక్రియలో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్, మానసహిల్స్‌లో ఉన్న 'ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఫర్ ఎస్టీస్'లో రెసిడెన్షియల్ విధానంలో ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు అక్కడే ఉంటూ చదువుకునే విధంగా సుమారు ఎనిమిది నెలల పాటు లేదా యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష తేదీ వరకు, ఈ రెండింటిలో ఏది ముందుగా వస్తే అప్పటి వరకు ఉచిత కోచింగ్ మరియు సమగ్ర మార్గదర్శకత్వం పొందే అవకాశం ఉంటుందని చెప్పారు.

ఈ శిక్షణలో సివిల్ సర్వీసెస్ పరీక్షకు సంబంధించిన ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలతో పాటు వ్యక్తిత్వ పరీక్షకు అవసరమైన అంశాలపై అభ్యర్థులకు నిపుణులచే మార్గదర్శకత్వం అందించనున్నట్లు తెలిపారు. పోటీ పరీక్షలో అభ్యర్థులు మెరుగైన ప్రతిభ కనబరిచేలా అధ్యయన ప్రణాళిక, పరీక్షా విధానం, ముఖ్యమైన అంశాలు, సమయపాలన, ప్రశ్నలను విశ్లేషించే విధానం తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

**దరఖాస్తుల గడువు:**

ఈ పథకం ద్వారా శిక్షణ పొందేందుకు ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ఈనెల 9వ తేదీ నుంచి 23వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సూచించారు. గడువు ముగిసిన అనంతరం దరఖాస్తులు స్వీకరించబడవని, కాబట్టి అర్హత ఉన్న అభ్యర్థులు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

**హాల్‌టికెట్ల డౌన్‌లోడ్:**

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 25వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. హాల్‌టికెట్‌లో పరీక్షా కేంద్రం, పరీక్ష సమయం తదితర వివరాలు ఉంటాయని, అభ్యర్థులు వాటిని పరిశీలించి పరీక్షకు హాజరు కావాలని సూచించారు.

**ఈనెల 27న స్క్రీనింగ్ పరీక్ష:**

అర్హత పరీక్షలో భాగంగా ఈనెల 27వ తేదీన స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు బి. రాహుల్ తెలిపారు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్ష ప్రమాణాలకు అనుగుణంగా ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు మొదటి పరీక్ష, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రెండో పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

**అక్టోబర్ 1న ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూ:**

స్క్రీనింగ్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు అక్టోబర్ 1వ తేదీన ధ్రువపత్రాల పరిశీలనతో పాటు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ విద్యా అర్హత, కులం, ఆదాయం, వయస్సు తదితర అర్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

**అక్టోబర్ 2న తుది ఫలితాలు:**

స్క్రీనింగ్ పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూ ప్రక్రియ అనంతరం ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను అక్టోబర్ 2వ తేదీన ప్రకటించనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు అక్టోబర్ 5వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించారు.

**అభ్యర్థుల అర్హత ప్రమాణాలు:**

ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు నిర్దేశించిన అర్హత ప్రమాణాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని ప్రాజెక్టు అధికారి తెలిపారు. 2026 ఆగస్టు 1వ తేదీ నాటికి అభ్యర్థికి కనీసం 21 సంవత్సరాల వయస్సు పూర్తై ఉండాలి. గరిష్ట వయస్సు ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులకు 32 సంవత్సరాలు, దివ్యాంగ అభ్యర్థులకు 35 సంవత్సరాలు మించకూడదు. విద్యార్హత విషయానికి వస్తే, గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా డిగ్రీ లేదా దానికి సమానమైన విద్యార్హతను కనీసం 50 శాతం మార్కులతో పూర్తి చేసి ఉండాలి. ఫైనల్ పర్సెంటేజ్ ఆధారంగా విద్యార్హతను పరిగణనలోకి తీసుకుంటారు. అదేవిధంగా అభ్యర్థి కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించకూడదని అధికారులు స్పష్టం చేశారు. దరఖాస్తు సమయంలో ఆదాయానికి సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయడంతో పాటు అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.




రెండు పేపర్లతో స్క్రీనింగ్ పరీక్ష:

ఇన్‌స్టిట్యూట్‌లో ప్రవేశం కోసం గిరిజన సంక్షేమ శాఖ, శ్రీరామ్స్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో నిర్వహించే స్క్రీనింగ్ పరీక్షలో అభ్యర్థులు తప్పనిసరిగా పాల్గొనాలి. ఈ పరీక్షలో జనరల్ స్టడీస్ పేపర్–1, సీఎస్ఏటీ అనే రెండు పేపర్లు ఉంటాయి. ప్రతి తప్పు సమాధానానికి మూడింట ఒక వంతు నెగెటివ్ మార్కింగ్ విధానం అమలు చేయనున్నట్లు తెలిపారు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్ష విధానాన్ని అనుసరించి సీఎస్ఏటీ పేపర్‌లో అభ్యర్థులు తప్పనిసరిగా అర్హత సాధించాల్సి ఉంటుందని, సీఎస్ఏటీలో అర్హత సాధించిన అభ్యర్థుల జనరల్ స్టడీస్ పేపర్–1 పనితీరును తదుపరి ఎంపిక ప్రక్రియలో పరిగణనలోకి తీసుకుంటారని వివరించారు.

# యూరియా యాప్‌తో రైతులకు నరకయాతన!

- షాపుల్లో బస్తాలు ఉన్నా.. రైతుల చేతికి మాత్రం అందని వైనం
- పాత యాప్‌లో సులభం.. కొత్త యాప్‌లో నానా ఇక్కట్లు
- పంట చేతికొచ్చే సమయంలో యూరియా కోసం రైతుల అవస్థలు

**పర్వతగిరి , సెప్టెంబర్ 10 ( వుదయం ప్రతినిధి ):**

పంటలకు యూరియా అవసరమైన కీలక సమయంలో వరంగల్ జిల్లా పర్వతగిరి మండల రైతులకు కొత్త యాప్ కష్టాలు తప్పడం లేదు. గతంలో యాప్ ద్వారా సులభంగా యూరియా బస్తాలు పొందిన రైతులు.. ప్రస్తుతం కొత్త యాప్ విధానంతో గంటలు, రోజుల తరబడి ఫర్టిలైజర్ షాపుల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో యూరియా బస్తాలు నిల్వ ఉన్నప్పటికీ, కొత్త యాప్‌లో నమోదులు, బుకింగ్ తదితర ప్రక్రియల కారణంగా తమకు అవసరమైన సమయంలో యూరియా అందడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. డబ్బులు ఉన్నాయి.. యూరియా షాపులో ఉంది.. పంటకు అత్యవసరం.. అయినా మా చేతికి మాత్రం బస్తా రావడం లేదు అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పాత విధానం సులభం.. కొత్త విధానం భారమా?**

గతంలో ఉన్న యాప్ ద్వారా యూరియా పొందడం సులభంగా ఉండేదని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం కొత్త యాప్ అమల్లోకి వచ్చిన తర్వాత సాంకేతిక సమస్యలు, నమోదు ప్రక్రియ, స్లాట్ తదితర అంశాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అంటున్నారు. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్ వినియోగంపై అవగాహన తక్కువగా ఉన్న చిన్న, సన్నకారు రైతులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు.

**అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?**

ఫర్టిలైజర్ షాపుల్లో ఎంత యూరియా స్టాక్ ఉంది? యాప్‌లో ఎంత చూపిస్తోంది? రోజుకు ఎంతమంది రైతులకు పంపిణీ చేస్తున్నారు? యాప్‌లో సాంకేతిక సమస్యలు ఎందుకు వస్తున్నాయి? అనే అంశాలపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు. యాప్ రైతుల సౌకర్యం కోసం తీసుకొచ్చిందే తప్ప..

రైతులను యాప్ చుట్టూ తిప్పడానికి కాదని రైతులు మండిపడుతున్నారు. పంటకు యూరియా అత్యవసరమైన సమయంలో సాంకేతిక కారణాలతో రైతులు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, ఫర్టిలైజర్ దుకాణాల్లోని స్టాక్‌ను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని




డిమాండ్ చేస్తున్నారు.

**యూరియా కావాలి.. యాప్ కష్టాలు వద్దు**

పంటలకు సరైన సమయంలో ఎరువు అందకపోతే దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం డిజిటల్ విధానాలను తీసుకురావడం మంచిదే అయినప్పటికీ, అవి రైతులకు సౌకర్యంగా ఉండేలా ఉండాలని కోరుతున్నారు. పర్వతగిరి మండలంలో యూరియా పంపిణీపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, రైతుల ఇబ్బందులను తక్షణమే పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

## అదనపు పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలనీ ఆర్డీవో కి వినతి పత్రం

**చెన్నారావుపేట సెప్టెంబర్ 10 ( వుదయం ప్రతినిధి )**



చెన్నారావుపేట మండలంలోని బోడ మాణిక్యం తండా గ్రామపంచాయతీ కి ప్రత్యేక పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని రెవిన్యూ డివిజనల్ అధికారినీ కలసి వినతి పత్రం సమర్పించిన మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మహబూబ్ సింగ్ పాల్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి భూక్య మోహన్ నాయక్. రాథోడ్ మరియు మంచోజు వెంకటేశ్వర్లు ఇదే విధంగా చెన్నరావుపేట మండల పరిధిలో కొత్తగా ఏర్పాటు అయిన అన్ని తండా గ్రామపంచాయతీలకు ప్రత్యేక ఓటర్ పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరడం జరిగినది. గత 25, 30 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేయబడిన పోలింగ్ స్టేషన్లో తండావాసులకు దూరం ప్రయాణం చేసి పోలింగ్ కు వెళ్లడం వలన ప్రయాణం సమయంభారమవుతున్నందున ఇట్టి విషయాన్ని పరిశీలించి ఆర్డివో సానుకూలంగా స్పందించి వచ్చే ఎన్నికల వరకు అదనపు పోలింగ్ స్టేషన్ లు అయ్యే విధంగా సహకరిస్తానని హామీ ఇచ్చారు.

## నకిలీ పత్రాలతో రూ.59.30 లక్షల గోల్డ్ లోన్ మోసం: ఇద్దరి అరెస్ట్

**హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి) :**




నకిలీ బంగారం తాకట్టు పత్రాలను సృష్టించి గోల్డ్ ఫైనాన్స్ కంపెనీని రూ.59.30 లక్షలకు మోసం చేసిన ఇద్దరు నిందితులను హనుమకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీమాన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ యూనియన్ చైర్మన్/సీఈఓ ఎలిమి సంతోష్ (37), వ్యాపారి వడ్డేపల్లి రంజిత్ (39) ఇద్దరూ కలిసి కుట్ర పన్నారు. రంజిత్‌కు చెందిన 640 గ్రాముల బంగారం క్రెడిట్ యూనియన్‌లో తాకట్టు ఉన్నట్లు నకిలీ ప్లెడ్జ్ రసీదు తయారు చేశారు. ఈ పత్రాన్ని నిజమైనదిగా నమ్మించి, భౌతికంగా బంగారాన్ని చూపించకుండానే గోల్డ్ ఫైనాన్స్ కంపెనీ నుంచి RTGS ద్వారా రూ.59.30 లక్షలను శ్రీమాన్ యూనియన్ ఖాతాకు బదిలీ చేయించుకున్నారు. గోల్డ్ కంపెనీ ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించడంతో, ఆ నగదును నిందితులు ఇతర అవసరాలకు మళ్లించారు. బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి మొబైల్ ఫోన్లు, నకిలీ ప్లెడ్జ్ కాపీలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మోసంలో ఇంకా ఎవరికైనా ప్రమేయం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఫైనాన్స్ సంస్థలు, బ్యాంకులు కేవలం పత్రాలను మాత్రమే కాకుండా, తాకట్టు బంగారం వాస్తవంగా ఉందో లేదో ప్రత్యక్షంగా పరిశీలించిన తర్వాతే రుణాలు మంజూరు చేయాలని ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ సూచించారు.

## నేడు మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం

**ఎంపీడీవో రవీంద్రనాథ్**

**మహాదేవపూర్: సెప్టెంబర్ 10(వుదయం ప్రతినిధి):**



నేడు మహాదేవపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రవీంద్రనాథ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం (నేడు) ఉదయం 10:00 గంటలకు మండల ప్రత్యేక అధికారి అధ్యక్షత సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

## దళిత ద్రోహి కేసీఆర్ ఎస్సీ సెల్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కన్నం సందీప్

**చెన్నారావుపేట సెప్టెంబర్ 10. ( వుదయం ప్రతినిధి)**



దళిత ద్రోహి కెసిఆర్ అని దళిత సమాజం పట్ల వివక్ష చూపుతున్న పార్టీ బి ఆర్ ఎస్ పార్టీ అని ఎస్సి సెల్ మండల అధ్యక్షుడు కన్నం సందీప్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్దన రమేష్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రూపిక శ్రావణ్ కుమార్ ఎస్సి సెల్ జిల్లా వైస్ చైర్మన్ మాదారపు చరణ్ లు మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో మాల మాదిగ సమాజం పార్టీలకు అతీతంగా కాళ్లకు గజ్జ కట్టి డప్పు చేతబట్టి ప్రజలను చైతన్యం చేసి ఉద్యమాన్ని ఉధృతం చేసిన దళితుల పట్ల వివక్ష చూపుతున్న పార్టీ బి అర్ ఎస్ పార్టీని భూస్థాపితం చేయాల్సిన అవసరం ఉందని వారు అన్నారు..తెలంగాణ రాష్ట్రం దళిత అమరుల త్యాగాల మీద తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఉద్యమ సమయంలో దళిత ద్రోహి కేసీఆర్ ఈ రాష్ట్రం దళితుల తోనే సాధ్యమైతదని దళితులను రెచ్చగొట్టి మమ్మల్ని వాడుకొని ఆనాడు సీఎంగా కెసిఆర్ పదేళ్లు కుర్చీలో కూర్చొని తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే దళితుడే ముఖ్య మంత్రి అని ప్రకటించి మాట తప్పితే తల తీసుకుంటానని ప్రగొడ్బాలు పలికి ముఖ్య మంత్రి పీఠాన్ని అధిరోహించిన ద్రోహి కెసిఆర్ అని నిన్న కెసిఆర్ ప్రోత్బలంతో దళితుల మీద దాడి చేయడం ఎర్రబెల్లి ఫామ్ హౌస్ దగ్గర బిఆర్ ఎస్ నాయకులు దళితులు నడిచిన స్థలాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేయడం సిగ్గు చేటని దళితులంటే బి ఆర్ ఎస్ పార్టీకి ఎంత చులకనో దళిత సమాజం ఒక్కసారి ఆలోచన చేయాలని బి ఆర్ ఎస్ పార్టీ దళితుల పట్ల వివక్ష చూపుతుందని ఒక దళిత బిడ్డ ఉప ముఖ్య మంత్రిగా ఉంటే సహించలేధని ఎప్పటికైనా బి ఆర్ ఎస్ పార్టీ దళిత వ్యతిరేక పార్టీ అని దళిత సోదరులారా ఆత్మ పరిశీలన చేసుకోండి..రాబోయే రోజులలో రాష్ట్రంలో బి ఆర్ ఎస్ మనుగడ లేకుండా చేయాలనీ దళిత సమాజం ఏకం కావాలని ఎస్సి సెల్ మండల అధ్యక్షులు కన్నం సందీప్ దళిత సమాజానికి విజ్ఞప్తి చేసారు....దళితుల కు మూడు ఎకరాల భూమి ఇస్తానని మాట తప్పిన మాజీ ముఖ్య మంత్రి కి బి ఆర్ ఎస్ పార్టీ కి దళితులంటే ఎందుకు అంత చులకన అని ప్రశ్నించారు..నేటి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి దళితులను రాజ్యంగబద్ధమైన పదవులను ఇస్తూ గౌరవిస్తూ ఉంటే నిన్నటికీ నిన్న స్పీకర్ని ల–కారం తో బి ఆర్ ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చౌదరి దూశించడం పట్ల నిరసన తెలిపినందుకు పసుపు నీళ్ల తో శుద్ధి చేయడం అంటే యావత్ తెలంగాణ ప్రజలు ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని పసుపు నీళ్లతో శుద్ధి చేయించిన కెసిఆర్ అసెంబ్లీ కి గాని శాసనమండలి కి గాని వెళ్లే ముందు బి ఆర్ ఎస్ నాయకులు దళిత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎస్సి సెల్ మండల అధ్యక్షుడు కన్నం సందీప్ డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో విజయ్ రామ్మోహన్ స్వామి అశోక్ దిలీప్ ప్రభాస్ వంశీ తదితరులు పాల్గొన్నారు

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

**పరకాల, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)**



చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా బీజేపీ పరకాల పట్టణ శాఖ ఆధ్వర్యంలో అమరధామంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు డా. సిరంగి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ చరిత్రలో చాకలి ఐలమ్మ పోరాటం ఒక చారిత్రాత్మక అధ్యాయమని అన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన పోరాటం, చూపిన ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

అన్యాయాన్ని ఎదిరించి అణగారిన వర్గాల కోసం పోరాడిన చాకలి ఐలమ్మ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని డా. సిరంగి సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు. ఆమె త్యాగాలను కేవలం జయంతి, వర్ధంతి కార్యక్రమాలకే పరిమితం చేయకుండా సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

కార్యక్రమంలో పరకాల పట్టణ కౌన్సిలర్లు కుక్కల విజయ్ కుమార్, ఆకుల లావణ్య శ్రీధర్, జిల్లా కోశాధికారి ఎర్రం రామన్న, పట్టణ ఉపాధ్యక్షులు మిడిదొడ్డి నరేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి పాలకుర్తి తిరుపతి, కిసాన్ మోర్చా రాష్ట్ర లీగల్ సెల్ నాయకురాలు వేముల సదా రాణి ఆంజనేయులు, ఓబీసీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి ఉడుత చిరంజీవి, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు దుబాసి కృష్ణ ప్రసాద్, బాసాని సోమరాజు, సోషల్ మీడియా కన్వీనర్ మెంతుల సురేష్, బీజేపీ కార్యకర్తలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా నివాళులు



**చెన్నారావుపేట సెప్టెంబర్ 10 ( వుదయం ప్రతినిధి )**

చెన్నారావుపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసినటువంటి వీరనారి చాకలి ఐలమ్మ 41 వర్ధంతి కార్యక్రమానికి సభ అధ్యక్షులు రజక కుల పెద్ద చాపర్తి రాజు ముఖ్య అతిథులు స్థానిక సర్పంచ్ కంది శ్వేత కృష్ణ చైతన్య రెడ్డి మరియు స్థానిక ఉపసర్పంచ్ దొంతి శ్రీనివాస్ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షుడు సంఘం రమేష్. పాల్గొన్నారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కంది కృష్ణ చైతన్య రెడ్డి మాట్లాడుతూ వీరనారి చాకలి ఐలమ్మ త్యాగాలను భూమి కోసం, భుక్తి కోసం ,వెట్టి చాకిరి విముక్తి కోసం, నాటి దౌర్జన్యాలకు ఎదిరెడ్డి నిలిచిన ధైర్య శీలి, చాకలి ఐలమ్మ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల రజక సంఘం అధ్యక్షుడు ఉప్పుల బిక్షపతి, ప్రధాన కార్యదర్శి బర్ల యాకయ్య, మర్రి రమేష్, గట్ల కృష్ణయ్య, పొదిల ఆగయ్య, ఉప్పుల వీరస్వామి, ఉప్పుల రాజకుమార్, మర్రి మధుకర్, రాయరాకుల శ్రీకాంత్, గోపు శ్రీనివాసరెడ్డి,చాగంటి రాజు, ఓరుగంటి రాజు, వైనాల స్వామి చరణ్ తదితరులు పాల్గొన్నారు

## సాగు చేస్తున్న రైతులందరికీ సరిపడ యూరియా అందించాలి




- తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా
- జిల్లా నాయకుడు ముంజాల సాయిలు

**ఖానాపురం, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):**

మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలోని పట్టాలు లేని భూముల రైతుల పంట పొలాలకు సరిపడా యూరియాను అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు ఏఐకేఎస్ జిల్లా రైతు సంఘం నాయకుడు ముంజల సాయిలు తెలిపారు. మండలంలోని అశోక్ నగర్ గ్రామంలోని ఏఐకేఎస్ జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూములకు పట్టాలు ఉన్నా లేకున్నా సాగు చేస్తున్న ప్రతి రైతుకు సరిపడా యూరియాను అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, ఖరీఫ్ సీజన్లో రైతులకు యూరియా కొరత లేకుండా సొసైటీ గోదాములలో యూరియాను ముందస్తుగా నిలువ చేయాలని ప్రభుత్వాన్ని సంబంధిత శాఖ అధికారులను డిమాండ్ చేస్తూ, వ్యవసాయానికి గృహాలకు కోతలు లేకుండా 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని పార్టీ పక్షాన రైతుల పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు బీరం శ్రీనివాస్, పిండి రాములు, కొత్తపల్లి రాజేందర్, చింతకింది శోభన్ బాబు, సిఐటియు నాయకులు గాదరి మల్లయ్య, ముంజాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఐలమ్మ త్యాగాలు చరిత్రలో చిరస్మరణీయం

**డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్**

**వర్ధన్నపేట, సెప్టెంబర్ 10 వుదయం ప్రతినిధి:**



భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టి చాకిరి విముక్తి కోసం వీరోచితంగా పోరాడిన చాకలి ఐలమ్మ త్యాగాలు తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ అన్నారు.చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా గురువారం వర్ధన్నపేట పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఆమె చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి అయూబ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అణగారిన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ సాగించిన పోరాటం, చూపిన ధైర్యం, తెగువ, పోరాట పటిమ తెలంగాణ ప్రజలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమన్నారు. మహిళా శక్తికి ప్రతీకగా నిలిచిన ఐలమ్మ ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన త్యాగాలను ఎల్లప్పుడూ స్మరించుకోవాలని అన్నారు.ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోశాల వెంకన్న, టౌన్ అధ్యక్షుడు ఈగ దామోదర్, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల, టౌన్ నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, పాల్గొన్నారు.

## ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి

**తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్**

**తొర్రూరు సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):**



తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరానారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్ అన్నారు.

వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని గురువారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని విశ్రాంతి భవనం ఎదురుగా అమరవీరుల స్థూపం వద్ద రజక వృత్తి దారులు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పున్నం సారయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా చైర్మన్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన చాకలి ఐలమ్మ సేవలు మరువ లేనివని అన్నారు. తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాత సామాజిక ఆధునిక పరిణామానికి నాంది పలికిన స్త్రీ ధైర్యశాలి అని కొనియాడారు. సామాజిక అన్యాయం, జమీందారీ వ్యవస్థ, దోపిడీకి వ్యతిరేకంగా ఆమె ధైర్యంగా పోరాడి అణగారిన వర్గాల ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. ఐలమ్మను ఆదర్శంగా తీసుకొని ఆమె ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కర్నే నాగరాజు,పేర్ల జంపన్న, సిపిఎం మండల కార్యదర్శి ఎండి యాకూబ్,టియుటిఎఫ్ నాయకులు నాగ మల్లయ్య, ఓరుగంటి చైతన్య,బిజెపి పట్టణ అధ్యక్షుడు పైండ్ల రాజేష్,తొర్రూరు రజక సంఘం మండల అధ్యక్షుడు నిమ్మల సోమయ్య,కార్యదర్శి పొడగంటి శేఖర్,పట్టణ అధ్యక్షుడు చింతల రాజు, కార్యదర్శి చింతల మధు,నాయకులు సిరి శ్రీనివాస్, వెంకటయ్య, ఓరుగంటి ప్రవీణ్, చంటి, దేవేందర్,మడిపెద్ది కార్తిక్,కొండ్రతి రామక్రిష్ణ,సైదులు, రాకున్నా, శ్రీకాంత్, శ్రీనివాస్, బిక్షం,రాజేష్ పాల్గొన్నారు.



## కేజీబీవీ ఎస్ఓ లపై చర్యలు తీసుకోవాలి

**భూపాలపల్లి సెప్టెంబర్ 10 వుదయం ప్రతినిధి**

రాష్ట్ర వ్యాప్తంగా కేజీబీవీ లల్లో మిగిలిన అన్ స్పెంట్ బడ్జెట్ ను పాఠశాలల్లో ఉన్న రిపేర్స్ మరియు పాఠశాలకు అవసరమైన వస్తువులు కొనుగోలు చేసుకోవాలని రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేయగా ఇదే అదునుగా భావించిన భూపాలపల్లి, టేకుమట్ల, రేగొండ, గణపురం, చిట్యాల, మొగుళ్లపల్లి, మహాదేవ్ పూర్ కేజీబీవీ సమగ్ర శిక్ష అభియాన్ చైర్మన్ ఐన కలెక్టర్ మరియు డి ఈ ఓ అనుమతి లేకుండా లక్షలాది రూపాయల నాసిరకం వస్తువులను హైదరాబాద్ లో కొన్ని షాపుల యజమానులతో కుమ్మక్కు ఐ అధిక ధరలకు కొనుగోలు చేయడం తో పాటు కొన్ని బిల్లులని పాఠశాల అకౌంటెంట్ మీద మరియు వారి బంధు గణాల మీద పి పి ఏ లు చేసి తీవ్రమైన ఆర్థిక నేరలకు పాల్పడ్డారు. అలాగే డైట్ బిల్లులల్లో సైతం రాష్ట్రం లో ఎక్కడ లేని విధంగా పర్ కాపిట బిల్లులు అధికంగా తీసుకున్నారు.కావున ఈవిధంగా అక్రమాలకు పాల్పడిన కేజీబీవీ ఎస్ ఓ లను విధుల నుంచి తొలగించి వారు అక్రమంగా తీసుకున్న ప్రభుత్వం ధనాన్ని రికవరీ చేయాలనీ సమాచార హక్కు చట్టం కార్యకర్త కుసుమ రామకృష్ణ జిల్లా విద్యాశాఖ అధికారికి విజ్ఞప్తి చేసారు.



## శాంతమ్మ కుటుంబానికి కౌన్సిలర్ పూర్ణాచారి పరామర్శ

**పరకాల సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):**

గోరికొత్తపల్లి గ్రామంలో అనారోగ్య కారణాలతో ఇటీవల అకాల మరణం చెందిన బత్తుల శాంతమ్మ (పద్మశాలి) కుటుంబాన్ని పరకాల మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి గురువారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా శాంతమ్మ కుమారులు బత్తుల మల్లేశం, వెంకటేశ్వర్లు, విష్ణుమూర్తి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వీర్ల సదానందం, సూదమల్ల రాజయ్య, పొడిచెట్టి సాంబమూర్తి, పప్పుల సుధాకర్, కుమార్ స్వామి, బూర వెంకటేశ్వర్లు, మంత్రి శ్యాం, గంగోజుల విజేందర్ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ ఐ ఆర్ హియరింగ్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 10**

ఎనుమాముల పరిధిలోని బాలాజీనగర్‌లో గురువారం నిర్వహించిన ఎస్ ఐ ఆర్ హియరింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఐఏఎస్ పరిశీలించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా వచ్చిన దావాలు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హులైన ఓటర్ల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో వరంగల్ ఆర్డీవో, వర్ధన్నపేట ఆర్డీవో సుమ, డీఏఓ, ఏఈఆర్ఓ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్ల పోస్టుల దరఖాస్తుదారుల జాబితా విడుదల

**జిల్లా సంక్షేమాధికారి జి. మల్లేశ్వరి**

**జయశంకర్ భూపాలపల్లి, సెప్టెంబర్ 10(వుదయం జిల్లా ప్రతినిధి):**



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అంగన్‌వాడీ టీచర్ల నియామక ప్రక్రియలో భాగంగా భూపాలపల్లి మహాదేవ్‌పూర్ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల జాబితాను జిల్లా కలెక్టర్ ఆదేశాలతో సంబంధిత గ్రామ పంచాయతీలలో ప్రదర్శించడం జరిగిందని జిల్లా సంక్షేమాధికారి జి. మల్లేశ్వరి గురువారం తెలిపారు. అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమాన్ని కూడా ఈ నెల 21వ తేదీ నుండి 24వ తేదీ వరకు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించినట్టు డీడబ్ల్యూఓ వెల్లడించారు. జాబితాలో ఉన్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలనకు పై తేదీలలో హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరు కావాల్సిన తేదీ, సమయం తదితర వివరాలను సంబంధిత సీడీపీఓ కార్యాలయాల ద్వారా వ్యక్తిగతంగా సమాచారం అందించనున్నట్లు జిల్లా సంక్షేమాధికారి తెలిపారు. అభ్యర్థులు తమకు అందిన సమాచారాన్ని అనుసరించి నిర్ణీత తేదీ, సమయంలో సంబంధిత సీడీపీఓ కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరై నియామక ప్రక్రియను సజావుగా పూర్తి చేసుకోవాలని డీడబ్ల్యూఓ సూచించారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం

**టిఆర్పి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్**

**భూపాలపల్లి సెప్టెంబర్ 10 వుదయం ప్రతినిధి**



వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ... చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల హక్కుల కోసం, పేదలు మరియు అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం ధైర్యంగా పోరాడిన మహా వీరనారి అని కొనియాడారు. భూస్వామ్య దోపిడీకి, అన్యాయానికి వ్యతిరేకంగా ఆమె చూపిన ధైర్యం, తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. చాకలి ఐలమ్మ పోరాటం కేవలం ఒక వ్యక్తి పోరాటం కాదని, పేదలు, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం సాగిన సామాజిక పోరాటానికి ప్రతీక అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా ఉప అధ్యక్షుడు ఇనుగల ప్రణయ్ రాజ్ మండల నాయకులు,గంధం సతీష్ యువజన పిట్టల రాంబాబు నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

## న్యూ శాయంపేట పోచమ్మ బోనాలు

**వరంగల్ టౌన్, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి) :**



వరంగల్ నగర పరిధిలోని న్యూ శాయంపేటలో పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలు భక్తి శ్రద్ధలు, ఐక్యతతో వైభవంగా జరిగాయి. సాధారణంగా శ్రావణమాసంలో వేర్వేరు రోజుల్లో బోనాలు చేయడం ఆనవాయితీ కాగా, న్యూ శాయంపేటలో మాత్రం శ్రావణమాసం చివరి గురువారం రోజున ఊరంతా ఒకేరోజు సామూహికంగా బోనాలు నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత. సామూహిక వేడుక: కులమతాలకు అతీతంగా ఊరంతా ఒక్కటై మహిళలు పసుపు, కుంకుమ, వేపాకులతో అలంకరించిన బోనాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపులో డప్పు వాయిద్యాలు, భక్తుల నినాదాల నడుమ యాదవులు ఏర్పాటు చేసిన 'జోడీ మేకపోతుల బండి' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజాప్రతినిధుల పూజలు: స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్రాం రెడ్డి (బట్టి శీనన్న), తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు తదితరులు పాల్గొని పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను యువత ఉత్సాహంగా కొనసాగిస్తూ, గ్రామ సమైక్యతను చాటుతూ బోనాల పండుగను కోలాహలంగా జరుపుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు తగిన ఏర్పాట్లు చేశారు.

## పలిమెల పంచాయతీలో పైప్ లైన్ పనులు ప్రారంభం

**భూపాలపల్లి: సెప్టెంబర్ 10(వుదయం విలేకరి)**



పలిమెల గ్రామపంచాయతీతోపాటు బోడాయిగూడెం, కామన్ పల్లి గ్రామాలకు మంజూరైన పైప్ లైన్ నల్లాల కలెక్షన్ల పనులను గురువారం పలిమేల సర్పంచ్ జవ్వాజి పుష్పలత కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరిగిన కాలనీలలో పైప్ లైన్, నల్లాలు లేక ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా, ప్రజల సౌకర్యార్థం మంత్రి శ్రీధర్ బాబు పైప్ లైన్ పునరుద్ధరణకు నిధులు మంజూరు చేశారని అన్నారు మంత్రి చొరవతో కాలనీలలో తాగునీరు అందించే కార్యక్రమం చేయడం జరిగిందని, ప్రజలకు నాణ్యమైన మంచినీరు అందించడానికి గ్రామపంచాయతీ పాలక వర్గం ఎల్లవేళలా కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## పీవీఆర్ మాల్‌లో ఏసీలు పనిచేయక వినియోగదారుల అవస్థలు

**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 10**

పీవీఆర్ మాల్‌లో సెంట్రల్ ఏసీలు సక్రమంగా పనిచేయకపోవడంతో సినిమా చూసేందుకు వచ్చే ప్రేక్షకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బయట ఉష్ణోగ్రతలతో పోలిస్తే మాల్‌లోనూ తగినంత చల్లదనం లేకపోవడంతో హాలులో ఉక్కపోత వాతావరణం నెలకొంటోందని వినియోగదారులు చెబుతున్నారు. థియేటర్‌లో వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉండటంతో ప్రేక్షకులు అసహనానికి గురవుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటున్నారు.

కొందరు ప్రేక్షకులు మధ్యలో బయటకు వచ్చి గాలి పీల్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వాపోతున్నారు. టికెట్లకు అధిక మొత్తంలో చెల్లించి, కుటుంబ సభ్యులతో కలిసి వినోదం కోసం వస్తున్న సమయంలో కనీస వాతావరణ సౌకర్యం కూడా అందకపోవడం పట్ల వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏసీ సమస్యపై సిబ్బందికి సమాచారం ఇచ్చినా వెంటనే పరిష్కారం లభించడం లేదని కొందరు ఆరోపిస్తున్నారు. మాల్ యాజమాన్యం స్పందించి సెంట్రల్ ఏసీ వ్యవస్థను వెంటనే పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని, థియేటర్లలో తగిన ఉష్ణోగ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు. టికెట్ ధరలకు అనుగుణంగా కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని వారు పేర్కొంటున్నారు.

# మూడు గ్రామాల అంగన్వాడీ అభ్యర్థుల ఎంపిక పూర్తి

**ముత్తారం**
**సెప్టెంబర్ 09(వుదయం ప్రతినిధి):**

ముత్తారం మండలంలోని పారుపల్లి ,శుక్రవారంపల్లె,అడవిశ్రీరాంపూర్ గ్రామాలకు సంబంధించిన అంగన్వాడీ కార్యకర్తల ఎంపిక ప్రక్రియ పూర్తయిందని సంబంధిత అధికారులు బుధవారం తెలిపారు.ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటించడంతో పాటు వారికి నియామక ఆర్డర్ కాపీలను అందజేసినట్లు వెల్లడించారు.ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు,అర్హతల ఆధారంగా దరఖాస్తులను పరిశీలించి అభ్యర్థులను ఎంపిక చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.ఎంపికైన వారు త్వరలోనే విధుల్లో చేరనున్నట్లు తెలిపారు. మండలంలోని ఇతర గ్రామాలకు సంబంధించి అంగన్వాడీ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. దరఖాస్తులు, ధ్రువపత్రాల పరిశీలన అనంతరం మిగతా గ్రామాల ఎంపిక జాబితాలను కూడా త్వరలో విడుదల చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. అభ్యర్థులు అధికారిక ప్రకటనలను గమనించాలని,ఎంపికకు సంబంధించిన వివరాలను సంబంధిత కార్యాలయాల ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీల భర్తీతో మహిళలు,చిన్నారులకు అందే సేవలు మరింత మెరుగుపడతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# బహుజనులకు చాకలి ఐలమ్మ స్ఫూర్తి



**బిజినపల్లి,**
**సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా బిజినపల్లి మండలం నందివడ్డేమాన్ గ్రామంలో ఘనంగా నివాళులర్పించారు.గ్రామంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి మండల బీసీ సంఘం అధ్యక్షుడు వేముల సత్య శీలా సాగర్, చిర్నం తిరుపతయ్య పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సత్య శీలా సాగర్ మాట్లాడుతూ.. 1895 సెప్టెంబర్ 25న కిష్టాపురంలో రజక కుటుంబంలో జన్మించిన ఐలమ్మ విస్నూర్ రామచంద్రారెడ్డి భూస్వామ్య అణచివేతను ధైర్యంగా ఎదిరించారన్నారు. తన 4 ఎకరాల భూమి కోసమే కాకుండా బడుగు బలహీన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం 1946 51 తెలంగాణ సాయుధ పోరాటంలో ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలిగా నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడారని, 1985 సెప్టెంబర్ 10న తుదిశ్వాస విడిచారని గుర్తు చేశారు."భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం" అనే ఆమె నినాదం నేటికీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా సాధికారతకు స్ఫూర్తి అని, ఆమె ఆశయాలైన బహుజన హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం కోసం పోరాటాన్ని కొనసాగించడమే నిజమైన నివాళి అని అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా వ్యాప్తంగా నివాళి సభలు నిర్వహిస్తున్నామని, యువత, బీసీ సంఘాల నాయకులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో సర్పంచ్ సుగుణమ్మ, ఉప సర్పంచ్ నాగరాజు, రజక సంఘం సభ్యులు రేమద్దుల రమేష్, శ్రీనివాసులు, చిన్న రాములు, శివశంకర్, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సీఎంను కలిసిన పర్ణిక రెడ్డి



**నారాయణపేట**
**సెప్టెంబర్10(వుదయం ప్రతినిధి)**

అసెంబ్లీ లో గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని నారాయణపేట ఎమ్మెల్యే డా చిట్టెం పర్ణిక రెడ్డి కలిసి అభివృద్ధికి కృషి చేయాలని విన్నవించారు. మరికల్ మండలానికి జూనియర్ కాలేజీ,నారాయణపేట పట్టణంలోని శిథిలావస్థలో ఉన్న జూనియర్ కాలేజీ నూతన భవనం మంజూరు చేయాలని,నారాయణపేట పట్టణానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం మంజూరు, □నూతన ఎస్పీ కార్యాలయం భవనం మంజూరు,దామరగిద్ద సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ కు నూతన భవనం మంజూరు కోసం ప్రతిపాదించారు. ప్రతిపా దనలకు సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి తప్పకుండా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారన్నారు.

# రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు బలం..



*** అర్హులకు సదరం సర్టిఫికెట్లు**
**గద్వాల, సెప్టెంబర్ 10**
**(వుదయం కరస్పాండెంట్)**

రైతుల ఆదాయం పెంపునకు రైతు ఉత్పత్తిదారుల సంస్థలను (ఎఫ్‌పీఓలు) మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ ఎఫ్24 కాన్ఫరెన్స్ హాల్‌లో గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలపై ఏపీఎంలు, సీసీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఎఫ్‌పీఓలో కొత్త సభ్యులను పెద్ద సంఖ్యలో చేర్పించాలని, ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల సభ్యులను సభ్యులుగా చేర్చాలని సూచించారు. ఎఫ్‌పీఓల ప్రయోజనాలపై గ్రామాల వారీగా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ సెప్టెంబర్ 20లోగా యూనిఫాంలు అందించి, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న స్త్రీనిధి రుణాలను పూర్తిస్థాయిలో రికవరీ చేయడంతో పాటు, పీఎంఎఫ్ఎంఈ లక్ష్య సాధనకు ఏపీఎంలు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న వీఓ భవనాల పనులను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలోని అర్హులైన దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని, దివ్యాంగ చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీఆర్డీఓ ముషాయిదా బేగం, ఎల్‌డీఎం శ్రీనివాసులు, ఏపీఎంలు, సీసీలు, వీఓలు తదితరులు పాల్గొన్నారు.

# టీయూఎఫ్ఐడీసీ పనులను వేగవంతం చేయాలి

**పెద్దపల్లి,**
**సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)**



టీయూఎఫ్ఐడీసీ నిధులతో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధ్యక్షతన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీతో కలిసి టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టనున్న పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. నీటి సరఫరా, పారిశుద్ధ్యం, స్టార్మ్ వాటర్ డ్రైనేజీ, సోలార్ విద్యుత్ ప్లాంట్, పట్టణ పునర్వికాసం, వేస్ట్ టు ఎనర్జీ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 15 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను రూ.60 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేసేందుకు అనువైన 30 ఎకరాల భూమిని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. భూమి కేటాయింపునకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.ఎస్టీపీల శుద్ధి చేసిన నీటిని పునర్వినియోగించాలిరామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎస్టీపీలలో శుద్ధి చేసిన నీటిని సంస్థాగత వినియోగదారులకు, ముఖ్యంగా ఎన్టీపీసీకి పునర్వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందుకు సంబంధించి ఎంఓయూ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.జూలై 8న ఎన్టీపీసీతో నిర్వహించిన కన్వర్జెన్స్ సమావేశం అనంతరం ప్రీఫీజిబిలిటీ అధ్యయనం కోసం నాగ్‌పూర్‌కు చెందిన పురాణిక్ బ్రదర్స్ కన్సల్టింగ్ ఇంజినీర్స్‌ను నియమించినట్లు తెలిపారు. ప్రస్తుతం సర్వే కొనసాగుతోందని, ప్రీఫీజిబిలిటీ నివేదికను వచ్చే వారంలోగా సమర్పించనున్నట్లు అధికారులు వివరించారు.స్టార్మ్ వాటర్ డ్రైన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలిరామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో మొత్తం 11.56 కిలోమీటర్ల పొడవున స్టార్మ్ వాటర్ డ్రైన్లు నిర్మించేందుకు ప్రతిపాదించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన క్షేత్రస్థాయి సర్వే పూర్తయిందని, డీపీఆర్‌ను ఈ నెలాఖరులోగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు.భవిష్యత్‌లో భారీ వర్షాల సమయంలో పట్టణ ప్రాంతాల్లో నీటి నిల్వలు ఏర్పడకుండా శాస్త్రీయ విధానంలో డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలని సూచించారు.రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాత నగర కేంద్ర ప్రాంతాలను పునర్వికసిస్తూ మున్సిపల్ సంస్థకు ఆదాయం సమకూర్చేలా వాణిజ్య సముదాయాలను అభివృద్ధి చేయాలని సూచించారు పాత అశోకా ప్రాంతం, గాంధీ చౌరస్తా సమీపంలో, పాత మున్సిపల్ కార్యాలయం వద్ద, ప్రస్తుత మున్సిపల్ కార్యాలయం వద్ద, మజీద్ టర్నింగ్ ప్రాంతాల్లో మొత్తం 5 వాణిజ్య సముదాయాలను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. సర్వే పూర్తయిందని, డీపీఆర్‌ను నెలాఖరులోగా సమర్పించాలని ఆదేశించారు. వాణిజ్య భూముల మార్కెట్ విలువ అధ్యయనం కోసం సీటీఓకు లేఖ రాసినట్లు తెలిపారు.వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలురామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సింగరేణి క్లస్టర్‌లో ఇంటిగ్రేటెడ్ వేస్ట్ టు ఎనర్జీ/గ్రీన్ చార్కోల్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.డీపీఆర్ తయారీ కోసం ఈఓఐ పిలిచినట్లు, క్లస్టర్ స్థాయిలో డీపీఆర్ తయారీకి పీఎస్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్‌కు వర్క్ ఆర్డర్ జారీ చేసినట్లు తెలిపారు. డీపీఆర్ సమర్పించబడిందని, తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. టీయూఎఫ్ఐడీసీ-కేఎఫ్‌డబ్ల్యూ నిధుల కింద రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నీటి సరఫరా, పారిశుధ్యం తదితర పనులకు రూ.320 కోట్లు, క్రియేటివ్ రీడెవలప్‌మెంట్ ఆఫ్ సిటీస్ కింద రూ.85 కోట్లు, మొత్తం రూ.405 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు.నీటి వనరులు, పారిశుధ్యం విభాగంలో రూ.135 కోట్లతో పనులు, నీటి వనరుల మెరుగుదల పనులకు రూ.65 కోట్లు, శుద్ధి చేసిన నీటి పునర్వినియోగానికి సంబంధించిన పనులు, స్టార్మ్ వాటర్ డ్రైన్ల నిర్మాణానికి రూ.120 కోట్ల ప్రతిపాదనలు ఉన్నట్లు తెలిపారు. క్రియేటివ్ రీడెవలప్‌మెంట్ కింద పాత నగర కేంద్ర ప్రాంతాల పునర్వికాసానికి రూ.25 కోట్లు, 15 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.60 కోట్ల ప్రతిపాదనలు ఉన్నట్లు పేర్కొన్నారు. అదనంగా సింగరేణి క్లస్టర్‌లో ఇంటిగ్రేటెడ్ వేస్ట్ టు ఎనర్జీ/గ్రీన్ చార్కోల్ ప్లాంట్ ఏర్పాటుకు 20 ఎకరాల విస్తీర్ణంలో రూ.152 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టును ప్రతిపాదించినట్లు అధికారులు తెలిపారు.అన్ని పనులకు సంబంధించిన భూకేటాయింపు, సర్వే, డీపీఆర్‌లు, అనుమతులు తదితర ప్రక్రియలను సమన్వయంతో పూర్తి చేసి, నిర్దేశిత గడువులోగా పనులను ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారి గంగయ్య ,సంబంధిత మున్సిపల్ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, టీయూఎఫ్ఐడీసీ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాచీన మాన్యుస్క్రిప్టుల సేకరణకు శ్రీకారం

*** జ్ఞాన భారతం మిషన్, పర్యాటకాభివృద్ధిపై సమీక్షా సమావేశం**
*** అరుదైన సంప్రదాయ జ్ఞాన సంపదను భవిష్యత్ తరాలకు అందించడమే లక్ష్యం**
*** పాఠశాలల్లో 'టూరిజం క్లబ్‌లు' ఏర్పాటు చేయాలని డీఈఓకు ఆదేశాలు**
*** అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్‌తో కలిసి అధికారులతో కలెక్టర్ భేటీ**

**సిద్దిపేట,**
**సెప్టెంబర్ 10 (వుదయం బ్యూరో)**



జిల్లాలో నిక్షిప్తమై ఉన్న ప్రాచీన, అరుదైన మరియు విలువైన మాన్యుస్క్రిప్టులను సేకరించి జ్ఞాన భారతం మిషన్‌కు అందించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్‌తో కలిసి జ్ఞాన భారతం మిషన్, జిల్లాలో పర్యాటకాభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... భారతదేశంలోని ప్రాచీన సంప్రదాయ జ్ఞాన సంపదను సంరక్షించి, డిజిటలైజేషన్ ద్వారా భవిష్యత్ తరాలకు అందుబాటులోకి తెచ్చేందుకు భారత ప్రభుత్వం 'జ్ఞాన భారత్ మిషన్' చేపట్టిందని తెలిపారు. జిల్లాలోని ప్రజల వద్ద ఉన్న చరిత్ర, సాహిత్యం, వైద్యం, ఖగోళశాస్త్రం, తత్వశాస్త్రం, సంస్కృతికి సంబంధించిన అమూల్యమైన గ్రంథాలు, మాన్యుస్క్రిప్టులను సేకరించాలని సూచించారు. వీటిని డిజిటలైజ్ చేసిన అనంతరం తిరిగి యజమానులకు అప్పగించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఆయా శాఖల అధికారులు కమ్యూనిటీ ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి ఈ మిషన్‌పై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లా పర్యాటకాభివృద్ధిని సమన్వయం చేసేందుకు ప్రత్యేకంగా ఒక నోడల్ అధికారిని నియమిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాకున్న ప్రత్యేక పర్యాటక బలాన్ని గుర్తించి బ్రాండింగ్‌ను అభివృద్ధి చేయాలన్నారు. ఎంపిక చేసిన విద్యా సంస్థల్లో 'టూరిజం క్లబ్‌లు' ఏర్పాటు చేసి విద్యార్థులకు వ్యాసరచన, వివిధ పోటీలు నిర్వహించాలని డీఈఓను ఆదేశించారు. త్వరలో రానున్న ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ నాగరాజమ్మ, జడ్పీ సీఈవో/డీఈఓ రమేష్, డిపిఓ రవీందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి విజయ భార్గవ్, మిషన్ భగీరథ ఎస్ఈ వెంకట్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో రాజకుమార్, డివైఎస్ఓ వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఐలమ్మ ఆశయాలే మన స్ఫూర్తి





**41వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు**

**ముషీరాబాద్,**
**సెప్టెంబర్ 10 (వుదయం):**



తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా తెలంగాణ రజక అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో కవాడిగూడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై ఐలమ్మ సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దొరల పెత్తనం, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చూపిన తెగువ, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ రజకుల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి మరిన్ని చర్యలు చేపట్టాలని ప్రభుత్వ రంగాల్లో రజకులకు తగిన అవకాశాలు కల్పించాలని, చాకలి ఐలమ్మ సేవలకు సముచిత గుర్తింపు, గౌరవం కల్పించాలని డిమాండ్ చేశారుకార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ రజక చైర్మన్ నరసింహ, సలహాదారుడు గాంధీ, జనరల్ సెక్రటరీ చంద్ర మోహన్, స్టేట్ సెక్రటరీ రాజశేఖర్, సత్యనారాయణ, పి. భాస్కర్, రమేష్ యాదవ్, కిషన్, లోకల్ చైర్మన్ సాయి సత్యనారాయణ, సీహెచ్. శ్రీనివాసులు, చుక్కన్న, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# మరో 9 హాస్పిటల్స్‌లో ఎంఆర్ఐ సేవలు

**హైదరాబాద్ /సంగారెడ్డి. వుదయం.**



ప్రభుత్వ హాస్పిటళ్లలో ఎంఆర్ఐ, సీటీ స్కాన్ సేవలను మరింత విస్తరిస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. కొత్తగా 9 ఎంఆర్ఐ యంత్రాలు, 8 సీటీ స్కాన్ యంత్రాలను ప్రభుత్వ హాస్పిటళ్లలో ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అదనంగా 485 వెంటిలేటర్లను కూడా కొనుగోలు చేసి అవసరమైన హాస్పిటల్స్‌లో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గురువారం శాసన మండలిలో ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వ హాస్పిటల్స్‌లో 9 ఎంఆర్ఐలు, 50 సీటీ స్కాన్ యంత్రాలు, 1,770 వెంటిలేటర్లు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం గాంధీ, ఉస్మానియా, నిమ్స్, వరంగల్ ఎంజీఎం, ఆదిలాబాద్ రిమ్స్, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్, ఎంఎన్‌జే కేన్సర్ హాస్పిటల్‌లో ఎంఆర్ఐ సేవలు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. కొత్తగా నిజామాబాద్ జీజీహెచ్, సిద్దిపేట జీజీహెచ్, సూర్యాపేట జీజీహెచ్, నల్గొండ జీజీహెచ్, మహబూబ్‌నగర్ జీజీహెచ్, నీలోఫర్ తదితర హాస్పిటల్స్‌లో ఎంఆర్ఐ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నామని చెప్పారు. గాంధీ, ఉస్మానియా హాస్పిటళ్లలో మెరుగైన వైద్య సేవలు అందిస్తుండడంతో, అక్కడికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో అక్కడ అదనపు ఎంఆర్ఐ యంత్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మొత్తంగా 9 అత్యాధునిక టెక్నాలజీతో కూడిని 3టెస్లా ఎంఆర్ఐ యంత్రాలను కొనుగోలు చేస్తున్నామని వెల్లడించారు.ప్రస్తుతం 50 ప్రభుత్వ హాస్పిటల్స్‌లో సీటీ స్కాన్ సేవలు అందుబాటులో ఉన్నాయని, కొత్తగా మరో 8 హాస్పిటల్స్‌లో సీటీ స్కాన్ యంత్రాలను ఏర్పాటు చేయనున్నామని మంత్రి తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ప్రస్తుతం 1,770 వెంటిలేటర్లు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన చోట అదనంగా 485 వెంటిలేటర్లను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు.వైద్య పరికరాల నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థవైద్య పరికరాలను కొనుగోలు చేయడం మాత్రమే కాకుండా, అవి నిరంతరం పనిచేసేలా చూడటానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. వైద్య పరికరాల కొనుగోలు, సరఫరా, నిర్వహణకు సంబంధించిన వివరాలను పర్యవేక్షించేందుకు ఈఉపకరణ్ అనే వెబ్ ఆధారిత పరికరాల జాబితా, నిర్వహణ వ్యవస్థను వినియోగిస్తున్నామని తెలిపారు.వైద్య పరికరాల పనితీరు, వర్కింగ్ కండీషన్, నిర్వహణ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు టీజీఎంఎస్ఐడీసీలో ప్రత్యేక ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ (పీఎంయూ) ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. పీఎంయూ ద్వారా పరికరాలను క్రమం తప్పకుండా ఆడిట్ చేసి, వాటి పనితీరు, వర్కింగ్ కండీషన్, నిర్వహణ పరిస్థితిని పర్యవేక్షిస్తూ, అవసరమైన సమయంలో సర్వీసింగ్, రిపేర్లు జరిగేలా చర్యలు 1,500 మందికి పైగా టెక్నీషియన్ల నియామకంవైద్య పరికరాలు నిరంతరం పనిచేయాలంటే శిక్షణ పొందిన టెక్నీషియన్లు కీలకమని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో గత రెండున్నరేళ్లలో 1,500 మందికి పైగా టెక్నీషియన్లను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించామని వెల్లడించారు. అవసరమైన చోట కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో టెక్నీషియన్లను నియమిస్తున్నామని మంత్రి తెలిపారు.

# ఫుడ్ సేఫ్టీ నిబంధనలు కఠినం




**పెద్దపల్లి,**
**సెప్టెంబర్-10 (వుదయం ప్రతినిధి)**

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు జిల్లాలో ఆహార భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ హోటళ్లు, బేకరీలు, రెస్టారెంట్లు, ఆహార తయారీ కేంద్రాలు, ఇతర ఆహార వ్యాపార సంస్థల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తరచుగా తనిఖీలు నిర్వహిస్తున్నారని ఫుడ్ సేఫ్టీ అధికారి ఇన్‌చార్జి అంకిత్ రెడ్డి తెలిపారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందేలా ఆహార భద్రతా నిబంధనలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ అధికారి ఇన్‌చార్జి అంకిత్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని హోటళ్లు, బేకరీలు, రెస్టారెంట్లు, స్వీట్స్ షాపులు, క్యాటరింగ్ సంస్థలు, ఇతర ఆహార వ్యాపార సంస్థలు తప్పనిసరిగా ఎఫ్ఎస్ఎస్ఏఐ రిజిస్ట్రేషన్ లేదా లైసెన్స్ పొందాలని సూచించారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ వివరాలను సంస్థలో వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని తెలిపారు. అనుమతి లేకుండా ఆహార వ్యాపారం నిర్వహించడం చట్టవిరుద్ధమని, తనిఖీల సమయంలో ఇటువంటి ఉల్లంఘనలు గుర్తిస్తే నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఆహార పదార్థాలను తయారు చేసే ప్రాంతాలు, వంటగదులు, పాత్రలు, యంత్రాలు, పరికరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని అంకిత్ రెడ్డి సూచించారు. ఆహార తయారీలో పనిచేసే సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, శుభ్రమైన దుస్తులు ధరించాలని తెలిపారు. ఆహార పదార్థాలపై ఈగలు, పురుగులు, దుమ్ము, ఇతర కాలుష్య కారకాలు పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ముడి పదార్థాలు, తయారైన ఆహార పదార్థాలను విడివిడిగా నిల్వ చేయాలని, నాణ్యత లేని లేదా పాడైన ముడి పదార్థాలను ఆహార తయారీలో ఉపయోగించరాదని తెలిపారు. గడువు ముగిసిన పదార్థాలు, ఫంగస్ పట్టిన లేదా చెడిపోయిన ఆహారాన్ని విక్రయించకూడదని స్పష్టం చేశారు. ఆహార పదార్థాలను సరైన ఉష్ణోగ్రత వద్ద భద్రపరచడంతో పాటు పరిశుభ్రమైన నీటిని మాత్రమే వినియోగించాలని సూచించారు.వినియోగదారులకు విక్రయించే ఆహార పదార్థాలు తాజాగా, నాణ్యంగా ఉండేలా వ్యాపారులు బాధ్యత వహించాలని అంకిత్ రెడ్డి తెలిపారు. ప్యాక్ చేసిన ఆహార పదార్థాల విషయంలో తయారీ తేదీ, గడువు తేదీ, ఇతర తప్పనిసరి లేబులింగ్ వివరాలను నిబంధనల ప్రకారం ముద్రించాలని సూచించారు. ఆహార పదార్థాల నిల్వ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు.ఆహార తయారీ, నిల్వ, రవాణా, విక్రయాల ప్రతి దశలో నిర్దేశిత భద్రతా ప్రమాణాలను పాటించాలని, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా నాణ్యత లోపాలు చోటుచేసుకోకుండా వ్యాపారులు స్వయంగా నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. వినియోగదారుల ఆరోగ్యంతో ముడిపడి ఉన్నందున ఆహార భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని ఆయన స్పష్టం చేశారు.కమన్‌పూర్ మండల కేంద్రంలో ఎలాంటి ఎఫ్ఎస్ఎస్ఏఐ రిజిస్ట్రేషన్ లేదా లైసెన్స్ పొందకుండా ఆహార వ్యాపారం నిర్వహిస్తున్న ఒక బేకరీపై ఫుడ్ సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకుని మూసివేశారు. బేకరీలో బ్రెడ్ తదితర ఆహార పదార్థాల తయారీ సమయంలో పరిశుభ్రత ప్రమాణాలు పాటించడం లేదని వచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు తనిఖీ నిర్వహించారు.తనిఖీ సందర్భంగా బేకరీలో ఆహార తయారీ, పరిశుభ్రతకు సంబంధించిన పరిస్థితులను పరిశీలించడంతో పాటు విక్రయ కౌంటర్‌ను కూడా తనిఖీ చేయగా, ఫంగస్ పట్టిన బ్రెడ్ పదార్థం విక్రయానికి ఉంచినట్లు గుర్తించినట్లు ఫుడ్ సేఫ్టీ అధికారి ఇన్‌చార్జి అంకిత్ రెడ్డి తెలిపారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ రిజిస్ట్రేషన్ లేదా లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహించడం,

ఆహార తయారీలో పరిశుభ్రత ప్రమాణాలు పాటించకపోవడం, ఫంగస్ పట్టిన ఆహార పదార్థం విక్రయానికి ఉంచడం వంటి అంశాలను గుర్తించి బేకరీని మూసివేసినట్లు వెల్లడించారు. జిల్లాలో ఆహార భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ హోటళ్లు, బేకరీలు, రెస్టారెంట్లు, స్వీట్స్ షాపులు, ఇతర ఆహార వ్యాపార సంస్థల్లో తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నామని అంకిత్ రెడ్డి తెలిపారు. తనిఖీల సందర్భంగా ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్, ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానం, తయారీ ప్రదేశాల పరిస్థితులు తదితర అంశాలను పరిశీలిస్తున్నామని చెప్పారు.వ్యాపారులు అధికారులు తనిఖీలకు వచ్చే వరకు వేచి చూడకుండా ప్రతిరోజూ ఆహార భద్రతా ప్రమాణాలను పాటించేలా తమ సంస్థల్లో అంతర్గతంగా పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిబంధనలు పాటిస్తూ ప్రజలకు సురక్షితమైన ఆహారం అందించేందుకు వ్యాపారులు సహకరించాలని, ఉల్లంఘనలు గుర్తించిన సందర్భంలో చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టీ అధికారి ఇన్‌చార్జి అంకిత్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఐలమ్మకు ఘన నివాళులు



*** పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాలి: మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య నాగరాజు**

**రామాయంపేట,సెప్టెంబర్ 10(వుదయం ప్రతినిధి రాజాగౌడ్)**

:రామాయంపేట మున్సిపల్ పరిధిలో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజ్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె చేసిన పోరాటాలను స్మరించుకున్నారు.సామాజిక అసమానతలు, వెట్టిచాకిరీ, దోపిడీకి వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ ధైర్యంగా పోరాడి ప్రజల్లో స్ఫూర్తి నింపారని పేర్కొన్నారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పోచమ్మల నవనీత గణేష్, కౌన్సిలర్ పుట్టి సందీప్, దాకి శ్యామల స్వామి, పట్టణ అధ్యక్షుడు చింతల స్వప్న స్వామి, రజక సంఘం పెద్దలు, బీసీ సంఘాల నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐలమ్మ సేవలను కొనియాడుతూ ఆమెకు ఘన నివాళులర్పించారు.

# అర్ధరాత్రి అరెస్టులా.. ఇదేనా ప్రజా పాలన?

*** బీఆర్ఎస్వీ పటాన్‌చెరు నియోజకవర్గ అధ్యక్షుడు కమ్మెట చెన్నారెడ్డి అరెస్ట్**

**వుదయం, తెల్లాపూర్ ప్రతినిధి (సెప్టెంబర్ 10)**

జీవో నం.97కు వ్యతిరేకంగా అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో బీఆర్ఎస్వీ పటాన్‌చెరు నియోజకవర్గ అధ్యక్షుడు కమ్మెట చెన్నారెడ్డిని తన నివాసంలో పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయనను కొల్లూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో ముందస్తు అరెస్టుల్లో భాగంగానే ఈ చర్య చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. విద్యార్థి, యువ నాయకులను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అర్ధరాత్రి అరెస్టులతో ఉద్యమాలను అణిచివేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ ఇన్ని అరెస్టులు జరగలేదని కమ్మెట చెన్నారెడ్డి పేర్కొన్నారు. జీవో నం.97ను రద్దు చేసే వరకు తమ నిరసనలు, ఉద్యమాలు కొనసాగుతాయని చెన్నారెడ్డి స్పష్టం చేశారు. ఎన్ని అరెస్టులు చేసినా తమ ఉద్యమాన్ని ఆపలేరని తెలిపారు.

# వరి మొగి పురుగు నివారణ




*** రైతులు అధిక శాతం రసాయన మందులపై ఆధారపడొద్దు : అధికారి ప్రవీణ్‌కుమార్**

**రామాయంపేట,సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి రాజాగౌడ్)**

వరి పంటలో మొగి పురుగు ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలోరైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) సౌజన్యంతో గురువారం రామాయంపేట మండలం కాట్రియాల్ గ్రామంలో రైతు శిక్షణ, క్షేత్ర ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు మద్దిరాములు వ్యవసాయ క్షేత్రంలో వరి సాగులో సమగ్ర సస్యరక్షణ (IPM) పద్ధతులపై రైతులకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ..వరి పంటలో చీడపీడలను గుర్తించి ఆర్థిక నష్టపరిమితి (ETL) దాటినప్పుడు మాత్రమే రసాయన పురుగుమందులను సిఫార్సు చేసిన మోతాదులో వినియోగించాలని సూచించారు.అనవసరంగా మందులు పిచికారీ చేయడం వల్ల సాగు ఖర్చు పెరగడంతోపాటు మిత్రపురుగులు, పర్యావరణానికి నష్టం కలుగుతుందని తెలిపారు.పంటను తరచూ పరిశీలిస్తూ సేద్య, యాంత్రిక, జీవ నియంత్రణ పద్ధతులను సమన్వయంతో అమలు చేయాలని సూచించారు. అధిక మోతాదులో నత్రజని ఎరువులు వాడకుండా సమతుల్య ఎరువుల వినియోగం, పొలంలో అవసరానికి మించి నీరు నిల్వ ఉంచకుండా ఆరుతడి విధానం పాటించడం ద్వారా పలు చీడపీడలను నియంత్రించవచ్చన్నారు. వేప ఆధారిత మందులు, మిత్రపురుగుల సంరక్షణ, లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టలు వంటి పద్ధతులను అవసరానికి అనుగుణంగా వినియోగించాలని వివరించారు.

సమగ్ర సస్యరక్షణ పద్ధతులతో సాగు ఖర్చు తగ్గడంతో పాటు నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతులు, గ్రామస్తులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఫిజికల్ డైరెక్టర్ నర్సిములుకు సన్మానం



**నారాయణపేట టౌన్ సెప్టెంబర్10(వుదయం ప్రతినిధి)**

నారాయణపేట మండలం జిల్లా జాజపూర్ పరిషత్ ఉన్నత పాఠశాల పిడి గౌడుగు నర్సిములుకు జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపా ధ్యాయ అవార్డు పొందినం దుకు గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు పొందినందుకు పాఠశాలకు గ్రామానికి మంచి పేరు వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింలు పీడీ మాట్లాడుతూ ఈ అవార్డు రావడం వల్ల మరింత బాధ్యత పెరిగి విద్యార్థులను జిల్లా స్థాయి రాష్ట్రస్థాయి జాతీయ స్థాయిలో విద్యార్థులను తీసుకొని పోవడానికి కృషి చేస్తారని తెలిపారు.

ఈ సన్మాన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం విజయ భాను ప్రకాష్, మధుసూదన్ ,నర్సింలు, ప్రతాప్, నరసింహ, లక్ష్మణ్, రఘురాం రెడ్డి, విజయ, మంగళ, శశిరేఖ, శ్రీదేవి ,నిర్మల ,శిరీష, సంగీత విద్యార్థులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణకు కార్యాచరణ సిద్ధం చేయాలి



**జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా**

**మహబూబ్ నగర్ సెప్టెంబర్10(వుదయం ప్రతినిధి)**

ఈ వానాకాలం (ఖరీఫ్) సీజన్ ధాన్యం సేకరణకు కార్యాచరణ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. 2026 27 ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణ పై గురువారం జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ లో సంబంధిత శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సీజన్ లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నాణ్యత ప్రమాణాల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ఇందుకుగాను అన్ని శాఖలు వారి వారి శాఖల ద్వారా చేసే ఏర్పాట్లన్నీ ముందే చేసుకోవాలని ఆదేశించారు. జిల్లా లో వానకాలం సీజన్ కు ధాన్యం 4,25,000 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి జరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేయగా,ఇందులో 1,80,000 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారుధాన్యం దిగుబడి,ఉత్పత్తి అంచనా ప్రకారం అక్టోబర్ 1 నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలన్నీ ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినందున, జిల్లాలో సెప్టెంబర్ 30 నాటికి నిర్దేశించిన 163 ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన సౌకర్యాలన్ని కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన లారీలు, హమాలీలు ,తూకం కొలిచే యంత్రాలు, తేమ కొలిచే యంత్రాలు అన్ని సిద్ధం చేసుకోవాలని, ఆదేశించారు. అలాగే జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిలువ ఉంచేందుకు స్టోరేజీ స్పేస్ ముందుగానే గుర్తించాలని ,ఇందుకు గాను నిరుపయోగంగా ఉన్న పరిశ్రమల్లో వేర్ హౌసింగ్ లు నిల్వ చేయటానికి అనువుగా ఉన్న వాటిని పౌర సరఫరాల అధికారులు,పరిశ్రమల శాఖ జి.ఎం. సంయుక్తంగా తనిఖీ చేసి గుర్తించాలని అన్నారు.మండల,గ్రామ పరిధిలోనడవని ప్యాక్టరీలు ,షెడ్లు ,ప్రైవేటు గోదాముల వివరాలను సేకరించాలని ఇందుకుగాను తక్షణమే ,పంచాయతీ కార్యదర్శులకు లేఖ రాయాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. గత సీజన్ కు ఈ సీజన్ కు ఉన్న మార్పులను కలెక్టర్ తెలియజేస్తూ ఈ సంవత్సరం దాన్యం తీసుకువెళ్లే వాహనాలకు జిపిఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 7 రకాల సన్న ధాన్యం వెరైటీ లకు ప్రభుత్వం 500 రూ.లు బోనస్ ప్రకటించినందున వ్యవసాయ శాఖ ఏ.ఈ.ఓ లు సమస్యలు లేకుండా జాగ్రత లు తీసుకోవాలని అన్నారు.కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కనీస సౌకర్యాలు కల్పించి ఎల్ 3 కేటగిరీకి సరిపోయిన కొనుగోలు కేంద్రా చేయటం జరుగుతుందని అన్నారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ 18 సెంటర్ లను వరద ప్రభావిత కేంద్రాలుగా గుర్తించినందున వాటిని సరైన ప్రదేశాల్లో కి మార్చాలని సూచించారు..ధాన్యం కొనుగోలు పై శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం గ్రేడ్ ఏ దాన్యానికి 2461 రూపాయలు, కామన్ వెరైటీకి 2441 రూపాయలను మద్దతు ధర ప్రకటించినట్లు తెలిపారు. గన్నీలు 17 లక్షలు అందుబాటులో ఉన్నట్లు పౌర సరఫరాల శాఖ అధికారులు వివరించారు.

తేమ కొలిచే యంత్రాలు, తూకం యంత్రాలు సిద్ధం చేసుకోవాలని, ధాన్యం సేకరణలో చిన్న తప్పు జరగడానికి వీలు లేదని అన్నారు. తూకం కొలిచే యంత్రాల సామర్థ్యాన్ని ముందే తనిఖీ చేయాలని, హైవేలపై ఉండే వే బ్రిడ్జిలను కూడా తనిఖీ చేయాలని తూనికల కొలతల శాఖ అధికారి ని ఆదేశించారు రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి.హరిప్రియ 2026 27 ఖరీఫ్ ధాన్యం సేకరణ కు చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె ఎల్ బి హరిప్రియ ,పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రవి నాయక్, డిఎస్ ఓ గంప శ్రీనివాస్,డి. ఆర్ డి.ఓ నర్సింహులు,పరిశ్రమల శాఖ జి. ఎం.శ్రీ లక్ష్మి, డిసిఓ కృష్ణ, మార్కెటింగ్ బాల మణి జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, లీగల్ మెట్రాలజీ అధికారి రవీందర్ అధికారులు, స్టేట్ వేర్ హౌసింగ్,సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజర్ లు తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# మొక్కజొన్నల తరలింపుపై ముసురుతున్న అనుమానాలు!

**అనుమతులు.. టెండర్ ప్రక్రియ ఎక్కడ?**
**రెండు డీసీఎంలను అడ్డుకున్న లారీ అసోసియేషన్ డ్రైవర్లు**
**గోదాం నుంచి నిల్వల తరలింపుపై అధికారుల మౌనం.. విచారణకు డిమాండ్**

**గద్వాల సెప్టెంబర్ 10 (వుదయం బ్యూరో)**

ప్రభుత్వ పరిధిలోని గోదాంలో నిల్వ ఉన్న మొక్కజొన్నల తరలింపు వ్యవహారం గద్వాలలో చర్చనీయాంశంగా మారింది. గద్వాల మండలం కొండపల్లి రోడ్డులోని గ్రామీణుల గిడ్డంగుల గోదాం నుంచి మొక్కజొన్నలను తరలిస్తున్న రెండు డీసీఎం వాహనాలను లారీ అసోసియేషన్‌కు చెందిన డ్రైవర్లు అడ్డుకున్నట్లు సమాచారం. అయితే, ఈ తరలింపునకు సంబంధించి అవసరమైన అనుమతులు ఉన్నాయా? నిబంధనల ప్రకారం టెండర్ లేదా ఇతర ప్రక్రియ పూర్తయిందా? అన్న ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వచ్చాయి. అనుమతులు లేకుండానే తరలింపా?గోదాముల్లో నిల్వ ఉన్న వ్యవసాయ ఉత్పత్తులను బయటకు తరలించే సమయంలో సంబంధిత శాఖల అనుమతులు, అధికారిక ఆదేశాలు, రవాణాకు సంబంధించిన పత్రాలు ఉండాల్సి ఉంటుంది. కానీ కొండపల్లి రోడ్డులోని గోదాం నుంచి మొక్కజొన్నల తరలింపు విషయంలో ఆ నిబంధనలు పూర్తిగా పాటించారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తరలింపునకు వచ్చిన రెండు డీసీఎం వాహనాలను డ్రైవర్లు అడ్డుకోవడంతో వ్యవహారం ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. వాహనాల్లోని మొక్కజొన్నలు ఎక్కడికి తరలిస్తున్నారు? ఎవరి ఆదేశాల మేరకు తరలిస్తున్నారు? ఎంత పరిమాణంలో నిల్వను తరలించేందుకు అనుమతి ఇచ్చారు? అనే ప్రశ్నలకు స్పష్టత రావాల్సి ఉంది. టెండర్.. వేలం.. అనుమతి ఏది? మొక్కజొన్నల తరలింపు వెనుక అసలు ప్రక్రియ ఏమిటన్నదే ఇప్పుడు కీలకంగా మారింది. నిల్వలను తరలించేందుకు టెండర్ నిర్వహించారా? వేలం ప్రక్రియ ఏదైనా చేపట్టారా? లేక ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తరలింపు చేపట్టారా? అన్నది అధికారులు వెల్లడించాల్సి ఉంది.టెండర్ లేదా అనుమతి ప్రక్రియ ఉంటే దానికి సంబంధించిన పత్రాలు అప్పగించారు? ఏ నిబంధనల ప్రకారం పర్యవేక్షణ తప్పనిసరి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరిగిన తరలింపు నకు గోదాం ఇన్‌చార్జి అనుమతి ఉందా? ఉంటే ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయా? అనే అంశాలు పరిశీలనకు రావాల్సి ఉంది. అనుమతులు, టెండర్ ప్రక్రియ, రవాణా పత్రాలు అన్నీ సక్ర మంగా ఉంటే వివాదానికి తావుండదు. అదే సమయంలో, నిబంధనలకు విరుద్ధంగా తరలింపు జరిగినట్లు నిబంధనలకు అనుగుణంగానే తరలింపు జరిగిందా? లేక అనుమతుల విషయంలో ఏమైనా లోపాలు చోటుచేసుకున్నాయా? అన్నది స్పష్టం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.మొక్కజొన్నల తరలింపునకు అనుమ తులు ఉన్నాయా? టెండర్ లేదా వేలం ప్రక్రియ జరిగిందా? అధికారిక ఆదేశాలు ఎవరు ఇచ్చారు? అన్న ప్రశ్నలకు సమా ధానం లభిస్తేనే ఈ వ్యవహారంపై నెలకొన్న అనుమానాలకు తెరపడనుంది.

# అచ్చంపేటలో ఎస్‌బీఐ సేవా కార్యక్రమాలు



**అచ్చంపేట, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):**

అచ్చంపేట ఏరియాలో ఎస్‌బీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ సాక్ష్యం (Gram Saksham) ప్రాజెక్టు కింద వివిధ సేవా, అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. BAIF సంస్థ సహకారంతో, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సురభి, భాను,వెటర్నరీ డాక్టర్ విహార్, ఫీల్డ్ ఆఫీసర్లు బి.శేఖరయ్య, శివ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. నిర్వహిస్తున్న కార్యక్రమాలు:1. ఉచిత పశు వైద్య సేవలు: అచ్చంపేట మండలం పుల్జాల గ్రామంలో శాలిహోత్ర ఎక్స్ ప్రెస్ వాహనం ద్వారా రైతుల ఇంటి వద్దకే ఉచిత పశు వైద్య సేవలు అందించారు.2. పశువులకు తాగునీటి తొట్టెలు: గ్రామాల్లో పశువుల దాహార్తి తీర్చేందుకు ఎస్‌బీఐ ఫౌండేషన్ ద్వారా తాగునీటి తొట్టెలను ఏర్పాటు చేశారు.3. అవగాహన సదస్సులు: గ్రామాల్లో విలేజ్ అవేర్ నెస్ మీటింగ్ లు, హెల్త్ ట్రీట్మెంట్ క్యాంపులు, వీడియో అవేర్ నెస్ మీటింగ్ లను నిర్వహించి ప్రజలకు ఆరోగ్యం, పరిశుభ్రత, పశు సంరక్షణ, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు.ఈ సేవా కార్యక్రమాల ద్వారా అచ్చంపేట మారుమూల గ్రామాల రైతులకు, గిరిజన ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఫోటో 1. పుల్జాలలో శాలిహోత్ర ఎక్స్ ప్రెస్ వాహనం వద్ద గ్రామస్తులు, వైద్య సిబ్బంది2. ఎస్‌బీఐ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన తాగునీటి తొట్టె వద్ద నీరు తాగుతున్నగేదెలు,పశువులు

# ఐలమ్మ పోరాట పటిమ భవిష్యత్ తరాలకు దిక్సూచి



*** చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలు**
*** గజ్వేల్ నియోజకవర్గంలో ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు**
*** రజక సంక్షేమ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమాలు**

**గజ్వేల్/ప్రజ్ఞాపూర్ సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)**

తెలంగాణ నిప్పుకనిక, వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గ రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలు గ్రామాలలో వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మొదటగా గజ్వేల్ పట్టణంలోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రజ్ఞాపూర్, శ్రీగిరిపల్లి, అలీరాజ్ పేట్, జగదేవ్‌పూర్ గ్రామాల్లోని ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు.ఈ సందర్భంగా నియోజకవర్గ రజక సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎల్లేష్ మాట్లాడుతూ... ఆనాటి సమాజంలో అట్టడుగు వర్గంలో జన్మించిన ఐలమ్మ, సమాజంలోని అసమానతలను చూసి చలించిపోయారని గుర్తుచేశారు. సమాజం ఆర్థికంగా, సామాజికంగా ఉన్నప్పుడు మాత్రమే గుర్తింపు లభిస్తుందని గ్రహించి, తను నమ్మిన సిద్ధాంతం కోసం ఏనాడూ వెనుకాడకుండా "భూమి కోసం.. భుక్తి కోసం.." పోరాటం చేశారని కొనియాడారు.

సంఘం ప్రధాన కార్యదర్శి జిల్లా రాంగారి శ్రీధర్ మాట్లాడుతూ... ఐలమ్మ గారు సమాజంలోని వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా, సాయుధ తెలంగాణ పోరాటంలో ప్రధాన భూమిక పోషించడమే కాకుండా, రాబోయే భవిష్యత్ తరాలకు గొప్ప దిక్సూచిగా నిలిచారని తెలిపారు.ఈ నివాళి కార్యక్రమాల్లో రజక సంఘం కార్యదర్శి నర్సింలు, గజ్వేల్ప్రజ్ఞాపూర్ సంఘం పెద్దలు రాంగారి శివరాజయ్య, ఎనగారి రాములు, ఎనగారి మల్లేశం, రాంగారి ప్రవీణ్, ప్రజ్ఞాపూర్ మరియు జగదేవ్‌పూర్ రజక సంఘ ప్రతినిధులు, జిల్లా అధ్యక్షులు రాచకొండ ప్రశాంత్, జగదేవ్‌పూర్ రజక సంఘ నాయకులు, స్థానిక రజక నాయకులు □□□□□□ గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోహిర్‌లో ఎస్‌జీఎఫ్ క్రీడల సందడి




**"క్రీడా పతాకాన్ని ఆవిష్కరించిన ఎంఈవో జాకీర్ హుస్సేన్"**
**"కబడ్డీ, ఖో-ఖోలో సత్తా చాటిన విద్యార్థులు"**

**కోహిర్, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి ):**

సంగారెడ్డి జిల్లా కోహిర్ మండల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడా పోటీలు గురువారం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. కోహిర్‌లోని ఎంపీపీఎస్ లాలకుంట పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీలకు వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై క్రీడా ప్రతిభను చాటుకున్నారు.కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి మహ్మద్ జాకీర్ హుస్సేన్ ఎస్‌జీఎఫ్ క్రీడల పతాకాన్ని ఆవిష్కరించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఆరోగ్యమే మహాభాగ్యం.. ఆరోగ్యకరమైన శరీరంలోనే ఆరోగ్యకరమైన మనస్సు ఉంటుంది" అని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఆరోగ్యంపై వైద్యురాలి సూచనలుబిలాల్‌పూర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దివ్యజ్యోతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడి క్రీడాకారులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పోటీల సమయంలో తగినంత నీరు తీసుకోవడం, పౌష్టికాహారం తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం పీఈటీ సురేఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో క్రీడా ప్రమాణ స్వీకారం చేయించారు.కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ప్రభు, శారద, సుచరిత, శ్రీనివాస్‌తో పాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.కబడ్డీలో హోరాహోరీ పోరుమొదటి రోజు నిర్వహించిన కబడ్డీ పోటీల్లో అండర్ 14 విభాగంలో టీఎంఆర్ఈఐఎస్ స్కూల్, కోహిర్ విజేతగా నిలవగా, జెడ్పీహెచ్ఎస్ కావేలి రన్నరప్‌గా నిలిచింది. అండర్17 విభాగంలో జెడ్పీహెచ్ఎస్ గురుజ్వాడ విజేతగా, జెడ్పీహెచ్ఎస్ దిగ్వాల్ రన్నరప్‌గా నిలిచింది.ఖోఖోలోనూ ప్రతిభఖోఖో అండర్14 విభాగంలో జెడ్పీహెచ్ఎస్ కావేలి విజేతగా నిలవగా, జెడ్పీహెచ్ఎస్ పిచరగడి రన్నరప్‌గా నిలిచింది. అండర్17 విభాగంలో జెడ్పీహెచ్ఎస్ పిచర్యాగడి విజేతగా, టీఎంఆర్ఐఈఎస్ కోహిర్ రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు నిర్వాహకులు జ్ఞాపికలను అందజేసి అభినందించారు.క్రీడా మైదానంలో విద్యార్థులు గెలుపే లక్ష్యంగా ఉత్సాహంగా పోటీపడటంతో సందడి నెలకొంది. క్రీడాకారులను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు ప్రోత్సహిస్తూ క్రీడా స్ఫూర్తిని నింపారు.ఉపాధ్యాయుల సహకారంతో విజయవంతంక్రీడా పోటీలను పీఈటీలు సురేఖ, రేవతి, దినాకర్, క్రాంతి సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించారు. వారికి ఎంపీపీఎస్ లాలకుంట ప్రధానోపాధ్యాయులు నరసింహులు, ఉపాధ్యాయులు రాకేష్, సురేష్, శ్రీధర్‌నాథ్, ఆనంద్, ఇఫ్తేకార్, తిరుమలేష్, ఇలియాస్, క్రాంతి, జహంగీర్, సోహైల్, పద్మయ్య, స్వరాజ్, యాదయ్య, మోహన్, కిషన్ తదితరులు పూర్తి సహకారం అందించారు. క్రీడలను విజయవంతంగా నిర్వహించడంలో ఉపాధ్యాయుల సమన్వయం, సహకారం కీలకంగా నిలిచింది.

# రైతుల సమక్షంలోనే భూముల రీ-సర్వే చేపట్టాలి: కలెక్టర్ కె. హైమావతి



*** చిన్నకోడూర్ మండలం చెర్ల అంకిరెడ్డిపల్లిలో 'భూ భారతి' రీ-సర్వే అవగాహన కార్యక్రమం**
*** రూ. 6-7 లక్షల విలువైన అధునాతన 'రోవర్' సాంకేతికతతో భూముల కొలతలు**
*** 91 ఏళ్ల తర్వాత మళ్లీ సమగ్ర భూ సర్వే.. రైతులకు ఖచ్చితమైన మ్యాప్‌లు అందజేత**
*** అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్‌తో కలిసి పాల్గొన్న జిల్లా కలెక్టర్**

**సిద్దిపేట, సెప్టెంబర్ 10 (వుదయం బ్యూరో)**

రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా భూముల రీసర్వే ప్రక్రియను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సర్వే అధికారులను ఆదేశించారు. గురువారం చిన్నకోడూర్ మండలం చెర్ల అంకిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన 'భూ భారతి భూ సర్వే, రీసర్వే' అవగాహన సదస్సులో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్‌తో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా పా 25 రం:గతంలో భూముల క్రయవిక్రయాల వల్ల సబ్‌డివిజన్లు మారడం, పట్టా ఒకరి పేరిట ఉండి కబ్జాలో మరొకరు ఉండటం వంటి అనేక సమస్యలు తలెత్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ రీసర్వే ద్వారా అలాంటి సమస్యలన్నింటికీ ఖచ్చితమైన పరిష్కారం లభిస్తుందన్నారు. అధికారులు సర్వే ప్రారంభించే ముందే రైతులకు సమాచారం ఇవ్వాలని, తప్పనిసరిగా రైతుల సమక్షంలోనే హద్దులు, కోఆర్డినేట్లను నమోదు చేయాలని స్పష్టం చేశారు. రీసర్వే పూర్తయిన తర్వాత ప్రతి రైతుకు వారి భూమికి సంబంధించిన ఖచ్చితమైన మ్యాప్‌ను అందజేస్తామన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి సుదర్శన్, స్థానిక సర్పంచ్ గాలిపల్లి అనిల్, తహసీల్దార్ సలీం, వివిధ గ్రామాల సర్వే అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలి




*** అచ్చంపేట సబ్ కలెక్టర్ ను కలిసిన సీపీఎం బృందం**

**అచ్చంపేట, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)**

ప్రజలు ఎదుర్కొంటున్నా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలనీ అచ్చంపేట డివిజన్ సీపీఎం బృందం సభ్యులు అచ్చంపేట నూతన .సబ్ కలెక్టర్ సలోని చాబ్రా ను కోరారు.సీపీఎం అచ్చంపేట డివిజన్ బృందం బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకే అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అచ్చంపేట మారుమూల ప్రాంతమని, ఇక్కడ బడుగు బలహీన వర్గాలు, ఆదివాసీ గిరిజనులు అధికంగా ఉంటారని, వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.దీనికి స్పందించిన సబ్ కలెక్టర్ గారు ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు .ఈ కార్యక్రమంలో డివిజన్ బాధ్యులు దేశ్యానాయక్, జిల్లా నాయకులు నిర్మల, శంకర్ నాయక్, మల్లేష్, అచ్చంపేట మండల కార్యదర్శి వర్ధం సైదులు, నాయకులు శివ, రాములు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళి



**సంగారెడ్డివుదయం**

: జిల్లా కేంద్ర గ్రంథాలయం సంగారెడ్డిలో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు జి. అంజయ్య, కార్యదర్శి ఎం. మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం గడీల పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. భూస్వామ్య దోపిడీ, నిరంకుశత్వానికి ఎదురొడ్డి నిలిచి పేదలు, బలహీన వర్గాల కోసం ఆమె చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఐలమ్మ చూపిన తెగువ, ధైర్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు అంజయ్య, అల్లాపూర్ సర్పంచ్, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మంత్రాలయానికి సులువైన బస్సు ప్రయాణం




*** శాంతినగర్ నుంచి ప్రతిరోజూ ఉదయం 7 గంటలకు సర్వీసు**
*** పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానికుల సూచన**

**శాంతినగర్ సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)**

మంత్రాలయం పుణ్యక్షేత్రాన్ని దర్శించుకునే భక్తులకు శుభవార్త. శాంతినగర్ నుంచి మంత్రాలయానికి ప్రతిరోజూ ఉదయం బస్సు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ప్రతి రోజు ఉదయం 7 గంటల సమయంలో శాంతినగర్ నుంచి మంత్రాలయం బస్సు బయలుదేరనుంది. ఈ బస్సు సర్వీసును గురువారం ఉదయం శాంతినగర్‌కు చెందిన పలువురు ప్రయాణికులు వినియోగించు కున్నారు. మంత్రాలయానికి నేరుగా వెళ్లేందుకు రవాణా సౌకర్యం అందుబా టులోకి రావడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ప్రయాణంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గడంతోపాటు, భక్తులకు సమయం, శ్రమ ఆదా కానుందని పేర్కొన్నారు. పరిసర గ్రామాలకూ ప్రయోజనం శాంతినగర్ పరిసర ప్రాంతా ల్లోని గ్రామాల ప్రజలకు కూడా ఈ బస్సు సర్వీసు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు తెలిపారు. మంత్రాలయం దర్శనానికి వెళ్లే భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ ఉదయం బస్సు సర్వీసు అందుబాటులో ఉండటంతో శాంతినగర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి మంత్రాలయం వెళ్లే భక్తులకు రవాణా సౌకర్యం మరింత సులభతరం కానుంది. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ సర్వీసును కొనసాగిస్తూ, భవిష్యత్‌లో మరింత మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. యూత్ కాంగ్రెస్ నిరసన




**అచ్చంపేట, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):**

తెలంగాణ శాసనసభ స్పీకర్ గౌరవ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన అసభ్యకర, అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ అచ్చంపేట పట్టణంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు.దళిత నాయకుడిగా శాసనసభ స్పీకర్‌గా గౌరవ ప్రదమైన స్థానంలో ఉన్న గడ్డం ప్రసాద్ కుమార్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని నాయకులు అన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలోలు చేయడం ప్రజా న్నారు.బాధ్యతాయుతమైన రాజకీయ వ్యవస్థలో ప్రజాప్రతినిధులు హుందాగా వ్యవహరించాలని, ప్రజాస్వామ్య విలువలను కించపరిచే వ్యాఖ్యలకు బీఆర్ఎస్ నాయకులు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అండగా ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతిభావంతురాలు నిఖితకు అభినందనలు



జిన్నారం 10 సెప్టెంబర్ (వుదయం ప్రతినిధి)

ఐడీఏ బొల్లారం ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ కుమార్తె, ఉస్మానియా యూనివర్సిటీ సైన్స్ కాలేజ్ (కెమిస్ట్రీ విభాగం) 85వ స్నాతకోత్సవంలో ఏకంగా 5 గోల్డ్ మెడల్స్ సాధించిన బేగంపేట నిఖితను బొల్లారం బిజెపి పట్టణ అధ్యక్షుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి గురువారం నేరుగా ఆమె నివాసానికి వెళ్లి అభినందించారు .ఈ సందర్భంగా నిఖితను శాలువాతో ఘనంగా సత్కరించి, పర్యావరణ స్ఫూర్తిగా పూల మొక్కను అందజేశారు.

"సాధారణ ఆటో డ్రైవర్ కుటుంబంలో పుట్టి, కష్టపడి చదివి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 5 స్వర్ణ పతకాలు సాధించడం మన బొల్లారం ప్రాంతానికే గర్వకారణం. నిఖిత సాధించిన ఈ విజయం ఎందరో విద్యార్థులకు ఆదర్శం. నిఖితమ్మా, భవిష్యత్తులో నీ ఉన్నత విద్యకు లేదా పరిశోధనలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా, ఏ కష్టం ఉన్నా నీకు ఒక అన్నగా, ఒక తండ్రిగా నేను అండగా ఉంటాను. చక్కగా చదువుకుని, కెమిస్ట్రీలో పీహెచ్‌డీ పూర్తి చేసి గొప్ప రీసెర్చర్‌గా దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాను అని ఆనంద్ కృష్ణ రెడ్డి అన్నారు.మన బొల్లారంలోని యువతీ యువకులకు నాదొక విన్నపం మీ తల్లి దండ్రులు రేయనక పగలనక ఎంతో కష్టపడి మిమ్మల్ని చదివిస్తున్నారు. వారి కష్టాన్ని, త్యాగాలను గుర్తించి, నిఖిత లాగే మీరు కూడా కష్టపడి చదివి ఎన్నో మెడల్స్, సాధనలు పొంది భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలి అని అన్నారు. బొల్లారంలో ఏ విద్యార్థికైనా చదువుకోవడానికి ఆర్థికంగా గానీ, మరేదైనా ఇబ్బంది ఉంటే మీకు తోడుగా, అండగా నేను ఉంటాను అని ఆనంద్ కృష్ణ రెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొని నిఖితను అభినందించారు.

# ప్రజల సమస్యలే అసెంబ్లీ ఎజెండా కావాలి



☐ రాజకీయ విమర్శలకు కాకుండా ప్రజా సమస్యలపై చర్చించాలి
☐ పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి
☐ రుణమాఫీ అందని అర్హులైన రైతులకు న్యాయం చేయాలి

నాగిరెడ్డిపేట,వుదయం

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా మారాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, AIDYO తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ దేవసోత్ శ్రీనివాస్ నాయక్ రాథోడ్ డిమాండ్ చేశారు. అధికార, ప్రతిపక్షాలు రాజకీయ ఆరోపణలు, పరస్పర విమర్శలకు సభా సమయాన్ని పరిమితం చేయకుండా రైతులు, కార్మికులు, విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, ఉద్యోగులు, పేదలు, మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చించాలని కోరారు.

పాలిటెక్నిక్ సమస్యలు పరిష్కరించాలిపాలిటెక్నిక్ విద్యార్థులు తమ విద్యా భవిష్యత్తు, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై ఆందోళన చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులు, సాంకేతిక నిపుణులతో చర్చించి సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. కళాశాలల్లో ఖాళీ అధ్యాపక పోస్టులను భర్తీ చేయడంతో పాటు ప్రయోగశాలలు, పరికరాలు, హాస్టళ్లు, గ్రంథాలయాలు, ఇతర మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులు, కళాశాలల ఇబ్బందులను తొలగించాలని అన్నారు.అర్హులైన రైతులందరికీ రుణమాఫీరూ.2 లక్షల వరకు పంట రుణమాఫీకి అర్హత ఉన్నప్పటికీ ప్రయోజనం పొందని రైతులను గుర్తించి పూర్తి రుణమాఫీ చేయాలని శ్రీనివాస్ నాయక్ రాథోడ్ కోరారు. ఆధార్, బ్యాంకు ఖాతాలు, భూ రికార్డులు, సాంకేతిక లోపాలు తదితర కారణాలతో రుణమాఫీ అందని రైతులను గ్రామ, మండల, బ్యాంకు స్థాయిలో గుర్తించాలని అన్నారు.

రుణమాఫీ ఆలస్యంతో రైతులపై వడ్డీ భారం పెరుగుతోందని, అర్హులైన ఒక్క రైతు కూడా రుణమాఫీ నుంచి మిగలకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రుణమాఫీతో పాటు గిట్టుబాటు ధర, పెట్టుబడి సాయం, విత్తనాలు, ఎరువులు, సాగునీరు, విద్యుత్, పంట బీమా, నష్టపరిహారం వంటి సమస్యలపై శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

హామీలను అమలు చేయాలి

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాలను బలోపేతం చేయాలని, ఖాళీ ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని కోరారు. బీసీలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు, మహిళలు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ జరపాలని అన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మికులకు కనీస వేతనాలు, సామాజిక భద్రత కల్పించాలని కోరారు.ప్రజలు అప్పులు, నిరుద్యోగం, ధరల పెరుగుదల, విద్యా, వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న సమయంలో అసెంబ్లీ సమయాన్ని రాజకీయ కొట్లాటలకు వినియోగించడం సరికాదన్నారు. ప్రతి అసెంబ్లీ నిమిషాన్ని ప్రజల కోసం వినియోగించి, సమస్యలకు పరిష్కారం, నిధులు, బాధ్యత, కాలపరిమితి నిర్ణయించాలని శ్రీనివాస్ నాయక్ రాథోడ్ డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐక్య ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఒక్క మొక్క నరికిన చట్టపరమైన చర్యలు.



ఎఫ్ డి ఒ భార్గవ్ కుమార్.

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి )

కాగజ్ నగర్ ఫారెస్ట్ డివిజనల్ అధికారి భార్గవ్ కుమార్ గురువారం బెజ్జూర్ రేంజ్ పరిధిలోని ఫారెస్ట్ కవర్ చేయించి పాయింట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఫ్ డి ఓ భార్గవ్ కుమార్ మాట్లాడుతూ పదవిలో ఒక్క మొక్క నరికిన, పోడు వ్యవసాయం కోసం ప్రయత్నం చేసిన ఫారెస్ట్ కవర్ చేంజ్ పాయింట్స్ వస్తాయని, వాటికి అనుగుణంగా ఎవరైనా చెట్లు నరికిన పోడు వ్యవసాయం కొరకు ప్రయత్నం చేసిన వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ఫారెస్ట్ రేంజ్ అధికారి జే. శ్రావణ్ కుమార్ సిబ్బంది ఉన్నారు.

# మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి.

-జిల్లా ఎస్పీ నితికా పంత్,

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి )

జాతీయ మెగా లోక్ అదాలత్‌ను ఈ నెల 12వ తేదీ శనివారం నిర్వహించనున్న నేపథ్యంలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ కోరారు. రాజీ పడదగిన వివిధ రకాల కేసులను పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఒక వేదికగా నిలుస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు,ఆస్తి విభజన వివాదాలు, కుటుంబ మరియు వైవాహిక జీవితానికి సంబంధించిన సమస్యలు,బ్యాంకు రికవరీ కేసులు,విద్యుత్ చౌర్యం కేసులు,చెక్ బౌన్స్ కేసులు తదితర అంశాల్లో ఇరువర్గాలు పరస్పర



రాజీ ద్వారా తమ వివాదాలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు.చిన్న చిన్న వివాదాలను పెద్ద కక్షలుగా మార్చుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం,ధనం వృథా చేసుకోవద్దని సూచించారు. "రాజీయే రాజమార్గం"అనే భావనతో న్యాయశాఖ కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని తమ వివాదాలకు శాశ్వత పరిష్కారం పొందాలని కోరారు. జిల్లాలోని పోలీసు అధికారులు,కోర్టు విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి,సంబంధిత ఇరువర్గాల వారితో కౌన్సిలింగ్ నిర్వహించి అవగాహన కల్పిస్తారని తెలిపారు.తమ కేసుల్లో రాజీ ద్వారా పరిష్కారం కోరుకునే వారు సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించాలని సూచించారు.

లోక్ అదాలత్ ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం అందుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్నేహపూర్వక వాతావరణంలో వివాదాలను ముగించుకోవాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# చాకలి ఐలమ్మకు ఘన నివాళులు



కామారెడ్డి, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):-

తెలంగాణ సాయుధ పోరాటంలో వీరోచితంగా పోరాడిన మహనీయురాలు, బహుజన వర్గాలకు స్ఫూర్తి ప్రదాత, మహిళా చైతన్యానికి మార్గదర్శకురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె దివ్య స్మృతికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ భూమి, హక్కులు, ఆత్మఅ చడంలో చాకలి ఐలమ్మ గారి జీవితం నేటి తరానికి కూడా ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఆమె ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గడ్డమీది మహేష్, డిసిసి ఉపాధ్యక్షులు పంపరి లక్ష్మణ్, డిసిసి జనరల్ సెక్రెటరీ జూలూరి సుధాకర్, మాజీ కౌన్సిలర్లు పంపరి శ్రీనివాస్, తాటి ప్రసాద్, చాట్ల వంశీ, గౌరీ నవీన్, బాలు, ఈమ్రోస్, బల్ల శ్రీనివాస్, బండారి శ్రీకాంత్, పందు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పలు సమస్యల పై అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే పాల్వాయి.

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి )

సిరిపూర్ నియోజకవర్గం లోని పలు ముఖ్యమైన సమస్యలను సిరిపురం ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అసెంబ్లీలో ప్రస్తావించారు. సిర్పూర్ నియోజకవర్గం లోని కాగజ్నగర్ లో బస్ డిపో ఏర్పాటు చేయాలని, సిరిపూర్ ,బెజ్జూర్ మండల కేంద్రాల్లో బస్టాండ్లు నిర్మాణం చేపట్టాలని కోరారు. అదేవిధంగా సిర్పూర్ పేపర్ మిల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని గత 114 రోజులుగా కార్మికులు రిలే నిరాహార దీక్ష చేస్తున్నారని ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్త జిల్లాల్లో కృషి విజ్ఞాన కేంద్రం మరియు హార్టికల్చర్ యూనివర్సిటీలకు ప్రతిపాదనలు పంపించామని ఇప్పటివరకు ఆమోదం పొందలేదు అన్నారు. ఆర్టికల్చర్ యూనివర్సిటీ కోసం మండలంలో 50 ఎకరాల స్థలాన్ని గుర్తించడం జరిగిందన్నారు. సిర్పూర్ నియోజకవర్గం లో రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ మాదిరిగా అవుట్సోర్సింగ్ ఉద్యోగుల కార్పొరేషన్ ద్వారా జీతాలు చెల్లించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

# యూనిక్ పోల్ నంబరింగ్‌తో విద్యుత్ అంతరాయాలపై వేగవంతమైన స్పందన



ఎస్ఈ ఉత్తమ్ జాడె.

ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి )

వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించేందుకు సాంకేతికతను అందిపుచ్చుకుంటూ, అందుకు అనుగుణంగా మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామని కుమురంభీమ్ ఆసిఫాబాద్ సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడె తెలిపారు.అసెట్ మ్యాపింగ్ ట్రాకింగ్‌లో భాగంగా 33 కేవీ, 11 కేవీ విద్యుత్ స్తంభాలకు యూనిక్ పోల్ నంబర్లను కేటాయించి పెయింటింగ్ ప్రక్రియపూర్తి చేశామని తెలిపారు. ఇప్పటి వరకు 33 కేవీ పోల్ నంబరింగ్ 90 శాతం పూర్తి కాగా, 11 కేవీ పోల్ నంబరింగ్ 50 శాతం పూర్తయిందని వెల్లడించారు. విద్యుత్ లైన్లలో ఎక్కడైనా సమస్య లేదా అంతరాయం ఏర్పడినప్పుడు యూనిక్ పోల్ నంబర్ ఆధారంగా సంబంధిత స్తంభం ఉన్న ఖచ్చితమైన లొకేషన్‌ను మ్యాపింగ్ ద్వారా వెంటనే గుర్తించి, సిబ్బందిని అక్కడికి పంపించి సమస్యను త్వరితగతిన పరిష్కరించే అవకాశం ఉంటుందని తెలిపారు. దీనివల్ల విద్యుత్ అంతరాయాల వ్యవధిని గణనీయంగా తగ్గించి వినియోగదారులకు వేగవంతమైన సేవలు అందించవచ్చని పేర్కొన్నారు. యూనిక్ పోల్ నంబరింగ్ ద్వారా 33 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్ల నిర్వహణ మరింత క్రమబద్ధంగా చేపట్టేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. యూనిక్ పోల్ నంబర్ల ఆధారంగా విద్యుత్ లైన్లను సిబ్బందికి క్రమబద్ధంగా కేటాయించి, దశలవారీగా నిర్వహణ పనులు చేపట్టడంతో పాటు చేపట్టిన పనుల వివరాలను సులభంగా నమోదు చేసి పర్యవేక్షించవచ్చన్నారు. విద్యుత్ లైన్ల నిర్వహణలో పారదర్శకత, వేగం, సమర్థతను పెంచడంతో పాటు విద్యుత్ అంతరాయాలను గణనీయంగా తగ్గించడంలో యూనిక్ పోల్ నంబరింగ్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని ఎస్ఈ తెలిపారు.

# పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడికి భరోసా కల్పించాలి





జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర

నిజాంసాగర్ సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడికి భరోసా కల్పిస్తూ, ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచేలా పోలీసులు విధులు నిర్వహించాలని కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం నిజాంసాగర్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన ఎస్పీ.. పోలీస్ స్టేషన్ పరిసరాలు, బ్యారక్‌లు, రిసెప్షన్, లాకప్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ ఫైళ్లు, రికార్డులను తనిఖీ చేసి వాటి నిర్వహణపై ఎస్ఐ శివకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ.. పోలీసులు విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను ఓపికగా విని చట్టపరమైన పరిష్కారం చూపాలని అన్నారు. పోలీసుల పనితీరుతోనే ప్రజల్లో పోలీసు శాఖపై నమ్మకం పెరుగుతుందని, అందువల్ల ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలతో పోలీసులు నిరంతరం మమేకం కావాలని ఆయన అన్నారు. ప్రతి విలేజ్ పోలీస్ ఆఫీసర్ తనకు కేటాయించిన గ్రామాన్ని తరచూ సందర్శిస్తూ స్థానిక పరిస్థితులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలను ముందుగానే గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును సీసీటీఎన్ఎస్‌లో తప్పనిసరిగా నమోదు చేసి, పారదర్శకంగా సేవలు అందించాలని ఎస్పీ సూచించారు. మహిళల భద్రత, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, డ్రంక్ అండ్ డ్రైవ్, గంజాయి వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పాత నేరస్తులపై నిరంతర నిఘా ఉంచుతూ, విజిబుల్ పోలీసింగ్‌ను పెంచాలని ఆదేశించారు. ప్రజలకు పోలీసుల ఉనికి స్పష్టంగా కనిపించేలా పెట్రోలింగ్, గస్తీ నిర్వహించాలని సూచించారు.రానున్న గణేష్ ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. గణేష్ మండపాల వద్ద భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి, ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి, సీఐ రూరల్ తిరుపయ్య, ఎస్ఐ శివకుమార్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

# ప్రీ-ప్రైమరీ పాఠశాలల్లో అదనపు కలెక్టర్ పరిశీలన

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, (వుదయం ప్రతినిధి), సెప్టెంబర్ 10:

జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) యువరాజ్ మర్మత్ గురువారం ఆసిఫాబాద్, రెబ్బెన మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఆసిఫాబాద్ మండలం బుర్గుడ, రెబ్బెన మండలం తల్లాలపల్లి గ్రామాల్లోని పూర్వ ప్రాథమిక (ప్రీప్రైమరీ) పాఠశాలలను సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాలల ఆవరణలో చేపడుతున్న సుందరీకరణ, పెయింటింగ్ పనులను అదనపు కలెక్టర్ నిశితంగా తనిఖీ చేశారు. చిన్నారులకు ఆహ్లాదకరమైన, ఆకర్షణీయమైన వాతావరణంలో విద్య అందేలా పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను



ఆదేశించారు.అనంతరం పాఠశాల చిన్నారులతో అదనపు కలెక్టర్ సరదాగా ముచ్చటించారు. వారి చదువు, పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. చిన్నారులతో ఆప్యాయంగా మాట్లాడి వారిని ఉత్సాహపరిచారు.ఈ సందర్భంగా యువరాజ్ మర్మత్ మాట్లాడుతూ, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు చిన్నారుల ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు .ఈ పర్యటనలో స్థానిక అధికారులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపూర్ గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, (వుదయం ప్రతినిధి), సెప్టెంబర్ 10:

రెబ్బెన మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన తనకు సువర్ణకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన రూ.42,500 విలువైన చెక్కును ఆర్టీఏ మెంబర్ లావాడ్యా రమేష్ లబ్ధిదారురాలికి అందజేశారు.ఈ సందర్భంగా ఆర్టీఏ మెంబర్ లావాడ్యా రమేష్ మాట్లాడుతూ, ప్రజలు అనారోగ్యం, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రెబ్బెన మండల కాంగ్రెస్ నాయకులు వనమాల మురళి, గంటు మేర, సోనాలి సంతోష్ బాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లె రాజేశ్వరరావు, వెంకట్ రెడ్డి, నారాయణపూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు గజ్జల సాయికుమార్, పి. ప్రభాకర్, పల్లె గోపాల్, పల్లె శ్రీనివాస్, ముద్దం నారాయణ, గోలెం రమేష్, ఇందూరి తిరుపతి, గోలెం సత్యనారాయణ, పబ్బ పరిషగౌడ్ తదితరులు పాల్గొన్నారు.సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి, జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కొక్కిరాల విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కులకు లబ్ధిదారురాలు కృతజ్ఞతలు తెలిపారు.

# మండల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి



* ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి
* మండల ప్రత్యేక అధికారి ప్రసాద్‌రావు

నిజాంసాగర్ సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):

మహమ్మద్‌నగర్ మండల అభివృద్ధికి అధికారులు, సర్పంచులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మండల ప్రత్యేక అధికారి, బాన్సువాడ డీఎల్పీవో ప్రసాద్‌రావు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాలపై గ్రామీణ ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.మండలంలోని గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, ప్రజా సమస్యలను ప్రజాప్రతినిధుల సహకారంతో గుర్తించి పరిష్కరించాలని సూచించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి శాఖల మధ్య సమన్వయం, నిరంతర పర్యవేక్షణ అవసరమని ప్రసాద్‌రావు పేర్కొన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ లత, ఇన్‌చార్జి ఎంపీడీవో అనితారెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి ఆచరిత, ఏపీఎం ప్రసన్న రాణి , ఆరోగ్య శాఖ అధికారి ఆయేషా సిద్ధిఖీ, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గంగి రమేష్, సయ్యద్ రఫీ, కుమ్మరి రాములు ,గున్కూల్ ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు వాజిద్ అలీ దఫేదర్ బాలమణి, సుమయ్య అతిక్,బోయిని హరిన్ కుమార్, గజ్జల జీవన్, కిరణ్, లక్ష్మి, శ్రీనివాస్,పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బహుజన పోరాటాలకు, ఆత్మగౌరవానికి ఐలమ్మ ప్రతీక



డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్

నిజాంసాగర్ సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):

తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ వర్ధంతిని నిజాంసాగర్ మండల కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ బహుజన పోరాటాలకు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. నిజాం నిరంకుశ పాలన, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తూ సామాజిక న్యాయం, ప్రజా హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ కుమార్, ఉమ్మడి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రజాపండరి, రవీందర్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గంగి రమేష్, సంకు లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడు బొజ్జ అంజయ్య, కుమ్మరి రాములు, ఉప సర్పంచ్ అనీస్ పటేల్,కాంగ్రెస్ నాయకులు, బంగ్లా ప్రవీణ్ కుమార్, కార్యకర్తలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# గౌడ సంఘం అధ్యక్షుడిగా యాదగిరిగౌడ్



నాగిరెడ్డిపేట,వుదయం

మండల గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా కలాలి యాదగిరిగౌడ్ వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుల్లకుంట శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా రామగౌడ్, గడ్డం బాలాగౌడ్, ప్రధాన కార్యదర్శిగా సాయిగౌడ్, సహాయ కార్యదర్శిగా ఈశ్వర్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా అంజాగౌడ్, మచేందర్‌గౌడ్, సంతోష్‌గౌడ్, యాదగౌడ్, మహేందర్‌గౌడ్, మాణిక్యం గౌడ్‌లను ఎంపిక చేశారు.ఈ సందర్భంగా యాదగిరిగౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మరోసారి అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గౌడ సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, సభ్యుల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటానని చెప్పారు. అందరి సహకారంతో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానని, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని పేర్కొన్నారు.అనంతరం గోపాల్‌పేట సర్పంచ్ వంశీగౌడ్‌ను శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ట్రైనర్ వర్క్‌షాప్‌లో సుదర్శన్ కు" బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు

దండేపల్లి: సెప్టెంబర్ 10 (వుదయం విలేకరి)

ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ రీజియన్19 ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రైన్ ది ట్రైనర్ వర్క్‌షాప్ 2.0 శిక్షణలో దండేపల్లి మండలంలోని తాళ్లపేటకు చెందిన మడావి సుదర్శన్ ప్రతిభ కనబరిచి "బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు"ను కైవసం చేసుకున్నారు. నిర్మల్‌లో నిర్వహించిన ఈ శిక్షణలో అసెస్‌మెంట్, మూల్యాంకన ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినందుకు ఆయనకు ప్రొవిజనల్ ట్రైనర్‌గా గుర్తింపు కార్డుతో పాటు అవార్డును అందజేశారు. లేబర్ కమిషనర్ ముత్యంరెడ్డి,రీజియన్ అధ్యక్షులు వాడేకర్ లక్ష్మణ్, హెడ్ కోచ్ ఉదయభాస్కర్



చేతుల మీదుగా ఆయన పురస్కారాన్ని అందుకున్నారు. యువతలో వ్యక్తిత్వ వికాసం,నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు కృషి చేస్తానని సుదర్శన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రైనర్లు శ్యామ్ రాథోడ్, రామచంద్రుడు ,మాధవి పాల్గొన్నారు.

# సబ్బండ వర్గాల ఆత్మగౌరవానికి ఐలమ్మ ప్రతీక



-ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి

ఆదిలాబాద్,
సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):

వెట్టిచాకిరి సంకెళ్లను తెంచి.. భూమి, భుక్తి కోసం పోరాడి.. సబ్బండ వర్గాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన వీరనారి చాకలి ఐలమ్మ తెలంగాణ సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తి దాయకమని ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మహిళా చైతన్యానికి ప్రతీకగా నిలిచిన ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా రిమ్స్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఆమె విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో బోరంచు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జాయింట్ కలెక్టర్ చిత్రం, మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనుష సతీష్‌తో కలిసి ఐలమ్మను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ కాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. అణచివేతను సహించకుండా హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందన్నారు. భూమి కోసం, భుక్తి కోసం ఆమె చేసిన పోరాటం తెలంగాణ ప్రజల తెగువను ప్రపంచానికి చాటిందని పేర్కొన్నారు. ఐలమ్మ ఆశయాలను స్మరించుకోవడంతో పాటు వాటి సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారిణి సునీతకుమారి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్‌గౌడ్, బీసీ సంఘం నాయకులు చిక్కల దత్తు, కలాల శ్రీనివాస్, రజక సంఘం అధ్యక్షుడు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నాయకుల పై చర్యలు తీసుకోవాలి.



జన్నారం,
సెప్టెంబర్ 10 (వుదయం విలేఖరి)

ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ వద్దకు దళితులు వచ్చారని వారు వచ్చిన ప్రదేశాలను పసుపు నీళ్లతో శుద్ధి చేయాలని బీఆర్ఎస్ అధినేత కెసిఆర్ ఆదేశాలతో శుద్ధి చేశామని దళితులను అవమానించేలా మాట్లాడిన బీఆర్ఎస్ మహిళా నాయకురాలు పావని గౌడ్, సునితా రావులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జన్నారం మండల కాంగ్రెస్ అధ్యక్షులు అజ్మీరా నందు నాయక్ ఆధ్వర్యంలో గురువారం రోజున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఎవరైనా వ్యవహరిస్తే ప్రభుత్వం, పోలీసులు చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. దళితుల గౌరవం, హక్కులను కాపాడటంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, పట్టణ అధ్యక్షుడు మండ రాజేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ పసివుల, మాజీ అధ్యక్షుడు ముజాకర్, నాయకులు ఇసాక్, ప్రవీణ్, దుమల రమేష్, కరుణాకర్, షాకీర్, ముజ్జు, నానేశ్వర్, సుధాకర్ నాయక్, మచ్చ శంకరయ్య, రియాజుద్దీన్, రజాక్, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఎన్ఎస్యుఐ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గా సోహెల్ షా



జన్నారం,
సెప్టెంబర్ 10 (వుదయం విలేఖరి)

జన్నారం మండలానికి చెందిన యువ నాయకుడు సోహైల్ షా ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్ష పదవి వరించింది.గత కొన్ని సంవత్సరాలుగా ఎన్ ఎస్ యు ఐ లో విద్యార్థులకు ఎల్లవేళలా అండగా ఉంటూ అనేక విద్యార్థుల సమస్యల పరిష్కారంలో తనదైన ముద్ర వేసుకున్నాడు.కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి విభాగంలో జిల్లా అధ్యక్ష పదవి అతి కీలకమైన పదవుల్లో ఒకటని ఎన్ ఎస్ యు ఐ జాతీయ అధ్యక్షులు వినోద్ జాకర్ మరియు రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ స్వామి తెలిపారు.తనకు ఎల్లవేళలా సహకరించిన జాతీయ, రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ నాయకులకు, ముఖ్యంగా మాజీ ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్షులు, ప్రస్తుత తెలంగాణ విప్,ఏమ్మెల్సీ డాక్టర్ బల్మూరి వెంకట్ కు సోహైల్ షా ధన్యవాదాలు తెలిపారు.రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మరియు ఎన్ ఎస్ యు ఐ బలోపేతానికి జిల్లా నేతల సహకారంతో మరింత కృషి చేస్తానని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన కు పలువురు శుభాకాంక్షలు తెలియజేసారు.

# దండేపల్లి మండల PRTUTS నూతన కార్యవర్గం ఎన్నిక



దండేపల్లి
సెప్టెంబర్ 10 (వుదయం విలేకరి)

దండేపల్లి MPPS పాఠశాల ఆవరణలో PRTUTS దండేపల్లి మండల శాఖ నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షులు కొట్టె శంకర్, ప్రధాన కార్యదర్శి బచ్చా మోహన్ రావు జిల్లా గౌరవ అధ్యక్షులు కొండు జనార్ధన్ గార్ల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా రావేణవేణి రవి,ప్రధాన కార్యదర్శిగా మల్యాల మల్లేష్,అసోసియేట్ అధ్యక్షులుగా యాగండ్ల గంగన్న,మహిళా అసోసియేట్ అధ్యక్షురాలు గా జె వసంత,ఉపాధ్యక్షులు గా పోలంపల్లి రామరాజు, మల్లూరు వినోద్,మహిళా ఉపాధ్యక్షురాలుగా బి జయప్రద,ఎల్ వాణి,కార్యదర్శిగా సురేష్, బుచ్చయ్య,మహిళా కార్యదర్శిగా శ్రీలత,ఎల్ సాయి దీపిక లను ఎన్నుకున్నారు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కొట్టే శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పిఆర్టియుటిఎస్ పిఆర్సీ ఇచ్చే విధంగా సంఘం కృషి చేస్తుందని తెలిపారు అలాగే సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని తీసుకొని వస్తామని,సర్వీస్ రూల్స్, పెండింగ్ డీఏలు,మోడల్ స్కూల్,కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు అన్ని పరిష్కరిస్తామని తెలిపారు.ఎన్నికల పరిశీలకులుగా పెట్టం తిరుపతి,మహేశ్వర్ లు వ్యవహరించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అప్పాల మనోహర్,పాత రమేష్, ముత్తె వెంకటమల్లు,విజయ్ చందర్,బి రాజన్న, తనుగుల రాజమౌళి,ఆర్ శ్రీనివాస్,ఎం రమేష్, ప్రభాకర్,రమేష్,పోలంపల్లి శ్రీనివాస్,గట్ల శ్రీనివాస్,రిటైర్డ్ ఉపాధ్యాయులు అన్నం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డి ఇరిగేషన్ ఈఈగా వెంకటేశ్వర్లు

నాగిరెడ్డిపేట,వుదయం

ఇరిగేషన్ డివిజన్4 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ)గా షెర్ల వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎల్లారెడ్డిలోని ఇరిగేషన్ డివిజన్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ అధికారులు, సిబ్బంది ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డివిజన్ పరిధిలోని ప్రాజెక్టులు, కాలువలు, సాగునీటి వనరుల నిర్వహణపై అధికారులతో చర్చించారు. రైతులకు సాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు.



# నల్లబెల్లిలో ఘనంగా చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

* పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం
పలువురు వక్తలు
పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు

నల్లబెల్లి,
సెప్టెంబర్ 10 (వుదయం):



తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఎంతో ఆదర్శనీయమని పలువురు వక్తలు కొనియాడారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఆమె సాగించిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం చాకలి ఐలమ్మ విగ్రహాన్ని అత్యంత ఘనంగా ఆవిష్కరించారు.నల్లబెల్లి రజక సంఘం అధ్యక్షుడు రాపాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సదాశివ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సీహెచ్ దళపతి ప్రారంభకులుగా హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు నూతనకంటి ఆనంద్, డాక్టర్ ఫోనుగోటి గోపాల్, డాక్టర్ అలుగునూరి వినయ్‌కుమార్, పొదికి వసంత శోభన్, సర్పంచ్ నాగెల్లి జ్యోతి ప్రకాశ్, ఉపసర్పంచ్ గుమ్మడి వేణు, నర్సంపేట నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా విగ్రహ దాతలు పెద్ది మణిపాల్‌రెడ్డి, పెద్ది గణేష్‌రెడ్డిలను నాయకులు ఘనంగా అభినందించారు. డాక్టర్ దళపతి మాట్లాడుతూ. తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు, అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం చేసిన కృషిని గుర్తుచేశారు. మండల కేంద్రంలో విగ్రహ ఏర్పాటుకు చొరవ చూపిన ప్రతి ఒక్కరినీ కొనియాడారు.కార్యక్రమంలో తహసీల్దార్ ముప్పు కృష్ణ, కొల్లారి లక్ష్మీనారాయణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చింతకింది కుమారస్వామి, తెలంగాణ ఉద్యమకారుడు భట్టు సాంభయ్య, సీపీఎం మండల కార్యదర్శి కడం సమ్మయ్య, కడియం మనోహర్, మామిడాల నర్సయ్య, పొదిళ్ల రాంచందర్, సంగె రమేష్‌తో పాటు రజక సంఘాల నాయకులు, వివిధ కుల, ప్రజా సంఘాల ప్రతినిధులు, ఉద్యమకారులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా గోకా గణేష్ రెడ్డి జన్మదిన వేడుకల



- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన ఆడే గజేందర్

ఆదిలాబాద్,
సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):

తలమడుగు మండలం మాజీ జడ్పీటీసీ గోకా గణేష్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి గోకా గణేష్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ.. గోకా గణేష్ రెడ్డి ప్రజలతో మమేకమై పనిచేస్తూ రాజకీయ, సామాజిక రంగాల్లో తనదైన గుర్తింపు సాధించారని కొనియాడారు. భవిష్యత్తులో ఆయనకు మరిన్ని ఉన్నత అవకాశాలు లభించాలని, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. గణేష్ రెడ్డి జన్మదిన వేడుకలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. దీంతో క్యాంపు కార్యాలయం సందడిగా మారింది. కేక్ కట్ అనంతరం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.

# గణేష్ మండళ్ల నిర్వాహకులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి



- ఎస్సై శ్రీధర్, కమీషనర్ మురళీ కృష్ణ, ఎలక్ట్రికల్ ఏ.ఈ ప్రభాకర్

మంచిర్యాల /రామకృష్ణాపూర్/
సెప్టెంబర్ 10(వుదయం ప్రతినిధి)

రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గణేష్ మండళ్లను ఏర్పాటు చేయదలచిన ప్రతి మండలి నిర్వాహకుడు తప్పనిసరిగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రామకృష్ణాపూర్ పట్టణ ఎస్సై జాడి శ్రీధర్, మునిసిపాలిటీ కమిషనర్ మురళీకృష్ణ, ఎలక్ట్రికల్ ఏఈ ప్రభాకర్ లు సూచించారు. గణేష్ మండళ్ల నిర్వాహకులు వెంటనే సంబంధిత లింక్‌ను ఓపెన్ చేసి, మండలికి సంబంధించిన సరైన వివరాలను నమోదు చేసి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని వారు కోరారు.ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ లింక్ https://share.google/uuJ961D0jyD6NK3Afగణేష్ మండళ్ల నిర్వాహకులు పోలీస్ శాఖ, మున్సిపల్ శాఖ, విద్యుత్ శాఖ లకు సహకరించి, ఎలాంటి ఆలస్యం చేయకుండా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేయాలని రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వినాయక మండపాల నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు. గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీస్ శాఖ సూచనలను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణాపూర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు గాండ్ల సమ్మయ్య, పెద్దపల్లి ఉప్పలయ్య, కటకం నాగరాజు, ఆరుముల్ల పోశం, పలిగిరి కనకరాజు,7 వ వార్డ్ కౌన్సిలర్ గుర్రం శ్రీనివాస్ లు పాల్గొన్నారు

# ఆదిలాబాద్ ఆశలకు ఆమోదముద్ర వేయండి!



- యూనివర్సిటీ, జేఎన్టీయూ కళాశాల.. కుప్టీపై సీఎం సానుకూలత
- రేవంత్‌రెడ్డిని కలిసి నరేష్ జాదవ్ విజ్ఞప్తి

ఆదిలాబాద్,
సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):

గత పాలకుల నిర్లక్ష్యంతో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆదిలాబాద్ జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్షలైన యూనివర్సిటీ, జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలతో పాటు కుప్టీ ప్రాజెక్టును నిర్మించి ప్రజల ఆశలను నెరవేర్చాలని సీఎం రేవంత్‌రెడ్డిని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్ కోరారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ ప్రాంగణంలో ముఖ్యమంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు.ఇంద్రవెల్లితో పాటు వివిధ సందర్భాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నరేష్ జాదవ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. మారుమూల ప్రాంతాల విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేయడంతో పాటు రైతాంగానికి సాగునీటి భరోసా కల్పించేలా యూనివర్సిటీ, జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేయాలని, కుప్టీ ప్రాజెక్టు నిర్మాణానికి తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.జిల్లాలో ఇటీవల జరిగిన పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ) సమావేశంలో ఈ అంశాలపై చేసిన తీర్మానాన్ని కూడా సీఎంకు సమర్పించిన వినతిపత్రానికి జత చేసినట్లు నరేష్ జాదవ్ తెలిపారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు సైతం ఇదే అంశాలపై ముఖ్యమంత్రికి ప్రత్యేకంగా లేఖ రాసిన విషయాన్ని వెల్లడించారు.తమ వినతిపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని, ఇచ్చిన మాటకు కట్టుబడి యూనివర్సిటీ, ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుతో పాటు కుప్టీ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని నరేష్ జాదవ్ తెలిపారు.

# మెల్లకుంట తండాలో ఆరోగ్య శిబిరం



☐ వాతావరణ మార్పులతో వ్యాధులపై అప్రమత్తత అవసరం
☐ బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు
☐ అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి

నాగిరెడ్డిపేట,వుదయం

వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల నేపథ్యంలో జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెల్లకుంట తండా సర్పంచ్ రామావత్ బాల్య నాయక్ సూచించారు. గురువారం నాగిరెడ్డిపేట మండలంలోని మెల్లకుంట తండాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. అనారోగ్య సమస్యలు ఉన్న వారికి వైద్యుల సూచన మేరకు అవసరమైన మందులను అందజేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు జ్వరం, ఇతర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.గ్రామస్తులు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సర్పంచ్ బాల్య నాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామావత్ వాసురం, కాంగ్రెస్ పార్టీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు కొర్ర వాసురం, పల్లె దవాఖాన వైద్యాధికారి లావణ్య, ఏఎన్ఎం యమునా, ఆశా వర్కర్లు అంజమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అడవి కుక్కల దాడిలో మేకలు మృతి

☐ ఆరు మేకలను ఎత్తుకెళ్లిన అడవి కుక్కలు
☐ ఒక మేక కళేబరం లభ్యం.. ఐదు మేకల ఆచూకీ లేదు
☐ రూ.66 వేల నష్టం వాటిల్లిందన్న బాధితుడు

నాగిరెడ్డిపేట ,వుదయం మేకల మందపై అడవి కుక్కలు దాడి చేసి ఆరు మేకలను ఎత్తుకెళ్లిన ఘటన నాగిరెడ్డిపేట మండలం ధర్మారెడ్డి శివారులోని బంధంలకుంట సమీప అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ధర్మారెడ్డికి చెందిన అయ్యపల్లి సతీష్ బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో సుమారు 50 మేకలను అటవీ ప్రాంతంలో మేపుతుండగా, దాదాపు 20 అడవి కుక్కలు ఒక్కసారిగా మేకల మందపై దాడి చేశాయి. దీంతో



ఆరు మేకలను అడవి కుక్కలు ఎత్తుకెళ్లాయి.మేకల కోసం సతీష్ అటవీ ప్రాంతంలో గాలించగా ఒక మేక కళేబరం మాత్రమే లభించింది. మిగతా ఐదు మేకల ఆచూకీ లభించలేదు. ఆరు మేకల విలువ సుమారు రూ.66 వేలు ఉంటుందని సతీష్ తెలిపారు. మేకలే తన జీవనాధారమని, వాటిని కోల్పోవడంతో తీవ్రంగా నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు.నష్టపరిహారం అందించాలిఅడవి కుక్కల దాడిలో నష్టపోయిన తనకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని సతీష్ కోరారు. అటవీ ప్రాంతంలో అడవి కుక్కల సంచారాన్ని నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఘటనపై పశువైద్యుడికి, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# పంట నష్టాలకు బీమా భరోసా ఏదీ?



- తెలంగాణలో ఫసల్ బీమా యోజన అమలు చేయాలి
- ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్,
సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):

పంట నష్టాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో తెలంగాణలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను వెంటనే అమలు చేయాలని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పుల కారణంగా పంటలు దెబ్బతిన్నప్పుడు రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు పంటల బీమా ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో ఆదిలాబాద్ జిల్లాలో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. గత ఏడాది కూడా పంట నష్టాలతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. పంట నష్టపోయిన ప్రతిసారీ రైతులు అప్పులు, ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోకుండా బీమా రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను తెలంగాణలో తక్షణమే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంట నష్టాల సమయంలో రైతులకు ఆర్థిక భరోసా అందేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలు...




మంచిర్యాల /రామకృష్ణాపూర్/
సెప్టెంబర్ 10(వుదయం ప్రతినిధి)

రామకృష్ణాపూర్ రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమాన్ని రామాలయం అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ సేవలను స్మరించుకుంటూ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో రజక సంక్షేమ సంఘం అధ్యక్షులు పైతర ఓదెలు, కార్యదర్శి అంజలి, సహాయ కార్యదర్శి వీరస్వామి, కోశాధికారి బిక్షపతి, యూత్ అధ్యక్షులు ఇల్లందుల శ్రీను, వార్డు సభ్యులు మల్లయ్య, సత్తయ్య, శీను, సంఘం సభ్యులు మల్లయ్య, అరుణ్, రాములు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



దండేపల్లి:
సెప్టెంబర్ 10 (వుదయం విలేకరి)

దండేపల్లి మండల కేంద్రము లో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన జిల్లా రజక సంఘం అధ్యక్షుడు కట్కూరి రాజన్న,మండల అధ్యక్షుడు పుట్టపాక తిరుపతి ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు ఆయిల్ల తిరుపతి,అల్వాల సత్తయ్య,మందపెల్లి వెంకటేష్,కొడపర్తి గంగాధర్,దొమ్మాటి వెంకటేష్,గుడికందుల భాస్కర్,తాడూరి రమేష్, పుట్టపాక మహేందర్, నగేష్, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇష్టంతోనే విజయాల సోపానం



జన్నారం,
సెప్టెంబర్ 10 (వుదయం విలేఖరి)

విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో అవసరమని, క్రమశిక్షణ లేని వారు దారం తెగిన గాలిపటంతో సమానమని రాఘవేంద్ర గ్రూప్స్ చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్ అన్నారు.జ్యోతి గార్డెన్‌లో జరిగిన రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టమైనా ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చని, యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. మొదటి సంవత్సర విద్యార్థులకు ద్వితీయ సంవత్సర విద్యార్థులు హృదయపూర్వక స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర గ్రూప్స్ ఫౌండర్ ఎర్ర ప్రమీల, కరస్పాండెంట్ ఎర్ర సంపత్, డీన్ హేమలత షిండే, కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మణ్, లిటిల్ హన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, శీల శ్రవణ్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# జన్నారంలో నూతన బజాజ్ పల్సర్ వాహనాల ఆవిష్కరణ

జన్నారం,
సెప్టెంబర్ 10 (వుదయం విలేఖరి)



జన్నారం పట్టణంలోని శ్రీ బజాజ్ షోరూంలో నూతన బజాజ్ పల్సర్ వాహనాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పొనకల్ ఉప సర్పంచ్ అప్పాల జలపతి,జాజాల శ్రీకాంత్ చేతుల మీదుగా నూతన పల్సర్ బైక్‌లను ఆవిష్కరించారు. బజాజ్‌లో కొత్తగా వస్తున్న పల్సర్ బైక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు షోరూం యజమాని పూదరి నర్సయ్య తెలిపారు.ఈ కొత్త పల్సర్‌లో ఆల్ న్యూ లుక్, డిజిటల్ స్క్రీన్, మోనో సస్పెన్షన్ వంటి లేటెస్ట్ అప్‌డేట్స్ ఉన్నాయని, యువతను ఆకట్టుకునే విధంగా డిజైన్ చేశారని వివరించారు.ఈ కార్యక్రమంలో షోరూం యజమాని పూదరి నర్సయ్య,పూదరి చంద్రమోహన్, లెక్కల మల్లయ్య, దాసరి రాజన్న, నాగరాజు, రామ టెంకి రాజయ్య,శంకర్, షోరూం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాత్రికేయుల హక్కుల సాధనే యూనియన్ ధ్యేయం




**టి యు డబ్ల్యు జె జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాల్ చారి.**

**టేక్మాల్, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)**

జర్నలిజం రంగంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి గుర్తింపు వృత్తిపరమైన భద్రత ఎంతో ముఖ్యమని, పాత్రికేయుల హక్కుల సాధన కోసం అందరూ ఐక్యంగా ఉండాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ టి యు డబ్ల్యు జె మెదక్ జిల్లా అధ్యక్షులు శంకర్ దయాల్ చారి పిలుపునిచ్చారు. గురువారం టేక్మాల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి జర్నలిస్టుకు చేర్చడంలో యూనియన్ ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. జర్నలిస్టులందరూ సంఘటితంగా ఉన్నప్పుడే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, మన గొంతు బలపడుతుందని తెలిపారు. నేడు చేపట్టిన సభ్యత్వ నమోదు కేవలం ఒక సంప్రదాయం కాదని, అది జర్నలిస్టుల బలాన్ని చాటే ఐక్యతా వేదిక అని ఆయన అభివర్ణించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పలువురు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ఉత్సాహంగా పాలుపంచుకుని సభ్యత్వ నమోదును విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో మెదక్ ప్రెస్ క్లబ్ వర్కింగ్ కమిటీ అధ్యక్షులు వెంకట్ గౌడ్, జిల్లా నాయకులు ఆనంద్, సుభాష్, మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు యాదయ్య, అలాగే విలేకరులు కొండా రమేష్, సోంగ సాయిలు, నాయికోటీ రాజు, తలారి కృష్ణ, సోంగ రాములు, అశోక్, నవీన్, వెంకటేష్, పవన్, రాజు నాయక్, సుధాకర్, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఐలమ్మ వర్ధంతి వేడుకలు



**మెదక్ జిల్లా వుదయం**

నిజాంపేట మండల కేంద్రంలో గురువారం రజక కులస్తుల ఆధ్వర్యంలో తెలంగాణ వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ 41 వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రజక సంఘ సభ్యుడు బూరుగుపల్లి రాజు మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ఆమె విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు కృషి చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు బూరుగుపల్లి దుబ్బ రాజయ్య, బూరుగుపల్లి రాజు,మామిడాల రాజయ్య,మామిడాల లింగం,బాలయ్య,పర్శరాములు,బూరుగుపల్లి రమేష్,లక్ష్మి, రాజవ్వ,యాదమ్మ, బాబు, నవీన్,తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నాయకుడు రాజు ముందస్తు అరెస్టు



**మెదక్ జిల్లా వుదయం**

నిజాంపేట మండలం బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వకముందే పోలీసులు నాయకులను అరెస్టు చేయడం దారుణమని మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు మావురం రాజు మండిపడ్డారు. తెల్లవారుజామున 6 గంటలకు ఇళ్లకు వెళ్లి అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెయ్యి రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రానున్న రోజుల్లో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# ఐలమ్మ పోరాట స్ఫూర్తితోనే బహుజనుల ఆత్మగౌరవం

**బందారం, దుద్దెడలలో ఘన నివాళులు**
**వీరనారి చిట్యాల (చాకలి) ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలు**
**బందారం, దుద్దెడ గ్రామాల్లో ఐలమ్మ చిత్రపటాలు, విగ్రహాలకు నివాళులు**
**కార్యక్రమంలో పాల్గొన్న రజక సంఘం రాష్ట్ర, స్థానిక నాయకులు**

**సిద్దిపేట, సెప్టెంబర్ 10 (వుదయం బ్యూరో)**

సాయుధ తెలంగాణ పోరాట వీరనారి చిట్యాల (చాకలి) ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని బందారం మరియు దుద్దెడ గ్రామాల్లో గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రజక సంఘం రాష్ట్ర నాయకులు ర్యాగాల్ల దుర్గయ్య, దుద్దెడ సర్పంచ్ మిద్దె శివకుమార్ మాట్లాడుతూ... అనాటి భూస్వామ్య వ్యవస్థకు, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడిన ఐలమ్మ ధైర్యసాహసాలు భవిష్యత్ తరాలకు ఆదర్శమని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధన కోసం ఐలమ్మ చూపిన పోరాట బాటలోనే ప్రతి ఒక్కరూ పయనించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు గడ్డమీది రామస్వామి, గ్రామ రజక సంఘం అధ్యక్షులు బుచ్చిగారి మల్లయ్య, ర్యాగాల్ల బుచ్చయ్య, వార్డు మెంబర్ పెద్దంకుల దేవేందర్, నాయకులు ర్యాగాల్ల నర్సింలు, లక్ష్మణ్, చిట్యాల నర్సింలు, బస్వరాజు రవి, పెద్దోళ్ల బాలయ్య, మండవ నర్సింలు, ర్యాగాల్ల రాజు, పెద్దోళ్ల యాదగిరి, కర్రోళ్ల రాములు, వేముల కర్ణాకర్, బొగ్గుట అశోక్, ర్యాగాల్ల మహేష్, శంకర్, సర్వయ్య, బిక్షపతి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ ఐ ఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు పార్టీలు సహకరించాలి

**జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా**

**మహబూబ్ నగర్ సెప్టెంబర్10(వుదయం ప్రతినిధి)**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ జిల్లాలో కొనసాగుతున్న ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పురోగతిపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లాలో ఎస్.ఐ.ఆర్ లో భాగంగా చేపడుతున్న కార్యక్రమాల ప్రస్తుత స్థితిగతులను రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ వివరించారు. గత సమావేశంలో ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలపై అధికారులు తీసుకున్న చర్యలను కూడా వారికి వివరించారు.కలెక్టర్ మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్ లో భాగంగా ఓటర్లకు జారీ చేసిన నోటీసులపై బూత్ లెవల్ అధికారుల (బి.ఎల్.ఓ) వారీగా ఏ .ఈ .ఆర్. ఓ ల వద్ద విచారణలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఎన్నికల సంఘం ఎస్.ఐ.ఆర్ షెడ్యూల్‌లో మార్పులు చేసినందున సవరించిన గడువులకు అనుగుణంగా ప్రక్రియను పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలు వారి సహకారాన్ని అధికారులకు అందించాలని సూచించారు.సవరించిన షెడ్యూల్ ప్రకారం క్లెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలు ప్రక్రియ అక్టోబర్ 7, 2026 వరకు కొనసాగుతుందని, వాటి పరిష్కార ప్రక్రియ నవంబర్ 5, 2026 వరకు చేపట్టనున్నట్లు తెలిపారు. తుది ఓటరు జాబితాను నవంబర్ 9, 2026న ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. సవరించిన షెడ్యూల్‌పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు.అర్హత కలిగిన ప్రతి ఓటరుకు ఓటరు జాబితాలో స్థానం కల్పించడంతో పాటు అనర్హులు, మరణించిన వ్యక్తులు, డూప్లికేట్ పేర్లను నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటం కలెక్టర్ సూచించారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ అర్హుడి పేరు అనవసరంగా తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి, తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే నిర్ణీత గడువులోగా సంబంధిత ఫారాల ద్వారా సమర్పించాలని కోరారు. ఎస్.ఐ.ఆర్ లో భాగంగా అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, అర్హత కలిగిన ప్రతి వ్యక్తికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో ఎస్.ఐ.ఆర్ పనులను వేగవంతం చేసేందుకు సంబంధిత మున్సిపల్ అధికారుల సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. విచారణలకు నియమించిన ఈ.ఆర్.ఓలు, ఎ.ఈ.ఆర్. ఓలు, ఇతర సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎక్కడైనా సమస్యలు, ఓటర్లకు ఇబ్బందులు లేదా అనవసరంగా క్లెయిమ్‌లు తిరస్కరించిన ఘటనలు ఉంటే పోలింగ్ స్టేషన్ వారీగా తమ దృష్టికి తీసుకురావాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కలెక్టర్ కోరారు. అలాంటి అంశాలను నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు.

ఈ నెల 12, 13 వ తేదీలలో స్పెషల్ కాంపెయిన్ రోజులు నిర్వహిస్తామని, ఈ కాంపెయిన్ లో బి.ఎల్.ఎ లు కూడా పాల్గొనేటట్టు చూడాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, డి.ఆర్.ఓ ఎ.నిర్మల, ఎన్నికల తహసీల్దార్ రెడ్యా నాయక్,డిప్యూటీ తహసీల్దార్ జాఫర్, మహబూబ్ నగర్ అర్బన్ తహసీల్దార్ ఘన్సిరాం, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




# మొక్కజొన్నల తరలింపుపై ముసురుతున్న అనుమానాలు!

**అనుమతులు.. టెండర్ ప్రక్రియ ఎక్కడ?**
**రెండు డీసీఎంలను అడ్డుకున్న లారీ అసోసియేషన్ డ్రైవర్లు**
**గోదాం నుంచి నిల్వల తరలింపుపై అధికారుల మౌనం.. విచారణకు డిమాండ్**

**గద్వాల సెప్టెంబర్ 10 (వుదయం బ్యూరో)**

ప్రభుత్వ పరిధిలోని గోదాంలో నిల్వ ఉన్న మొక్కజొన్నల తరలింపు వ్యవహారం గద్వాలలో చర్చనీయాంశంగా మారింది. గద్వాల మండలం కొండపల్లి రోడ్డులోని గ్రామీణుల గిడ్డంగుల గోదాం నుంచి మొక్కజొన్నలను తరలిస్తున్న రెండు డీసీఎం వాహనాలను లారీ అసోసియే షన్‌కు చెందిన డ్రైవర్లు అడ్డుకున్నట్లు సమాచారం. అయితే, ఈ తరలింపునకు సంబంధించి అవసరమైన అనుమతులు ఉన్నాయా? నిబంధనల ప్రకారం టెండర్ లేదా ఇతర ప్రక్రియ పూర్తయిందా? అన్న ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వచ్చాయి.

**అనుమతులు లేకుండానే తరలింపా?**

గోదాముల్లో నిల్వ ఉన్న వ్యవసాయ ఉత్పత్తులను బయటకు తరలించే సమయంలో సంబంధిత శాఖల అనుమతులు, అధికారిక ఆదేశాలు, రవాణాకు సంబంధించిన పత్రాలు ఉండాల్సి ఉంటుంది. కానీ కొండపల్లి రోడ్డులోని గోదాం నుంచి మొక్కజొన్నల తరలింపు విషయంలో ఆ నిబంధనలు పూర్తిగా పాటించారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తరలింపునకు వచ్చిన రెండు డీసీఎం వాహనాలను డ్రైవర్లు అడ్డుకోవడంతో వ్యవహారం ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. వాహనాల్లోని మొక్కజొన్నలు ఎక్కడికి తరలిస్తున్నారు? ఎవరి ఆదేశాల మేరకు తరలిస్తున్నారు? ఎంత పరిమాణంలో నిల్వను తరలించేందుకు అనుమతి ఇచ్చారు? అనే ప్రశ్నలకు స్పష్టత రావాల్సి ఉంది.



**టెండర్.. వేలం.. అనుమతి ఏది?**

మొక్కజొన్నల తరలింపు వెనుక అసలు ప్రక్రియ ఏమిటన్నదే ఇప్పుడు కీలకంగా మారింది. నిల్వలను తరలించేందుకు టెండర్ నిర్వహించారా? వేలం ప్రక్రియ ఏదైనా చేపట్టారా? లేక ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తరలింపు చేపట్టారా? అన్నది అధికారులు వెల్లడించాల్సి ఉంది.

టెండర్ లేదా అనుమతి ప్రక్రియ ఉంటే దానికి సంబంధించిన పత్రాలు ఏమిటి? ఎవరికి తరలింపు బాధ్యత అప్పగించారు? ఏ నిబంధనల ప్రకారం వాహనాలను ఏర్పాటు చేశారు? అనే వివరాలను బహిర్గతం చేయాల్సిన అవసరం ఉంది. ఇన్‌చార్జి పాత్రపై సందేహాలు గోదాం నుంచి నిల్వలు బయటకు వెళ్లాలంటే బాధ్యత వహించే అధికారుల పర్యవేక్షణ తప్పనిసరి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరిగిన తరలింపు నకు గోదాం ఇన్‌చార్జి అనుమతి ఉందా? ఉంటే ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయా? అనే అంశాలు పరిశీలనకు రావాల్సి ఉంది. అనుమతులు, టెండర్ ప్రక్రియ, రవాణా పత్రాలు అన్నీ సక్రమంగా ఉంటే వివాదానికి తావుండదు. అదే సమయంలో, నిబంధనలకు విరుద్ధంగా తరలింపు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రికార్డులు బయటపెడితే అసలు విషయం! ఈ వ్యవహారంలో అనుమానాలకు తావులేకుండా చేయాలంటే అధికారులు గోదాం రికార్డులు, నిల్వల వివరాలు, తరలింపు ఆదేశాలు, టెండర్/వేలం ప్రక్రియకు సంబంధించిన పత్రాలు, వాహనాల రవాణా వివరాలను పరిశీలించాలి. అసలు ఎంత మొత్తంలో మొక్కజొన్న నిల్వ ఉంది? అందులో ఎంత పరిమాణాన్ని తరలించేందుకు అనుమతి ఉంది? ఎంత తరలించారు? ఎవరి అనుమతితో తరలించారు? అన్న లెక్కలు తేల్చాల్సి ఉంది. ఉన్నతాధికారుల విచారణ తప్పనిసరి రెండు డీసీఎం వాహనాలను అడ్డుకున్న ఘటనతో వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారంపై సంబంధిత ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు, లారీ యజమానులు కోరుతున్నారు. అధికారిక పత్రాలను పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగానే తరలింపు జరిగిందా? లేక అనుమతుల విషయంలో ఏమైనా లోపాలు చోటుచేసుకున్నాయా? అన్నది స్పష్టం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. మొక్కజొన్నల తరలింపునకు అనుమతులు ఉన్నాయా? టెండర్ లేదా వేలం ప్రక్రియ జరిగిందా? అధికారిక ఆదేశాలు ఎవరు ఇచ్చారు? అన్న ప్రశ్నలకు సమాధానం లభిస్తేనే ఈ వ్యవహారంపై నెలకొన్న అనుమానాలకు తెరపడనుంది.

# కల్తీ కల్లు మాఫియా సామాన్య ప్రజల ప్రాణాలతో చెలగాటం



**"ఈత.. తాటి చెట్లు లేకుండానే జోరుగా కల్లు విక్రయాలు!"**
**"కృత్రిమ కల్లు తయారీపై ఆరోపణలు.. పట్టించుకొని ఆబ్కారీ శాఖ?మాముల మత్తులో ఉన్నట్టు పలువురి అనుమానం"**
**"అనుమానాస్పద కల్లు కేంద్రాలపై నిఘా ఏదీ?" | "నమూనాలు సేకరించి పరీక్షించాలని ప్రజల డిమాండ్"**

**కోహిర్, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి ):**

ఈత, తాటి చెట్లు పెద్దగా కనిపించని ప్రాంతాల్లోనూ కల్లు విక్రయాలు జోరుగా సాగుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. సహజంగా తాటి, ఈత చెట్ల నుంచి సేకరించే కల్లుకు బదులుగా కృత్రిమంగా తయారు చేసిన కల్తీ కల్లు విక్రయిస్తున్నారన్న ప్రచారం ఊపందుకుంది. సహజ కల్లు లభ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఇంత పెద్ద మొత్తంలో కల్లు ఎక్కడి నుంచి వస్తోంది? ఎవరు సరఫరా చేస్తున్నారు? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

**కృత్రిమ కల్లు తయారీపై అనుమానాలు**

సహజ కల్లు తాటి, ఈత చెట్ల నుంచి సేకరించిన రసంతో తయారవుతుంది. అయితే కొందరు అక్రమార్కులు రసాయనాలు లేదా ఇతర పదార్థాలను ఉపయోగించి కృత్రిమంగా కల్లు తయారు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తెల్లగా కనిపించేలా, నురగ వచ్చేలా తయారు చేసి కల్లుగా విక్రయిస్తున్నారన్న ప్రచారం స్థానికంగా వినిపిస్తోంది. ఈ ఆరోపణల్లో వాస్తవమెంత అనేది అధికారుల తనిఖీలు, ప్రయోగశాల పరీక్షలతోనే తేలాల్సి ఉంది.

**అధికారుల నిఘా ఎక్కడ?**

కోహిర్ మండల.పరిధిలోని పలు గ్రామాలలో కల్తీ కల్లు విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. సహజ కల్లు సేకరణకు అవసరమైన చెట్లు, కల్లు గీత కార్మికుల వివరాలు, విక్రయిస్తున్న పరిమాణం వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

కొన్ని కల్తీ కల్లు విక్రయ కేంద్రాల నిర్వాహకుల నుంచి నెలవారీగా మామూళ్లు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఆరోపణలపై ఆబ్కారీ శాఖ అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

**ప్రజల ఆరోగ్యంపై ఆందోళన**

కల్తీ లేదా నకిలీ మద్యం తరహాలో అనుమానాస్పద పదార్థాలతో తయారు చేసిన కల్లు సేవించడం ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగించే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కూలీలు, వ్యవసాయ కార్మికులు, భవన నిర్మాణ కార్మికుల్లో కల్లు వినియోగం ఎక్కువగా ఉండటంతో నాణ్యతపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

**నమూనాలు సేకరించి పరీక్షించాలి**

అనుమానాస్పదంగా ఉన్న కల్లు విక్రయ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, కల్లు నమూనాలను సేకరించి ప్రయోగశాలల్లో పరీక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ తయారీ లేదా కల్తీ నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈత, తాటి చెట్లు లేకుండా ఇంత పెద్ద మొత్తంలో కల్లు ఎక్కడి నుంచి వస్తోంది? అన్న ప్రశ్నకు ఆబ్కారీ శాఖ అధికారులు సమాధానం చెప్పాలని స్థానికులు కోరుతున్నారు. ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేస్తున్నారు.

## పిఆర్టియుటిఎస్ తాండూరు మండల శాఖ నూతన కార్యవర్గం

# ఏకగ్రీవ ఎన్నిక జొన్నల వినోద్ కుమార్ అధ్యక్షులుగా

**తాండూరు సెప్టెంబర్ 9 వుదయం ప్రతినిధి**

పి ఆర్ టి యు తాండూరు మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి నీరజ బాల్‌రెడ్డి, డీఎస్పీ నర్సింగ్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పిఆర్టియుటిఎస్ తాండూరు మండల శాఖ అధ్యక్షుడిగా జొన్నల వినోద్, ప్రధాన కార్యదర్శిగా పట్లోళ్ల పురుషోత్తం రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను నాయకులు, ఉపాధ్యాయులు అభినందించారు.కార్యక్రమంలో పిఆర్టియుటిఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్రాం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్, రాష్ట్ర సంపాదక వర్గ సభ్యులు బాకారం జైపాల్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ రామ్ నర్సింహారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రవికుమార్, వీరేశం, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.అలాగే దోమ మండల అధ్యక్షులు కేశవ్, పరిగి మండల కార్యదర్శి మనోహర్, యాలాల్ మండల అధ్యక్షులు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి పరమేష్, జిల్లా అసోసియేట్ జగదీశ్వర్, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్, జట్టూరి శ్రీనివాస్, అనిల్, శ్రీశైలం, ప్రసాద్, హుస్సేన్, యాదయ్య, దస్తప్ప తదితరులు హాజరయ్యారు.

మండల కార్యవర్గ సభ్యులు, గౌరవ ప్రాథమిక సభ్యులు, పిఆర్టియుటిఎస్ సీనియర్ నాయకులు నాగప్ప, నర్సిరెడ్డి, కిష్టప్ప తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. నూతన కార్యవర్గం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని నాయకులు ఆకాంక్షించారు






# సాయుధ పోరాట అసలైన వారసులు కమ్యూనిస్టులే

**సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు**

**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అసలైన వారసులు కమ్యూనిస్టులేనని, వీరనారి చిట్యాల ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ఉద్యమిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పర్వతాలు అన్నారు.నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో చిట్యాల ఐలమ్మ 41వ వర్ధంతి నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటం భూమికోసం, భుక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో జరిగిందన్నారు. విసునూరు రామచంద్రారెడ్డి అరాచకాలకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తినిచ్చిందని, తన 4 ఎకరాల పంటను కాపాడుకున్న గొప్ప పోరాట నాయకురాలని కొనియాడారు.సాయుధ పోరాట ఫలితంగానే 10 లక్షల ఎకరాలకు పైగా భూమిని పేదలకు పంచారని, 3 వేలకు పైగా గ్రామ స్వరాజ్యాలు ఏర్పాటయ్యాయని తెలిపారు. ఆ పోరాటానికి సంబంధం లేని కాషాయ మూకలు హిందూ, ముస్లిం పేరుతో మతం రంగు పులిమి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. రజాకార్ ఫైల్స్ లాంటి సినిమాలతో యువతను పక్కదారి పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.భవిష్యత్తులో స్థానిక సమస్యలపై సీపీఎం ఆందోళనలు చేపడుతుందని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్. శ్రీనివాసులు, కందికొండ గీత, జిల్లా కమిటీ సభ్యులు పొదిల రామయ్య, గుంపల్లి అశోక్, శివవర్మ, కాశన్న, మధు, సురేష్, కేతేపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఐవీ,ఎయిడ్స్ పై విస్తృత అవగాహన కల్పించాలి



**డీఎంహెచ్ఓ డాక్టర్ కె. కృష్ణ**

**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):**

హెచ్ఐవీ,ఎయిడ్స్ నివారణపై పాఠశాల, కళాశాల విద్యార్థులకు, డ్రైవర్లకు, వలస కుటుంబాలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. కృష్ణ తెలిపారు.నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో గురువారం నాగర్ కర్నూల్, గద్వాల, వనపర్తి జిల్లాల ఐసీటీసీ కౌన్సిలర్లకు, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులకు జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమం అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గర్భవతికి హెచ్ఐవీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, పాజిటివ్ గర్భవతులు క్రమం తప్పకుండా ఏఆర్టీ మందులు వాడేలా చూడాలని, తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ సోకకుండా సిబ్బంది కృషి చేయాలన్నారు. హై రిస్క్ గ్రూపులైన ఆటో, లారీ, ట్రక్ డ్రైవర్లకు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కుటుంబాలకు ప్రత్యేక కౌన్సెలింగ్, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలన్నారు. అనంతరం హెచ్ఐవీ/ఎయిడ్స్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఫిక్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పోస్టర్ పై ఉన్న క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేసి తమకు హెచ్ఐవీ సోకే అవకాశం ఉందా అని స్వయం మూల్యాంకనం చేసుకోవాలని, దీనిపై సిబ్బంది విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఫిక్, దిశా కార్యక్రమ మేనేజర్ రమేష్, సాయికుమార్, రమేష్ రెడ్డి, ఐసీటీసీ కౌన్సిలర్లు, స్వచ్ఛంద సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

# మండల పీఆర్టీయూ కార్యవర్గం ఎన్నిక

**(సెప్టెంబర్ 10, బషీరాబాద్, వుదయం)**

బషీరాబాద్ మండల శాఖ పీఆర్టీయూ నూతన కార్యవర్గం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ప్రత్యక్ష ఎన్నికల ఓటింగ్ విధానంతో శ్రీ రాధాకృష్ణ కళ్యాణ మండపంలో గురువారం ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో మండల పీఆర్టీయూ అధ్యక్షుడిగా ఎం.రవీందర్ 158 ఓట్లతో సమీప ప్రత్యర్థి చంద్రశేఖర్ పై గెలుపొందారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా భీమప్ప 123 ఓట్లతో, ప్రత్యర్థి నాగరాజుపై విజయ ఢంకా మోగించారు. ఈ సందర్భంగా గెలుపొందిన అధ్యక్షులు m.రవీందర్, ప్రధాన కార్యదర్శి భీమప్ప మాట్లాడుతూ... ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. పలువురు ఉపాధ్యాయులు పూలమాల, శాలువాతో సత్కరించారు.




## రామాయంపేటను

# రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు చేయాలి

**కౌన్సిలర్ శంకర్ గౌడ్**
**సీఎం, రెవెన్యూ మంత్రి దృష్టికి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తీసుకెళ్లాలి**
**అన్ని వర్గాల ప్రజల చిరకాల డిమాండ్‌ను నెరవేర్చాలి: 8వ వార్డు కౌన్సిలర్**

**రామాయంపేట,సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి రాజాగౌడ్):**






రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని 8వ వార్డు కౌన్సిలర్ జె. శంకర్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెనుకబడిన ఈ ప్రాంతం రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడితే పరిపాలన సౌలభ్యంతో పాటు అభివృద్ధికి మరింత అవకాశం ఉంటుందని, ఈ ఆశతో గతంలో పట్టణ కేంద్రంలో అన్ని వర్గాల ప్రజలు నెలల తరబడి ఉద్యమాలు నిర్వహించినా ఇప్పటివరకు డిమాండ్ నెరవేరలేదని తెలిపారు.ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు రామాయంపేట రెవెన్యూ డివిజన్ అంశాన్ని ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడేళ్లు కావస్తున్నా ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేరకపోవడం బాధాకరమన్నారు.

రామాయంపేట ప్రాంత అభివృద్ధికి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కీలకమని పేర్కొంటూ, స్థానిక కాంగ్రెస్ నాయకులు కూడా ఎమ్మెల్యేపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా రామాయంపేట అభివృద్ధిలో వెనుకబడిందని, ప్రస్తుత ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకుని రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా అధికారికంగా ప్రకటించి, వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

# దొరల గడీలను బద్దలు కొట్టిన అగ్ని కణం చిట్యాల ఐలమ్మ

**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):**



వీర తెలంగాణ అగ్ని కణం చిట్యాల ఐలమ్మ దొరల గడీలను బద్దలు కొట్టిందని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు మారేడు శివశంకర్ అన్నారు.నాగర్ కర్నూల్ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ బస్టాండ్ వద్ద ఐలమ్మ విగ్రహం వద్ద గురువారం సీపీఐ టౌన్ సమితి ఆధ్వర్యంలో రజక చేతి వృత్తుల సంఘం జిల్లా కన్వీనర్ కొట్ర శేఖర్ అధ్యక్షతన చిట్యాల ఐలమ్మ 41వ వర్ధంతి నిర్వహించారు. తొలుత ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ.. నైజాం కాలంలో భూస్వాముల గుండాలు, నైజాం సైన్యం స్త్రీలపై అఘాయిత్యాలు చేస్తూ రైతులు పండించిన పంటలను దోచుకెళ్తున్న క్రమంలో చిట్యాల ఐలమ్మ అగ్ని కణమై తెలంగాణ జనసభ, కమ్యూనిస్టుల సహకారంతో వీరోచితంగా పోరాడి పంటను రక్షించుకుందన్నారు. ఆమె పోరాటం, సాయుధ రైతాంగ పోరాట త్యాగాల ఫలితంగానే పేదలకు భూములు దక్కాయని, వెట్టిచాకిరీ రద్దయి ఆత్మగౌరవం లభించిందని పేర్కొన్నారు. చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో పాలకవర్గాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు తిరుగుబాటు చేయాలని, సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు జరిగే సాయుధ పోరాట వారోత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సీపీఐ టౌన్ సహాయ కార్యదర్శి కొత్త రామస్వామి, ఏఐవైఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎం. ఆంజనేయులు, డీహెచ్పీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముంకేశ్వరం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపేటలో అక్రమ నిర్మాణాల జోరు

**అధికారులు నిద్రపోతున్నారా...? లేక చూసి చూడనట్లు వదిలేస్తున్నారా ?**

**నోటీసులు కాగితాలకేనా... పునాదులు భవనాలుగా మారే వరకు ఏమి చేస్తున్నారు ?**

**నారాయణపేట సెప్టెంబర్10(వుదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లా కేంద్రంలో అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, నాలాల కబ్జాలపై ఆరోపణలు రోజురోజుకూ పెరుగుతున్నా..సంబంధిత అధికార యంత్రాంగం మాత్రం మేల్కొనడం లేదన్న విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. కళ్ల ముందే నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు? ప్రజల కోసం ఉన్న ప్రభుత్వ యంత్రాంగం అక్రమార్కుల కోసం పనిచేస్తుందా? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పునాది దశలోనే గుర్తించి అడ్డుకోవాల్సిన నిర్మాణాలు.. అధికారులు స్పందించేలోపే ఒక్క అంతస్తు, రెండంతస్తులుగా ఎదిగిపోతున్నాయి. పత్రికల్లో కథనాలు వచ్చినా.. అధికారుల చేతిలో కనిపించేది నోటీసులు మాత్రమే. నోటీసు ఇచ్చిన తర్వాత నిర్మాణం ఆగిందా? లేక నోటీసు ఇచ్చామనే పేరుతో ఫైల్‌ను మూసేశారా? అన్న ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. పునాది నుంచి బిల్డింగ్ వరకు.. అధికారులు ఎక్కడ? ఒక అక్రమ నిర్మాణం ఒక్కరోజులో రెండంతస్తుల భవనంగా మారదు. పునాది వేయాలి.. గోడలు నిర్మించాలి..స్లాబులు వేయాలి.. అంతస్తులు పెంచాలి. ఈ మొత్తం ప్రక్రియలో ఒక్కసారి కూడా అధికారుల కంట పడలేదా? పడితే ఎందుకు ఆపలేదు? అన్నది ప్రజల ప్రశ్న. పత్రికల్లో వరుస కథనాలు వచ్చిన తర్వాత కూడా అదే నిర్మాణం కొనసాగుతుంటే.. అధికారుల ఆదేశాలకు విలువ లేదా? నిబంధనలకు భయమే లేదా? అక్రమ నిర్మాణదారులకు అంత ధైర్యం ఎక్కడి నుంచి వస్తోంది? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రభుత్వ భూమి.. ప్రజల ఆస్తి.. మరి కాపాడేది ఎవరు?**

ప్రభుత్వ భూములు, నాలాలు, ప్రజా అవసరాల కోసం ఉన్న స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నా అధికారులు స్పందించకపోతే.. రేపు ప్రభుత్వ ఆస్తి మిగిలేది ఎంత? ప్రజల ఆస్తిని కాపాడాల్సిన అధికారులు మౌనం వహిస్తే.. ఆ భూములను కాపాడేది ఎవరు? కబ్జాలు జరిగిన తర్వాత కొలతలు.. నోటీసులు.. విచారణలు అంటూ కాలయాపన చేస్తే ఆక్రమణదారులకు మరింత సమయం దొరికినట్టే కాదా? అక్రమ నిర్మాణం పూర్తయ్యే వరకు అధికారులు వేచి చూస్తారా? పూర్తయిన తర్వాత చర్యలు తీసుకోవడమే అధికారుల విధానమా?

**పత్రికలు ప్రశ్నిస్తున్నా.. అధికారులు ఎందుకు స్పందించడం లేదు?**

ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యతతో మీడియా వరుసగా ప్రశ్నిస్తున్నా..సంబంధిత అధికారులు మాత్రం స్పష్టమైన సమాధానాలు ఇవ్వకుండా మౌనం వహించడం ఎందుకు?అక్రమ నిర్మాణం కాదంటే అధికారికంగా చెప్పాలి.అనుమతులు ఉంటే చూపించాలి. ప్రభుత్వ భూమి కాదంటే రికార్డులు బయటపెట్టాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలి.కానీ ఇవేవీ చేయకుండా మౌనం



వహిస్తే.. ఈ మౌనం వెనుక కారణమేంటి? అన్న అనుమానం ప్రజల్లో మరింత బలపడుతుంది.

**జిల్లా ఉన్నతాధికారులు మేల్కొనాల్సిన సమయం!**

ఇది ఒక్క నిర్మాణం సమస్య కాదు..ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, పట్టణ ప్రణాళిక, ప్రజల హక్కులు, అధికారుల బాధ్యతకు సంబంధించిన ప్రశ్న. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలి. అనుమతులు లేని నిర్మాణాలను గుర్తించాలి. ప్రభుత్వ భూములు, నాలాలు, ప్రజా స్థలాలపై జరిగిన ఆక్రమణలపై సమగ్ర సర్వే చేపట్టాలి. ఇప్పటికే నోటీసులు ఇచ్చిన నిర్మాణాలపై ఏం చర్యలు తీసుకున్నారో ప్రజలకు వెల్లడించాలి. అక్రమం చేసే వారికి చట్టం భయం లేకపోతే.. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులకు బాధ్యత గుర్తుందా?ప్రజల భూమి.. ప్రభుత్వ భూమి.. ప్రజల పన్నులతో నడిచే వ్యవస్థ. దానిని కాపాడాల్సిన అధికారులే మౌనం వహిస్తే ప్రజలు ఎవరిని ప్రశ్నించాలి?నారాయణపేట ప్రజల ప్రశ్నలకు జిల్లా యంత్రాంగం సమాధానం చెప్పాల్సిందే.

# పాఠశాలల్లో పౌష్టికాహారంతో మధ్యాహ్న భోజనం అందించాలి: కలెక్టర్

**కోడేరు, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):**

విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశించారు.
కొల్లాపూర్ నియోజకవర్గం కోడేరు మండలం బావాయిపల్లి గ్రామంలో గురువారం ఆయన ఆకస్మికంగా పర్యటించి భూ రీ సర్వే పనులతో పాటు ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్కూల్ యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు అందరికీ అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలో చేరేలా, క్రమం తప్పకుండా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. సర్పంచ్ సహకారంతో పాఠశాలను మరింత అభివృద్ధి చేయాలని సూచించారు.
అనంతరం గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనుల పురోగతిని రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూముల హద్దులు, ప్రభుత్వ భూములు, పట్టా భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రెవెన్యూ రికార్డులతో సరిపోల్చాలని,



ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా రీ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ పర్యటనలో కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, తహసీల్దార్ ఎం.డి. జమీల్, ఎంపీడీవో విజయలక్ష్మి, సర్పంచ్ పరశురాములు, ఉపాధ్యాయులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# శాంతియుత వాతావరణం లో గణేష్ ఉత్సవాలు జరుపు కోవాలి

**ఎస్సై యుగంధర్ రెడ్డి**

**వెల్దండ సెప్టెంబర్ 10 (వు ద యం )**

గణేష్ పండగ సందర్భంగా వెల్దండ పోలీస్ స్టేషన్ పరిధిలో గణేష్ మండపాల నిర్వాహకులతో పోలీస్ స్టేషన్ లో ఎస్సై యుగంధర్ రెడ్డి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా శాంతియుత వాతావరణంలో పండగ ఉత్సవాలు జరుపుకోవాలని పలు సూచనలు చేశారుగణేష్ విగ్రహాలు పెట్టేటువంటి నిర్వాహకులు తప్పకుండా అట్టి సమాచారంను తెలియపరచాలి. DJ సౌండ్ ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబడవు పూర్తిగా నిషేధం ఇప్పుడు ఉన్నటువంటి వాతావరణ పరిస్థితుల్లో గ్రామాలలో ఉన్న చెరువులలో సరైన నీరు లేనందువల్ల నిర్వాహకులు ముందుగా ఆ విషయాన్ని గమనించి మరే ఇతర నిమజ్జనం చేసే స్థలాన్ని గుర్తించుకోవాలి. వీలైనంతవరకు మట్టి విగ్రహాలను పెట్టుకోవాలని వాతావరణ కాలుష్యాన్ని తగ్గించాలని సూచించారుగణేష్ మండపం ఏర్పాటు చేసే సమయంలో గానీ, నిమజ్జన సమయంలో కానీ తగిన జాగ్రత్తలు తీసుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణంలో గణేష్ పండగ ఉత్సవాలను సంతోషంగా జరుపుకోవాలని సూచించడం జరిగింది.
సోషల్ మీడియాలో ఏదైనా తప్పుడు సమాచారం వచ్చినపుడు దానిని ఇతరులకు గాని , ఇతర గ్రూప్ ల లో గానీ ఫార్వర్డ్ చేసిన, పోస్ట్ చేసిన, లైక్ చేసిన, షేర్ చేసిన అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుంది. ఏదైన అలాంటి తప్పుడు వార్తలు వచ్చినప్పుడు పోలీస్ వారికి తెలియపరచాలి.

# అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అడ్మిషన్ గడువు పొడగింపు

**నారాయణపేట టౌన్ సెప్టెంబర్10(వుదయం ప్రతినిధి)**

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ కొత్తగా అడ్మిషన్ పొందేందుకు 2026 27 విద్యా సంవత్సరానికి గాను చివరి తేదీ సెప్టెంబర్ 30 వరకు పొడిగించినట్లు సమన్వయకర్త భాస్కర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా సెకండ్ ఇయర్, థర్డ్ ఇయర్ ట్యూషన్ ఫీజు అనగా (అడ్మిషన్ ఫీజు) చెల్లించుటకు చివరి తేదీ సెప్టెంబర్ 30 వరకు గడువును పొడిగించినట్లు ఆయన తెలిపారు.ఇట్టి విషయాన్ని విద్యార్థులు గమనించాలని,మిగతా వివరాల కొరకు స్టడీ సెంటర్ ను సంప్రదించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

# ఐలమ్మ పోరాట పటిమ అమర నినాదం

**సిద్దిపేట వ్యాప్తంగా ఘన నివాళులు!**

- **సిద్దిపేట జిల్లావ్యాప్తంగా వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలు**
- **ఐలమ్మను 'తెలంగాణ తల్లి'గా ప్రకటించాలని డిమాండ్**
- **రజక సంఘాల ఆధ్వర్యంలో విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి**
- **బెజ్జంకి, కొండపాక, జగదేవ్‌పూర్, మర్కుక్, రాయపోల్, గజ్వేల్‌లలో ఘనంగా కార్యక్రమాలు**
- **వట్టిపల్లిలో రజక సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక**

**సిద్దిపేట, సెప్టెంబర్ 10 (వుదయం బ్యూరో)**

సాయుధ తెలంగాణ పోరాటంలో భూస్వామ్య, దొరల పెత్తనానికి వ్యతిరేకంగా ధైర్యసాహసాలతో పోరాడి రజకుల ఆత్మగౌరవాన్ని, బహుజనుల హక్కులను చాటిచెప్పిన వీరనారి చిట్యాల (చాకలి) ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ప్రజా సంఘాలు, రజక సంఘాలు మరియు వివిధ రాజకీయ పార్టీల నాయకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంతో పాటు బెజ్జంకి, కొండపాక (దుద్దెడ, బందారం), జగదేవ్‌పూర్, మర్కుక్, రాయపోల్, గజ్వేల్ మండలాల్లోని పలు గ్రామాలలో ఐలమ్మ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**సిద్దిపేటలో 'తెలంగాణ తల్లి'గా ప్రకటించాలని టీఆర్ఆర్ఎస్ డిమాండ్:**

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు వద్ద తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేషనల్ ధోబి రిజర్వేషన్ సంఘ్ ప్రధాన కార్యదర్శి, టీఆర్ఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్ చిన్నరంగారి మాట్లాడుతూ... దొరల అరాచకాలపై తిరగబడిన ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమన్నారు. ఐలమ్మను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 'తెలంగాణ తల్లి'గా ప్రకటించాలని, ప్రతి గ్రామంలో ఆమె విగ్రహాలను నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గణపతి నర్సింలు, రాచకొండ శ్రీనివాస్, చికోడ్ వేణు, పోతరాజు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకి మండలంలో ఘన నివాళులు:

**దుద్దెడ, బందారంలో నివాళులు:**

కొండపాక మండలం దుద్దెడ, బందారం గ్రామాల్లో రజక సంఘం రాష్ట్ర నాయకులు ర్యాగాల్ల దుర్గయ్య, దుద్దెడ సర్పంచ్ మిద్దె శివకుమార్, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు గడ్డమీది రామస్వామి, రజక సంఘం అధ్యక్షుడు బుచ్చిగారి మల్లయ్య, పెద్దంకుల దేవేందర్, చిట్యాల నర్సింలు ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

రాయపోల్, మర్కుక్, గజ్వేల్ పరిధిలో..: రాయపోల్ మండలంలో రజక రిజర్వేషన్ సమితి వర్కింగ్ సెక్రెటరీ గౌరీ గారి పరశురాములు, బీఆర్ఎస్ యువజన నాయకుడు గల్వ దయాకర్ రెడ్డి, మర్కుక్‌లో సర్పంచ్ రాణి మల్లేష్, సాయిని మహేష్, గజ్వేల్ నియోజకవర్గంలో రజక సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎల్లేష్, ప్రధాన కార్యదర్శి రాంగారి శ్రీధర్ ల ఆధ్వర్యంలో గజ్వేల్, ప్రజ్ఞాపూర్, శ్రీగిరిపల్లి, అలీరాజ్ పేట్ గ్రామాలలో ఐలమ్మ విగ్రహాలకు నివాళులు అర్పించారు.

**వట్టిపల్లిలో నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక:**

జగదేవ్‌పూర్ మండలం వట్టిపల్లి గ్రామంలో ఐలమ్మ వర్ధంతి సందర్భంగా రజక సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

- అధ్యక్షుడు: వడ్లకొండ భిక్షపతి
- ఉపాధ్యక్షుడు: కొమ్మాట ఉప్పలయ్య
- కోశాధికారి: నర్సింహులు
- క్యాషియర్: గణేష్

ఈ సందర్భంగా నూతన ఉపాధ్యక్షుడు కొమ్మాట ఉప్పలయ్య మాట్లాడుతూ రజక సంక్షేమానికి, ప్రభుత్వ పథకాల అమలుకు నూతన కమిటీ నిరంతరం కృషిచేస్తుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, వివిధ రజక సంఘాల నాయకులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# దొరల పెత్తనానికి ఎదురొడ్డి నిలిచిన ధీరవనిత చాకలి ఐలమ్మ

**పేద రజక కుటుంబంలో పుట్టి... కౌలు భూమి హక్కు కోసం పోరాడి... తెలంగాణ రైతాంగ చరిత్రలో చెరగని ముద్ర వేసిన మహిళ**

**వికారాబాద్ అక్టోబర్ 10 (వుదయం బ్యూరో)**

తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో చాకలి ఐలమ్మ పేరు ప్రత్యేకంగా నిలిచింది. సాధారణ రజక కుటుంబంలో జన్మించిన ఆమె కష్టజీవితం నుంచి పోరాట జీవితంలోకి అడుగుపెట్టింది. భూమిపై హక్కు, పంటపై హక్కు కోసం స్థానిక భూస్వామ్య పెత్తనాన్ని ధైర్యంగా ప్రశ్నించింది.

**చిట్యాల ఐలమ్మగా జననం... పాలకుర్తిలో జీవితం**

1895లో వరంగల్ ప్రాంతంలోని క్రిష్టాపురంలో జన్మించిన ఐలమ్మ వివాహానంతరం పాలకుర్తి ప్రాంతంలో నివసించింది. రజక వృత్తితో పాటు వ్యవసాయంపై ఆధారపడి కుటుంబాన్ని పోషించింది. కౌలు భూమిలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగించింది.

**కౌలు భూమి... పంటపై హక్కే అసలు వివాదం**

పాలకుర్తి ప్రాంతంలో తాను సాగు చేస్తున్న భూమి, పండించిన పంటపై హక్కు విషయంలో విస్నూర్ దేశ్‌ముఖ్ వర్గంతో ఐలమ్మకు ఘర్షణ ఏర్పడింది. తన శ్రమతో పండించిన పంటను వదులుకోవడానికి ఆమె నిరాకరించింది. ఈ సంఘటన ఆమె జీవితాన్ని పూర్తిగా మార్చింది.



**దేశ్‌ముఖ్ పెత్తనానికి బహిరంగ సవాల్**

ఆ కాలంలో తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో భూస్వామ్య పెత్తనం బలంగా ఉండేది. ఐలమ్మ మాత్రం ఒత్తిళ్లకు తలొగ్గకుండా తన హక్కు కోసం నిలబడింది. ఆమె పోరాటానికి ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు ఉద్యమంతో అనుబంధం ఉన్న కార్యకర్తల మద్దతు లభించింది.
ఇంట్లోనే ఉద్యమ కార్యకలాపాలకు ఆశ్రయంఐలమ్మ కుటుంబం ఉద్యమకారులకు అండగా నిలిచినట్లు చారిత్రక ఆధారాలు పేర్కొంటున్నాయి. ఆమె ఇంటిని కూడా ఉద్యమ కార్యకలాపాలకు ఉపయోగించుకున్నట్లు ఆధారాలు ఉన్నాయి. దీంతో దేశ్‌ముఖ్ వర్గం నుంచి ఆమె కుటుంబంపై ఒత్తిడి మరింత పెరిగింది.

**భర్త, కుమారుల అరెస్టులు... అయినా వెనక్కి తగ్గలేదు**

పోరాటంలో భాగంగా ఐలమ్మ కుటుంబ సభ్యులు కూడా కేసులు, అరెస్టులను ఎదుర్కొన్నట్లు చారిత్రక కథనాలు చెబుతున్నాయి. కుటుంబంపై ఒత్తిడి పెరిగినా ఐలమ్మ తన పోరాటాన్ని కొనసాగించింది. ఒక మహిళగా ఆమె చూపిన ధైర్యం గ్రామీణ ప్రజల్లో చైతన్యాన్ని పెంచింది.
1940-44లో ప్రతిఘటనకు మరింత ఊపు1940 నుంచి 1944 మధ్య దేశ్‌ముఖ్, నిజాం పాలనకు అనుబంధంగా ఉన్న అణచివేత శక్తులకు వ్యతిరేకంగా ఐలమ్మ చురుకుగా పనిచేసినట్లు భారత ప్రభుత్వ చారిత్రక ఆధారాలు పేర్కొంటున్నాయి. ఈ దశలో ఆమె పేరు తెలంగాణ ప్రజల్లో విస్తృతంగా వినిపించింది.

**రైతాంగ పోరాటానికి స్ఫూర్తి**

1946 నుంచి తెలంగాణ రైతాంగ పోరాటం మరింత విస్తరించింది. ఐలమ్మ ముందస్తు పోరాటం ఈ విస్తృత రైతాంగ ప్రతిఘటనలో ఒక ముఖ్యమైన స్ఫూర్తి ఘట్టంగా గుర్తించబడింది. అయితే మొత్తం సాయుధ రైతాంగ పోరాటాన్ని ఒక్క ఐలమ్మ ప్రారంభించినట్లు చెప్పడం కంటే, ఆమెను ఆ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన ప్రముఖ మహిళగా పేర్కొనడం చారిత్రకంగా సముచితం.

**పార్లమెంటు కాదు... ప్రజల మధ్యే పోరాటం**

చాకలి ఐలమ్మ పార్లమెంటు సభ్యురాలు కాదు. ఆమెకు ఎంపీ పదవి లేదు. ఆమెకు చరిత్రలో గుర్తింపు వచ్చింది ఎన్నికల రాజకీయాల వల్ల కాదు—భూమి, పంట, ఆత్మగౌరవం కోసం చేసిన ప్రజా పోరాటం వల్ల.

**మహిళా ధైర్యానికి ప్రతీక**

ఆ కాలంలో మహిళలకు సామాజిక స్వేచ్ఛ పరిమితంగా ఉన్నప్పటికీ, ఐలమ్మ భూస్వామ్య పెత్తనాన్ని ప్రశ్నిస్తూ బహిరంగంగా నిలబడింది. అందుకే ఆమె పేరు తెలంగాణ మహిళా చైతన్యం, రైతాంగ ప్రతిఘటన చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది.

**1985లో మరణం... చరిత్రలో మాత్రం చిరస్థానం**

చాకలి ఐలమ్మ 1985 సెప్టెంబర్ 10న పాలకుర్తిలో మరణించింది. ఆమె మరణానంతరం కూడా తెలంగాణలో ఆమెను స్మరించే కార్యక్రమాలు కొనసాగాయి. ప్రభుత్వాలు, సామాజిక సంస్థలు ఆమె పోరాటాన్ని గుర్తిస్తూ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

**ఒక మహిళ పోరాటం... ఒక తరం చరిత్ర**

భూమి కోసం మొదలైన పోరాటం... పంటపై హక్కు కోసం సాగిన ప్రతిఘటన... భూస్వామ్య పెత్తనానికి సవాల్... మహిళా ఆత్మగౌరవానికి నిదర్శనం... తెలంగాణ రైతాంగ చరిత్రలో చాకలి ఐలమ్మ పేరు ఒక చెరగని అధ్యాయం.

# ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):**

కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ గురువారం త్రైమాసిక తనిఖీలో భాగంగా పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్ సీల్‌ను తెరిచి, అక్కడ భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఇతర ఎన్నికల సామాగ్రి, భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు.ఈవీఎంలు, ఎన్నికల సామాగ్రి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. గోడౌన్ భద్రత, సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ, సీల్ విధానం, రిజిస్టర్ల నిర్వహణ తదితర అంశాలను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.ఈ తనిఖీలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ గడువు పొడిగింపును సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్




**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు భారత ఎన్నికల సంఘం పొడిగించిన గడువును రాజకీయ పార్టీలు సద్వినియోగం చేసుకుని అర్హులైన ఓటర్ల నమోదుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ బి. చెన్నయ్యతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ కు సంబంధించి క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణకు అక్టోబర్ 7 వరకు గడువు పొడిగించారని, తుది ఓటర్ల జాబితా నవంబర్ 9న ప్రచురితమవుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా, అనర్హులు, మరణించిన వారు, వలస వెళ్లిన వారు, డూప్లికేట్ నమోదులను నిబంధనల ప్రకారం తొలగించేందుకు ఈ అదనపు సమయాన్ని వినియోగించుకోవాలన్నారు.జిల్లాలో ఇప్పటివరకు 1,15,824 నోటీసులు జారీ చేయగా కేవలం 329 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, అవి గురువారం సాయంత్రానికే పూర్తి చేస్తామని తెలిపారు. హియరింగ్‌కు హాజరు కావాల్సిన 47,236 మందిలో 40 శాతం మందికి విచారణ పూర్తయిందని, హాజరుకాని సుమారు 25 వేల మందికి మరో అవకాశం కల్పిస్తున్నామని, ఈ నెల 20లోగా అన్ని హియరింగ్‌లు పూర్తి చేస్తామని చెప్పారు.
రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పరిధిలో ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హుల పేర్లు తప్పిపోకుండా చూడాలని, అభ్యంతరాలు ఉంటే నిర్ణీత గడువులోగా అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవి కుమార్, డీటీ కల్పన, కాంగ్రెస్ ప్రతినిధి హబీబ్, బీజేపీ ప్రతినిధి నాగేందర్ గౌడ్, బీఎస్పీ ప్రతినిధి రామకృష్ణ, బీఆర్ఎస్ ప్రతినిధులు విష్ణు, నరసింహ, టీడీపీ ప్రతినిధి బాలకృష్ణ, వైఎస్సార్సీపీ ప్రతినిధి ఎండి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# కడుకుంట్ల పీహెచ్‌సీ, పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)**

గర్భిణుల్లో రక్తహీనతను గుర్తించి మెరుగైన చికిత్స అందించాలి
పీహెచ్‌సీల్లోనే పాము కాటు బాధితులకు తక్షణ వైద్యం అందించాలి: జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి
. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పాము కాటు బాధితులకు అందిస్తున్న వైద్య సేవలపై కలెక్టర్ ఆరా తీశారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మందులు, యాంటీ స్నేక్ వెనం (ఏఎస్వీ) నిల్వలు, వాటి వినియోగం, పాము కాటు కేసులు వచ్చినప్పుడు చేపడుతున్న వైద్య ప్రక్రియ తదితర అంశాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు.కలెక్టర్ మాట్లాడుతూ పాము కాటు బాధితులకు పీహెచ్‌సీ స్థాయిలోనే తక్షణ వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన మందులు, యాంటీ స్నేక్ వెనం(పాము కాటు విరుగుడు టీకా) ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పాము కాటు కేసుల్లో




ఎలాంటి జాప్యం లేకుండా ప్రాథమిక చికిత్స అందించి, అవసరమైన సందర్భాల్లో ఉన్నత స్థాయి వైద్య సేవలకు తరలించేలా సమన్వయం చేసుకోవాలని తెలిపారు.

**గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి**

పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణుల వివరాలు, వారి ఆరోగ్య పరిస్థితి, వారికి అందుతున్న వైద్య సేవలపై కలెక్టర్ సమీక్షించారు. ముఖ్యంగా రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులను గుర్తించి, వారికి మెరుగైన వైద్యం అందించడంతో పాటు అవసరమైన పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు. రక్తహీనత ఉన్న గర్భిణులకు వైద్యుల సూచనల మేరకు మందులు, పోషకాహారంపై అవగాహన కల్పించాలని తెలిపారు. గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

**పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి**

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వైద్యులు, సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రి పరిసరాలు, వార్డులు, చికిత్సా గదులు, మరుగుదొడ్లు తదితర ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.
రోగులకు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాలను ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.
పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి
పదవ తరగతిలో ఈ ఏడాది జిల్లాలో 100% విద్యార్థులు ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కడుకుంట్లలోని జడ్పీ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫిజిక్స్, గణితం, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో ప్రత్యేకంగా రూపొందించిన మెటీరియల్ ఆధారంగా వెనుకబడిన విద్యార్థులకు బోధించాలని సూచించారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులను పాఠ్యాంశాలు అర్థమయ్యే విధంగా బోధించి 100% ఉత్తీర్ణత సాధించే విధంగా చొరవ తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు ఆడుకోవడానికి సౌకర్యంగా మైదానాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్, వైద్యాధికారి డాక్టర్ రాకేష్ రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా చరిత్రను డిజిటల్ భద్రపరిచేందుకు 'జ్ఞాన భారత్ మిషన్'

**11న గద్వాలలో జిల్లా కమిటీ సమావేశం**

**గద్వాల సెప్టెంబర్ 10 (వుదయం కరస్పాండెంట్)**

జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన ప్రాచీన చరిత్ర, సంస్కృతి, సాహిత్య సంపదను భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచేలా డిజిటలైజేషన్ చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. జ్ఞాన భారత్ మిషన్‌లో భాగంగా జిల్లాలోని పురాతన ఆలయాల చరిత్ర, శాసనాలు, తాళపత్ర గ్రంథాలు, ప్రముఖ సాహితీవేత్తల రచనలు, చారిత్రక ఆధారాలను సేకరించి డిజిటల్ రూపంలో భద్రపరచనున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన సాహితీవేత్తలు, పరిశోధకులు, తెలుగు భాషాభిమానులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ అంశంపై ఈనెల 11న మధ్యాహ్నం 3 గంటలకు గద్వాలలోని ప్రభుత్వ ఎంఎల్‌డీ డిగ్రీ కళాశాలలో జ్ఞాన భారత్ మిషన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. తమ వద్ద ఉన్న ప్రాచీన సాహిత్యం, శాసనాలు, గ్రంథాలు, చారిత్రక సమాచారం గురించి సమావేశంలో తెలియజేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

**అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి**

**కరీంనగర్ సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):**

భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం, గడీల పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీరవనితా చాకలి ఐలమ్మ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కరీంనగర్ అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా కరీంనగర్‌లోని ఆ మహనీయురాలు విగ్రహానికి శ్రీనివాస్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కాల్వ మల్లేశం, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూస్వామ్య దోపిడీ, నిరంకుశత్వానికి ఎదురొడ్డి నిలిచి పేదలు, బలహీన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఆమె చూపిన తెగువ ఆదర్శనీయమని పేర్కొన్నారు. అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యం, హక్కుల కోసం పోరాడే సంకల్పం, సమాజ శ్రేయస్సు కోసం నిబద్ధతతో పనిచేయాలనే సందేశాన్ని చాకలి ఐలమ్మ జీవితం అందిస్తోందని శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

## అక్రమ అరెస్ట్ లతో ప్రశ్నించే గొంతుకలను అడ్డుకోలేరు

**జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్**

**కరీంనగర్ సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):**



జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ ను గృహనిర్బంధం చేసి ఉదయం 6.30 గం " లకు కొత్తపల్లి పోలీస్ స్టేషన్ కి తరలించారు , ఈ అక్రమ అరెస్ట్ లను కండిస్తున్నామని పొన్నం అనిల్ కుమార్ గౌడ్ అన్నారు , రేవంత్ రెడ్డి తెల్లవారి లేచేసరికి రాష్ట్ర వ్యాప్తంగా బిఆర్ఎస్వి అనే కెసిఆర్ గులాబీ సైన్యాన్ని అరెస్ట్ చేయాలని హుకుం జారీ చేసినట్లు ఉన్నారు , ఈ పోలీస్ లు ఎలాంటి కారణం లేకుండా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి నాయకులను అరెస్ట్ చేయడం అంటే అర్ధ రాత్రి కలలో కూడా రేవంత్ రెడ్డి సీఎం కు బిఆర్ఎస్వి నాయకులు మాత్రమే కనపడుతున్నారు ఉన్నారని అన్నారు , ఈ నియంత పాలన కు చరమ గీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని ఇక ప్రజా వ్యతిరేక తను ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

## ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం సన్నాహక భేటీ



**నేడు కమాన్ రోడ్ ప్రెస్ క్లబ్‌లో ముఖ్య నేతల భేటీ**

**పెద్దపల్లి,సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)**

ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జాతీయ,రాష్ట్ర కమిటీలు నిర్ణయించాయి.ఈ ఉత్సవాల నిర్వహణకై వ్యూహ రచన చేసేందుకు ఈ నెల 11న శుక్రవారం పెద్దపల్లి కమాన్ రోడ్డులోని ప్రెస్ క్లబ్‌లో జిల్లా స్థాయి సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు ప్రకటించారు.ఈ మేరకు గురువారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు,జిల్లా అధ్యక్షుడు లంక సదయ్య పాల్గొని మాట్లాడుతూ స్వర్ణోత్సవ సన్నాహక సమావేశానికి జాతీయ,రాష్ట్ర స్థాయి ముఖ్య నేతలు హాజరవుతున్నారని తెలిపారు.జిల్లాలోని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా,మండల కమిటీల నాయకులు,ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్,రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్, కవ్వంపల్లి సతీష్,పాల రాజేశం,జిల్లా కో–కన్వీనర్లు ఆకునూరి బాల అంకుష్,శనిగరపు పోచన్న,ఆలయ ఫౌండేషన్ అడిషనల్ సీఈవో మిట్టపల్లి రాజేందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లాలో ఆహార భద్రత శాఖ ప్రత్యేక తనిఖీలు

**పెద్దపల్లి ,సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)**



తెలంగాణ రాష్ట్ర ఆహార భద్రత కమిషనర్ మరియు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, ప్రజలకు సురక్షితమైన, పరిశుభ్రమైన మరియు నాణ్యమైన ఆహారం అందుబాటులో ఉండేలా నేడు పెద్దపల్లి జిల్లాలోని పలు ఆహార వ్యాపార సంస్థలపై ఆహార భద్రత శాఖ ప్రత్యేక తనిఖీలు నిర్వహించింది. బ్రెడ్ తయారీలో పరిశుభ్రత పాటించడం లేదని అందిన ఫిర్యాదు మేరకు బేకరీని తనిఖీ చేయగా, విక్రయానికి ఉంచిన బ్రెడ్‌పై ఫంగస్ పెరిగి ఉండటం గుర్తించబడింది. అదేవిధంగా, ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం, 2006 ప్రకారం తప్పనిసరిగా పొందవలసిన FSSAI నమోదు/లైసెన్స్ లేకుండానే బేకరీ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు.

దీంతో అవసరమైన FSSAI నమోదు/లైసెన్స్ పొందే వరకు మరియు ఆహార భద్రత నిబంధనలను పూర్తిగా పాటించే వరకు బేకరీ కార్యకలాపాలను తక్షణమే నిలిపివేయాలని ఆదేశించారు. సంబంధిత చట్టపరమైన చర్యలు ప్రారంభించబడ్డాయి. గత తనిఖీలో జారీ చేసిన ఆదేశాల అమలును పరిశీలించేందుకు ఫాలో–అప్ తనిఖీ నిర్వహించబడింది. తనిఖీలో కృత్రిమ ఆహార రంగుల వినియోగాన్ని నిలిపివేసినట్లు గుర్తించబడింది. అయితే, రెస్టారెంట్‌లో ఇంకా పచ్చి గుడ్లతో తయారు చేసిన మయోనైస్‌ను తయారు చేసి వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ఇది ప్రజారోగ్యానికి హానికరమయ్యే అవకాశం ఉన్నందున వంటగదిలో ఉన్న సుమారు 3 కిలోల పచ్చి గుడ్ల మయోనైస్‌ను అక్కడికక్కడే పారవేయించి, వెంటనే దాని తయారీ మరియు వినియోగాన్ని నిలిపివేయాలని ఆహార వ్యాపార నిర్వాహకుడిని ఆదేశించారు. నిబంధనలు పాటించని పక్షంలో తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి.

రెస్టారెంట్ అత్యంత అపరిశుభ్రమైన పరిస్థితుల్లో నిర్వహించబడుతున్నట్లు గుర్తించబడింది. డ్రైనేజీ వ్యవస్థ మూసుకుపోవడంతో వంటగదిలో నీరు నిల్వ ఉండటం, అధిక సంఖ్యలో ఈగలు సంచరించడం గమనించబడింది. వంట చేసే ప్రదేశం చుట్టూ కూడా నీరు నిల్వ ఉండటం వల్ల, ముఖ్యంగా వర్షాకాలంలో ఆహారం కలుషితమయ్యే ప్రమాదం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం, 2006 ప్రకారం పరిశుభ్రత ప్రమాణాలను వెంటనే అమలు చేయాలని మరియు లోపాలను సరిదిద్దాలని ఆహార వ్యాపార నిర్వాహకుడిని ఆదేశించారు. సంబంధిత అమలు చర్యలు ప్రారంభించబడ్డాయి. ఆహార భద్రత నిబంధనలను ఉల్లంఘించే ఆహార వ్యాపార సంస్థలపై కఠినమైన చర్యలు కొనసాగుతాయని ఆహార భద్రత శాఖ స్పష్టం చేసింది. ప్రజారోగ్య పరిరక్షణ మరియు వినియోగదారులకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందుబాటులో ఉండేలా పెద్దపల్లి జిల్లాలో తనిఖీలు మరియు అమలు చర్యలు నిరంతరం కొనసాగుతాయి.

## మోహన్ రావు పేట గ్రామంలో ఫార్మ్ పాండ్ నిర్మాణ పనుల పరిశీలన...

**కోరుట్ల సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)**



కోరుట్ల మండలం మోహన్ రావు పేట గ్రామంలో జరుగుతున్న ఫార్మ్ పాండ్ నిర్మాణ పనులను గురువారం ఎంపీడీఓ రామకృష్ణ పరిశీలించారు పనుల పురోగతిని నాణ్యతను పరిశీలించి రైతులకు ఉపయోగకరంగా ఉండేలా పనులను నిర్ణీత ప్రమాణాల ప్రకారం త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సరికెళ్ళ లతిక నరేష్ ఉప సర్పంచ్ జాన వెంకటేష్ కార్యదర్శి నర్సారెడ్డి ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## బోర్ వెల్ రీచార్జ్ పిట్‌కు భూమిపూజ

**కోరుట్ల సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)**



కోరుట్ల మండలం మోహన్ రావు పేట గ్రామంలో బోర్‌వెల్ రీచార్జ్ పిట్ నిర్మాణ పనులకు కొరుట్ల ఎంపీడీఓ రామకృష్ణ చేతుల మీదుగా భూమిపూజ చేపట్టారు ఈ సందర్భంగా భూగర్భ జలాల సంరక్షణ నీటి నిల్వలు పెంపొందించడం బోర్ వెల్ లను రీచార్జ్ చేయడం ద్వారా నీటి వనరులను పరిరక్షించుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు నీటిని ఒడిసిపట్టి... భవిష్యత్ తరాలకు భద్రపరుద్దాం... ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సరికల్ల లతిక నరేష్ ఉపసర్పంచ్ జానా వెంకటేష్ పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి పాల్గొన్నారు.

# గణేశ్ ఉత్సవాలకు సమన్వయంతో ఏర్పాట్లు

- **మండపాల నిర్వాహకులు పోలీస్, విద్యుత్ శాఖ వద్ద వివరాలు నమోదు చేసుకోవాలి**
- **కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి) :**

గణేశ్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వినాయక చవితి ఏర్పాట్లపై ఎస్పీ మహేష్ బి. గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల అధికారులతో కలిసి గురువారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా మున్సిపల్, పోలీస్, విద్యుత్, మత్స్య, రవాణా, ఆర్అండ్‌బీ, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో నిమజ్జనానికి అవసరమైన క్రేన్లు, జేసీబీలు, విద్యుత్ దీపాలు, నీటి సదుపాయాలను సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మండపాల వద్ద డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జన మార్గాల్లో విద్యుత్ తీగల వల్ల ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎన్పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసి సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. మండపాల నిర్వాహకులు తమ వివరాలను విద్యుత్ శాఖ వద్ద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తెలిపారు.

**24 గంటలూ అంబులెన్స్‌లు, మందులు**

సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధితో పాటు గ్రామ పంచాయతీల్లో నిమజ్జనం సందర్భంగా చెరువుల వద్ద అందుబాటులో ఉంచాలని మత్స్యశాఖ అధికారులకు సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 24 గంటలూ అంబులెన్స్‌లు, మందులు, ప్రథమ చికిత్స కిట్లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. సిరిసిల్ల జీజీహెచ్, వేములవాడ ఏరియా ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు సమన్వయంతో భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, నిమజ్జనం సజావుగా జరిగేలా రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. విగ్రహాలు వెళ్లే మార్గాల్లో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో బారికేడింగ్, లైటింగ్, క్రేన్లను ముందుగానే సిద్ధం చేయాలని తెలిపారు. నిమజ్జనం అనంతరం రెండు, మూడు రోజులపాటు వార్డులు, గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సిరిసిల్ల, వేములవాడ డివిజన్లతో పాటు మండల స్థాయిలో ఆర్డీవోలు, తహసీల్దార్లు వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఉత్సవాల ప్రారంభం నుంచి నిమజ్జనం వరకు చేపట్టాల్సిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు.

**వివరాల నమోదు తప్పనిసరి..**

జిల్లాలోని గణేశ్ మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. నిమజ్జనం రోజున నిర్ణీత సమయానికి విగ్రహాలను తరలించాలని కోరారు. ప్రతి మండపం వద్ద ప్లాస్టిక్ డ్రమ్‌లలో నీరు, ఇసుక అందుబాటులో ఉంచాలని సూచించారు.మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, వారికి ఎలాంటి ఇబ్బంది కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.



ఈ సమావేశంలో ఆర్డీవోలు శ్రీధర్‌బాబు, కేఎస్‌బీ కుమారి, డీఎస్పీలు నాగేంద్రాచారి, శ్రీనివాసులు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్, ఎక్సైజ్ అధికారి హిమశ్రీ, అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, ఈఈ పీఆర్ సుదర్శన్‌రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారి దయాకర్, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గణేష్ ఆగమనం వేడుకలకు ఏర్పాట్లు...

**జగిత్యాల సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)**



జగిత్యాల పట్టణ కృష్ణనగర్ లోని రావణ యూత్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 13న శ్రీ గణేష్ ఆగమనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు ఈ సందర్భంగా భక్తులు యువత పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాధుని ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు అలాగే త్రిశూల్స్ యూత్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 11న.వాణినగర్ లో శ్రీ గణేష్ ఆగమనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు భక్తిశ్రద్ధలతో జరిగే ఈ వేడుకకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు ఆహ్వానించారు గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖశాంతులు ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ ఈ పవిత్ర వేడుకను విజయవంతం చేయాలని రావణ యూత్ త్రిశూల్స్ యూత్ సభ్యులు కోరారు.

## గణేష్ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి



**మంథని, సెప్టెంబర్ 10: వుదయం ప్రతినిధి:**

గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో మంథని పోలీస్‌స్టేషన్ పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులతో ఎస్ఐ, సీఐ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి తహసీల్దార్, మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు హాజరయ్యారు. ప్రతి గణేష్ మండపం, ఊరేగింపునకు సంబంధించిన సమాచారాన్ని పోలీస్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అనుమతించిన డిస్కం విద్యుత్ కనెక్షన్ మాత్రమే వినియోగించాలని, విద్యుత్ హుకింగ్‌కు పాల్పడవద్దని హెచ్చరించారు. మండపాల వద్ద అగ్నిప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మండపంలో రెండు బాక్స్ స్పీకర్లు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని, రాత్రి 10 గంటల తర్వాత లౌడ్‌స్పీకర్లు వినియోగించరాదని సూచించారు. కనీసం ముగ్గురు వాలంటీర్లు అందుబాటులో ఉండాలని, వారి పేర్లను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, సీసీ కెమెరాలతో పాటు పవర్ బ్యాకప్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

## కోరుట్లలో ఈఎస్ఐ సేవలను వినియోగించుకోండి

**తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగారావు**

**కోరుట్ల సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)**



కోరుట్ల పట్టణంలో ఈఎస్ఐ సేవలు అందుబాటులోకి రానున్నాయని కావున కోరుట్ల నియోజకవర్గ ప్రజలందరూ ఇట్టి సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగారావు తెలిపారు ఈ సందర్భంగా కోరుట్ల పట్టణ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరుట్ల నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందంటే స్వర్గీయ జువ్వాడి రత్నాకర్ రావు చేసిన అభివృద్ధి తప్ప గడచిన పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు స్వర్గీయ జువ్వాడి రత్నాకర్ రావు కోరుట్ల పట్టణంలో వెటర్నరీ కళాశాల పాలిటెక్నిక్ కళాశాల ఫిల్టర్ బెడ్ నూతన మున్సిపల్ భవన నిర్మాణం సుమారు 5 వేల ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేయడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మళ్లీ కోరుట్ల నియోజకవర్గానికి ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ ఆస్పత్రిని ఏర్పాటు చేయడం జరుగుతుందని అర్హులైన ప్రతి ఒక్కరూ కూడా ఇట్టి సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారుకాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కోరుట్ల నియోజకవర్గానికి ఇప్పటివరకు 7 కోట్ల 51 లక్షల ముఖ్యమంత్రి సహాయం ద్వారా అందజేయడం జరిగిందని అలాగే ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలు అందజేయడం ద్వారా ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు చేపట్టుకుంటున్నారన్నారు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రైతు భరోసా 21 వేల కోట్ల రూపాయల రైతు రుణమాఫీ చేయడం జరిగిందన్నారు ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో ఎవరైనా డబ్బులు అడుగుతే తమ దృష్టికి తీసుకొస్తే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు కోరుట్ల నియోజకవర్గం లోని ఆర్ అండ్ బి రోడ్ల అభివృద్ధి కోసం 80 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరడం జరిగిందని ఎందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుకు కృషి చేసిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మంత్రి వివేక్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లకు కోరుట్ల నియోజకవర్గం పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని జువ్వాడి నర్సింగరావు తెలిపారు ఈ సమావేశంలో కోరుట్ల మున్సిపల్ చైర్పర్సన్ తిరుమల వసంత గంగాధర్ వైస్ చైర్మన్ షాహిద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పన్నాల అంజిరెడ్డి మాజీ అధ్యక్షులు కొంతం రాజం కోరుట్ల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి నాయకులు అన్న అనిల్ పుప్పాల ప్రభాకర్ పేరు సత్యనారాయణ వివిధ గ్రామాల సర్పంచులు కౌన్సిలర్లు కోఆప్షన్ కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉచిత అవగాహన సదస్సు

**సిరిసిల్లలో శనివారం నిర్వహణ**

**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిది) :**



ఎస్ఐ, కానిస్టేబుల్ తదితర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని లహరి బ్రాంకెట్ హాల్‌లో ఉదయం 8.30 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.ఇప్పటికే పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థులు సదస్సుకు హాజరు కావాలని సూచించారు. పరీక్షలకు సమర్థవంతంగా సన్నద్ధమయ్యేందుకు అవసరమైన అంశాలపై నిపుణులతో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. స్ట్రెస్ మేనేజ్‌మెంట్, సబ్జెక్టుల వారీగా శిక్షణ, పరీక్షల విధానం, సమయపాలన తదితర అంశాలపై సూచనలు అందించనున్నట్లు వెల్లడించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు.



## ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

**వేములవాడ, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి) :**

అన్యాయం, భూస్వామ్య దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ త్యాగం చిరస్మరణీయమని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం చెక్కపల్లి బస్టాండ్ వద్ద పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ అణగారిన వర్గాలు, పేదల హక్కుల కోసం ఐలమ్మ సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆత్మగౌరవం, హక్కుల కోసం ఆమె చూపిన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్య క్రమ ంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, కౌన్సిలర్ తుము మధు, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు కాంగ్రెస్ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.



## ఐలమ్మకు బీఆర్ఎస్ నేతల నివాళి

**వేములవాడ సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి) :**

తెలంగాణ రైతాంగ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ వర్ధంతి సందర్భంగా వేములవాడ పట్టణంలోని ఆమె విగ్రహానికి గురువారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఐలమ్మ పోరాటాన్ని స్మరించుకున్నారు.ఈకార్యక్రమంలో గోస్కుల రవి, ఏస తిరుపతి, గడ్డం హన్మాండ్లు, మ్యాకల శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, తంపుల సుమన్, విజయ్, వాసాల శ్రీనివాస్, రాజు, అంజయ్య, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.



## మినీ స్టేడియం పరిశీలన

**మెట్ పల్లి సెప్టెంబర్ 10 (వుదయం విలేకరి)**

త్వరలో మెట్ పల్లి మినీ స్టేడియంలో జరిగే జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పలు సౌకర్యాలు కల్పించాలని మెట్పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారం లింబాద్రి ని కలిసిన జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్య రెడ్డి విజ్ఞప్తి మేరకు ఉదయం మున్సిపల్ చైర్మన్ మున్సిపల్ అధికారులు సురేష్ ముజీబ్క తో కలిసి స్టేడియాన్ని పరిశీలించారు త్వరలో జరగనున్న జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ గేమ్స్ తో పాటు మండల స్థాయి పాఠశాల క్రీడోత్సవాలు జిల్లా స్థాయి క్రీడలు నిర్వహించబోతున్నాం కాబట్టి విద్యార్థులకు కావలసిన త్రాగునీటి సదుపాయం ఏర్పాటు చేయాలని కూర్చోవడానికి సిమెంటు బల్లాలు లాంగ్ జంప్ హై జంప్ ఫీట్ ను ఇసుక ద్వారా సరి చేయాలని అలాగే 200 మీటర్ల ట్రాక్ రన్నింగ్ కొరకు మైదానాన్ని బ్లేడ్ ద్వారా స్థలాన్ని సరి చేయాలని అలాగే గుర్తుతెలియని వ్యక్తులు స్టేడియంలో రాత్రిపూట ప్రవేశించి ప్రవల్లింగ్ బిల్డింగును ధ్వంసం చేస్తున్నారని స్టేడియంలో వాచ్మెన్ ను పర్మినెంట్ గా నియమించాలని చైర్మన్ దృష్టికి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్య రెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు రాందాసు కోరారు ఈకార్యక్రమంలో ఆల్ రౌండర్ గంగాధర్ కార్తీక్ కౌన్సిలర్లు బత్తుల నరేష్ మాసుల ప్రవీణ్ విద్యార్థుల తల్లిదండ్రులు మల్లికార్జున్ వెంకటేశ్వర్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 9వ రాష్ట్రీయ పోషణ్ మాసం విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో పని చేయాలి




**పోషణ్ మాసం పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్**

**జగిత్యాల సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలో 9వ పోషణ్ మాసం – 2026 కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు పోషణ్ మాసం కార్యక్రమాల నిర్వహణలో భాగంగా గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంబంధిత లైన్ డిపార్ట్‌మెంట్ల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో పోషణ్ మాసం సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు వివిధ శాఖల భాగస్వామ్యం ప్రజల్లో పోషకాహారం ఆరోగ్యం చిన్నారుల సంరక్షణపై అవగాహన కల్పించే కార్యక్రమాలపై చర్చించారు

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సంబంధిత శాఖల అధికారులతో కలిసి 9వ పోషణ్ మాసం – 2026 పోస్టర్‌ను ఆవిష్కరించారు పోషణ్ మాసం కార్యక్రమాల ద్వారా గర్భిణీలు బాలింతలు చిన్నారులు తల్లిదండ్రుల్లో పోషకాహారం ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు బాలల సంరక్షణ అంగన్వాడీ సేవలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు 9 9 2026 నుండి 8 10 2026 వరకు నిర్వహించనున్న పోషణ్ మాసం కార్యక్రమాల్లో భాగంగా పోషణ్ మేళాలు పోషకాహార వంటకాల ప్రదర్శనలు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన అంగన్వాడీ కేంద్రాల ద్వారా వివిధ అవగాహన కార్యక్రమాలు తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు పోషణ్ మాసం కార్యక్రమాలను కేవలం మహిళా శిశు సంక్షేమ శాఖకే పరిమితం చేయకుండా అన్ని శాఖల సమన్వయంతో ప్రజలకు మరింత చేరువగా నిర్వహించాలని అధికారులు తెలిపారు ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు డిఆర్డిఓ రఘు వరన్ డీపీఓ మదన్ మోహన్ మెప్మా పీడీ శ్రీనివాస్ మున్సిపల్ కమిషన్ స్వచ్ఛ ప్రణవ్ డియంహెచ్ఓ సిబ్బంది శాఖల సమన్వయంతో ప్రజలకు మరింత చేరువగా నిర్వహించాలని అధికారులు తెలిపారు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ ఆడెపు భాస్కర్ సీడీపీఓ జయప్రద పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ మధు కుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం కీలకం

**"దివ్యాంగులు" అనే పదం కంటే "ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన పిల్లలు" అని ప్రోత్సహించాలి: అదనపు కలెక్టర్ (రెవెన్యూ )బి. శ్రీరాములు**

**పెద్దపల్లి, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)**




శిక్షణ, జిల్లా విద్యాశాఖ మరియు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు (Children with Special Needs – CWSN) విద్యార్థుల తల్లిదండ్రుల కోసం జిల్లా స్థాయి Sensitisation కార్యక్రమం గురువారం పెద్దపల్లిలోని శ్రీనివాస గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ ) బి.శ్రీరాములు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల సమగ్ర అభివృద్ధి, విద్య, ఆరోగ్యం మరియు భవిష్యత్ అవకాశాల కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. CWSN విద్యార్థులను కేవలం "దివ్యాంగులు" అని పిలవడం కంటే, వారిలో ఉన్న ప్రత్యేక నైపుణ్యాలను గుర్తించి, ప్రోత్సహించి, వారి ప్రతిభను వెలికితీయడం సముచితమని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై నమ్మకంతో, ప్రేమతో, ప్రోత్సాహంతో ముందుకు నడిపించాలని సూచించారు.

వైకల్యాన్ని అధిగమించి స్ఫూర్తిగా నిలిచిన అంజారెడ్డి కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న శ్రీ అంజారెడ్డి తన జీవిత అనుభవాలను పంచుకున్నారు. సుమారు 25 సంవత్సరాల క్రితం జరిగిన ప్రమాదంలో రెండు కాళ్లను కోల్పోయినప్పటికీ, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగిన తన ప్రయాణాన్ని వివరించారు. ఆయన అందించిన ప్రేరణాత్మక సందేశం CWSN విద్యార్థుల తల్లిదండ్రులకు దిక్సూచిగా నిలిచింది. డా. మధుసూదన్ రెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపల్, SRR కళాశాల మాట్లాడుతూ, దివ్యాంగులైన అనేక మంది అధ్యాపకులు తమ ప్రతిభతో ఉన్నతంగా రాణించి, వేలాది మంది విద్యార్థులకు విద్యా బోధన చేసిన అనుభవాలను పంచుకున్నారు. సరైన అవకాశాలు, ప్రోత్సాహం అందిస్తే CWSN విద్యార్థులు కూడా సమాజంలో గొప్ప విజయాలు సాధించగలరని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన హరిబాబు (NGO ప్రతినిధి )మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల జీవితంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ప్రేమ, సంరక్షణ, ప్రోత్సాహం మరియు అండదండల వల్లే పిల్లలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగగలరని వివరించారు. CWSN పిల్లల శారీరక, మానసిక వికాసంపై సూచనలు

డా. ఏ. జగదీష్, సీనియర్ కన్సల్టెంట్ – నియోనేటల్ & పీడియాట్రిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ (న్యూరో డెవలప్‌మెంటల్ డిజెబిలిటీస్), డెవలప్‌మెంటల్ పీడియాట్రిక్స్, హెచ్ఓడీ – DHC, అపోలో హాస్పిటల్స్, హైదరాబాద్, CWSN పిల్లల శారీరక, మానసిక మరియు న్యూరో డెవలప్‌మెంటల్ వికాసానికి అవసరమైన అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లల అభివృద్ధిలో ప్రారంభ దశలోనే సరైన గుర్తింపు, చికిత్స, శిక్షణ మరియు నిరంతర పర్యవేక్షణ ఎంతో ముఖ్యమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐ.ఈ. కోఆర్డినేటర్ శ్రీమతి జి. కవిత, ప్లానింగ్ కోఆర్డినేటర్ చేపూరి మల్లేష్ గౌడ్, డా. మధుసూదన్ రెడ్డి, డా. ఏ. జగదీష్, హరిబాబు, మండల విద్యాధికారులు, CWSN విద్యార్థుల తల్లిదండ్రులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు బీఆర్ఎస్ నేత పరామర్శ

**వేములవాడ, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి) :**



మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లెలో ఇటీవల మృతిచెందిన తెంబరవేణి అంజవ్వ భౌతికకాయానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి నివాళులర్పించారు.అనంతరం వేములవాడకు చెందిన సాగరం వెంకటస్వామి తల్లి సాగరం రామలక్ష్మి మృతిచెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట వాసాల శ్రీనివాస్, సతీష్‌రెడ్డి, ఐత వెంకటేశం, ప్రకాష్, సాయి గౌడ్, రాము గౌడ్, చందనం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మౌనం వీడండి.. మనోధైర్యంతో ముందుకు సాగండి

**కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబరు 10 (వుదయం ప్రతినిధి) :**



మానసిక ఒత్తిడి, సమస్యలతో బాధపడే వారు మనోధైర్యంతో ముందుకు సాగాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఆత్మ హత్యల నివారణ దినం సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో టెలి-మానస్ (14416) పోస్టర్లను కలెక్టర్, ఎస్పీ మహేష్ బి. గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఎంహెచ్ఓ పెంజెర ఆల్విన్‌తో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆత్మహత్యల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. యువత, విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మానసిక వైద్య సేవలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. టెలి-మానస్ 14416 ద్వారా 24 గంటలూ సేవలు పొందవచ్చని పేర్కొన్నారు.మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి కుటుంబ సభ్యులు, సమాజం అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నయీమా జహా, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

- **జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్**
- **రీ-సర్వే నక్షత్ర యు ఎల్ బి పురోగతిపై కలెక్టర్ సమీక్ష**

**జగిత్యాల సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)**

నాన్ క్యాడస్ట్రల్ క్యాడస్ట్రల్ గ్రామాల రీ-సర్వే ప్రక్రియతో పాటు నక్షత్ర యు ఎల్ బి పురోగతిపై జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ గురువారం జగిత్యాల కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లాలో నాన్ క్యాడస్ట్రల్ క్యాడస్ట్రల్ జిల్లాల్లో కొనసాగుతున్న రీ-సర్వే పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు గ్రామాల వారీగా ఇప్పటివరకు పూర్తయిన సర్వే పనులు పెండింగ్‌లో ఉన్న పనులు క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న సమస్యలు వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై వివరాలను సమీక్షించారు రీ-సర్వే ప్రక్రియను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా ఖచ్చితత్వంతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు సర్వేకు సంబంధించిన ఫీల్డ్ రిజిస్టర్లు ప్రోగ్రెస్ వివరాలు ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సూచించారు డిజిటల్ పద్ధతిలో పని చేస్తున్న సర్వే సిబ్బంది నుంచి ప్రతిరోజూ ప్రగతి వివరాలను సేకరించి సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు ప్రస్తుతం ఉన్న స్ప్రెడ్‌షీట్‌లోని వివరాలను పూర్తిగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా తాజా ప్రగతిని నమోదు చేయాలని సూచించారు అలాగే పట్టణ ప్రాంతాల్లో అమలు చేస్తున్న నక్షత్ర యు ఎల్ బి కార్యక్రమం పురోగతిని నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగవంతం చేసి సంబంధిత రికార్డులు డేటాను కచ్చితంగా అప్‌డేట్ చేయాలని అధికారులకు సూచించారు క్షేత్ర స్థాయిలో సర్వే పనుల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బంది తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ నిర్ణీత గడువులో పనులను పూర్తి చేయాలని కలెక్టర్ బి సత్యప్రసాద్ స్పష్టం చేశారు అదే విధంగా



సర్వే కోసం అవసరమైన పరికరాలను త్వరలో కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత సర్వే ఎడి కిషన్ ప్రసాద్ సంబంధిత అధికారులు డిప్యూటీ ఇన్స్పెక్టర్లు సర్వే సిబ్బంది లైసెన్స్డ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

## వృద్ధుల ఆత్మ హత్యలపై విచారణ జరపాలి

**సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు**
**హరి అశోక్ కుమార్**
**జగిత్యాల సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)**



రాష్ట్రంలో వృద్ధులు ఎక్కడ ఆత్మ హత్యలు చేసుకున్నా వారి మృతి పట్ల విచారణ జరిపించాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ప్రభుత్వంను కోరారు గురువారం జిల్లా కేంద్రంలో అసోసియేషన్ కౌన్సిలింగ్ కేంద్రంలో "ప్రపంచ ఆత్మ హత్యల నివారణ దినం " సందర్భంగా జిల్లా స్థాయిలో పిల్లల వేధింపులు అభద్రత నివారణ చర్యలు అనే అంశాలపై అవగాహన సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో కొడుకులు కూతుర్లు బలవంతంగా వారి తల్లి దండ్రుల ఆస్తులను తమ పేర్ల పై రిజిస్ట్రేషన్ చేసుకొని సైతం వారి పోషణ పట్టించుకోకపోవడం వంటి విపరీత ధోరణులు కన్పిస్తున్నాయన్నారు అలాంటి పరిస్థితుల్లో కొందరు ఆత్మ హత్యల వంటి భాదాకర నిర్ణయాలు తీసుకుంటున్నారని మరి కొందరు ఆర్థిక అనారోగ్య సమస్యలతో తీరని అభద్రతకు లోనవుతున్నారని నివారించడానికి వృద్ధాప్యంలో తల్లి దండ్రులను ఆదరిస్తూ పోషిస్తూ జాగ్రత్తగా చూసుకోవడం వారి కొడుకులు కోడళ్ళు కూతుర్లు వారసుల పవిత్ర కర్తవ్యమన్నారు జిల్లాలో నిరాధరణకు గురవుతున్న వృద్ధ తల్లి దండ్రులు తమ అసోసియేషన్ ను ఆశ్రయిస్తున్నారని వారి పిల్లలకు చట్టం శిక్షలు చెబుతూ కౌన్సిలింగ్ ఇస్తే ఆదరిస్తున్నారని వినని వారిపై ట్రిబ్యునల్స్ లో కేసులు వేయిస్తు పరిష్కారం కు కృషి చేస్తున్నామన్నారు సీనియర్ సిటిజన్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంకు రాష్ట్ర స్థాయిలో సీనియర్ సిటిజన్స్ కమిషన్ ఏర్పాటు చేయాలని.భలో పేతమైన ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం తోపాటు చట్టంలో ప్రయోజన సవరణలు చేయాలని తమ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి నర్సింహారావు ఎమ్మెల్సీ కోదండ రాంల ఆధ్వర్యంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పిసి హన్మంత్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు ఉపాధ్యక్షులు బొల్లం విజయ్ ఎండి యాకుబ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కే సత్యనారాయణ సంయుక్త కార్యదర్శి నాయిని సంజీవ రావు ధర్మపురి అధ్యక్షులు కండ్ల గంగాదర్ పెన్షనర్ల యువజన మహిళా విద్యార్థి జేఏసీ ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణ అమావాస్య అన్నప్రసాద వితరణ సేవ

**కోరుట్ల సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)**



సనాతన ధర్మ ప్రచార సమితి వారి ఆధ్వర్యంలో శ్రీ శివ మార్కండేయ కోటి నవదుర్గ దేవాలయం పద్మశాలి సంఘం ఆవరణలో గురువారం అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన అన్నపూర్ణ అమావాస్య అన్నప్రసాద వితరణ సేవ భక్తిశ్రద్ధలతో విజయవంతంగా జరిగింది అర్చకులు శ్రీధర్ శర్మ వైదిక నిర్వహణలో ముందుగా సామూహిక గోపూజ అన్నపూర్ణ మాత పూజ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టగా సుమారు 900 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు కోరుట్ల పట్టణంలో ప్రతి అమావాస్య నాడు పితృదేవతల ప్రీత్యర్థం లోక కల్యాణం కోసం అన్నపూర్ణ అమావాస్య అన్న ప్రసాద వితరణ వాట్సాప్ గ్రూప్ సభ్యుల సహకారంతో సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో గత 14 నెలలుగా నిరంతరాయంగా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు ఈ కార్యక్రమంలో మరో విశేషంగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించారు అన్నప్రసాద వితరణకు స్టీల్ ప్లేట్లు స్టీల్ గ్లాసులు మాత్రమే ఉపయోగించి పర్యావరణ హితమైన సందేశాన్ని సమాజానికి అందించారు ఈ కార్యక్రమంలో సనాతన ధర్మ ప్రచార సమితి ప్రధాన కార్యదర్శి బట్టు హరిక్రిష్ణ కోశాధికారి రేగుంట రాజారాం ప్రోగ్రాం కమిటీ చైర్మన్ వనపర్తి చంద్ర మోహన్ కన్వీనర్ గంప శివ కుమార్ ట్రెజరర్ మంచాల రమేష్ శివ మార్కండేయ కోటి నవదుర్గ ఆలయ కమిటీ అధ్యక్షులు జిల్లా ధనుంజయ్ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి బండ్ల రవికుమార్ ఆడెపు నరేష్ రుద్ర సుధాకర్ అన్నపూర్ణ అమావాస్య అన్న ప్రసాద సేవ కమిటీ సభ్యులు మంచాల రాజలింగం అందె శివ ప్రసాద్ శ్రీపతి రమేష్ కట్కం రంజిత్ పల్లెర్ల మహేందర్ కంటం సదాశివ కొండ బత్తిని అనంత క్రిష్ణ ప్రసాద్ ఆధ్యాత్మిక సేవకులు రాచమడుగు శ్రీనివాస్ రావ్ అడువాల ప్రభాకర్ సంపేట మల్లయ్య ఎలిమిల్ల రాం నారాయణ ఓటారికారి చిన్న రాజన్న కొత్త గణేష్ చెన్న రవి కమటాల భాస్కర్ ఆడెపు వినోద్ గోనె సదానంద్ నేత గుంటుక రవి శంకర్ అల్లాడి ప్రవీణ్ గ్యాద సాయి గుంటుక సురేష్ బాబు ఎల్లంకి శ్రీధర్ గుడిసె కోటేష్ ఏనుగందుల రాజేంద్ర ప్రసాద్ తాటికొండ కృష్ణ ప్రహ్లాద్ మహిళా సభ్యులు వనపర్తి రమ్య గంప రమాదేవి రేగుంట విజయ గుంటుక జ్యోతి తదితరులు పాల్గొన్నారు ఈ సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించిన దాతలు వాట్సాప్ గ్రూప్ సభ్యులు సేవాకార్యకర్తలు భక్తులు పట్టణ ప్రజలందరికీ నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు.

## అటవీ సంపద వన్యప్రాణుల రక్షణకు చర్యలు




**జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్**
**జగిత్యాల సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలో అటవీ సంపద వన్యప్రాణుల రక్షణకు పోలీస్ అటవీ శాఖలు పరస్పర సమన్వయంతో మరింత సమర్థవంతంగా పని చేయాలని జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్‌కుమార్ సూచించారు గురువారం జిల్లా పోలీస్ ప్రదాన కార్యాలయంలో పోలీస్ అటవీ శాఖల అధికారులతో నిర్వహించిన కోఆర్డినేషన్ సమావేశంలో జిల్లాలో అటవీ పరిరక్షణకు సంబంధించి చేపడుతున్న చర్యలు ఇరు శాఖలు ఎదుర్కొంటున్న సమస్యలు పరస్పర సహకారం అవసరమైన అంశాలపై ఎస్పీ సమీక్ష నిర్వహించారు అటవీ ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ కార్యకలాపాలు అక్రమ కలప రవాణా వన్యప్రాణుల వేట అటవీ భూముల ఆక్రమణ తదితర అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అటవీ భూములు ఆక్రమణ అక్రమ కలప రవాణా వన్యప్రాణుల వేటను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని అధికారులకు సూచించారు అటవీ ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు వాహనాల కదలికలపై నిఘా పెంచాలని అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులపై సమాచారాన్ని సేకరించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు అవసరమైన ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేయడంతో పాటు అటవీ శాఖకు అందుబాటులో ఉన్న సమాచారాన్ని పోలీస్ శాఖతో పంచుకోవాలని సూచించారు అటవీ భూముల ఆక్రమణకు సంబంధించిన అంశాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ పేర్కొన్నారు అటవీ భూముల్లో అనధికారికంగా చేపడుతున్న కార్యకలాపాలను గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో వాటిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా వేటగాళ్ల కదలికలపై నిఘా పెంచాలని అటవీ ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల ప్రజలతో సమన్వయం చేసుకుని అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం సేకరించాలని తెలిపారు అటవీ ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వన్యప్రాణుల వేట కలప అక్రమ రవాణా అటవీ భూముల ఆక్రమణ వల్ల కలిగే నష్టాలపై వివరించాలని సూచించారు ఈ సమావేశంలో అదనపు ఎస్పి చేతన్ నితిన్ డిఎఫ్ఓ రవి ప్రసాద్ డిఎస్పి రాములు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లు సిఐలు ఎస్ఐ లు పాల్గొన్నారు

## 276 చెరువుల డి-మార్కింగ్ ప్రక్రియను ఈ నెల 30లోగా పూర్తి చేయాలి



**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత**
**జగిత్యాల సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)**

సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా నుంచి అందిన ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లాలోని 276 చెరువుల డి-మార్కింగ్ ప్రక్రియను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చేపట్టి ఈ నెల 30వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత అధికారులను ఆదేశించారు గురువారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత ఆధ్వర్యంలో 276 చెరువుల డి-మార్కింగ్ సంబంధిత వివరాల సేకరణ మ్యాపింగ్ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 276 చెరువులకు సంబంధించి డి-మార్కింగ్ ప్రక్రియను క్షేత్ర స్థాయిలో సమగ్రంగా చేపట్టాలని సూచించారు ప్రతి చెరువుకు సంబంధించిన హద్దులు విస్తీర్ణం భౌగోళిక స్థితి సంబంధిత భూముల వివరాలను పక్కాగా పరిశీలించి నమోదు చేయాలని తెలిపారు ఈ ప్రక్రియలో ఇరిగేషన్ ఫిషరీస్ రెవెన్యూ ఫారెస్ట్ అగ్రికల్చర్ తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు ఆయా శాఖలకు సంబంధించిన సమాచారాన్ని పరస్పరం సమన్వయం చేసుకుంటూ ఎలాంటి వ్యత్యాసాలకు తావులేకుండా పూర్తి వివరాలను సిద్ధం చేయాలని సూచించారు చెరువుల హద్దుల నిర్ధారణలో భాగంగా క్షేత్ర స్థాయి పరిశీలనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అవసరమైన మ్యాపింగ్ భౌగోళిక వివరాలను సేకరించాలని తెలిపారు ప్రతి చెరువుకు సంబంధించిన వివరాలు ఖచ్చితంగా ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు డి-మార్కింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం సేకరించిన పూర్తి సమాచారాన్ని కేయంఎల్ సంబంధిత ఫార్మాట్‌లో సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు నిర్దేశించిన గడువులోగా ప్రక్రియ పూర్తయ్యేలా అధికారులు కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలని తెలిపారు ఈ నెల 30వ తేదీలోగా జిల్లాలోని మొత్తం 276 చెరువుల డి-మార్కింగ్ ప్రక్రియను పూర్తి చేసి, సంబంధిత కేయంఎల్ ఫార్మాట్‌లో పూర్తి వివరాలను సమర్పించాల్సిందేనని స్పష్టం చేశారు చెరువుల హద్దుల పరిరక్షణ భవిష్యత్‌లో చెరువుల ఆక్రమణలకు అడ్డుకట్ట వేయడం వాటి వివరాలను పకడ్బందీగా నమోదు చేయడం వంటి అంశాల దృష్ట్యా ఈ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని అధికారులకు సూచించారు ప్రతి శాఖకు సంబంధించిన బాధ్యతలను స్పష్టంగా నిర్వర్తిస్తూ అవసరమైన సమాచారాన్ని నిర్ణీత సమయంలో అందించాలని తెలిపారు క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు ఈ

సమావేశంలో ఇరిగేషన్ ఫిషరీస్ రెవెన్యూ ఫారెస్ట్ అగ్రికల్చర్ తదితర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## బీసీలు బానిసత్వాన్ని విడిచి విముక్తి ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలి

**విశ్రాంత ప్రొఫెసర్ జాతీయ జ్యోతిరావు పూలే సత్యశోధక సమాజం అధ్యక్షులు కే మురళి మనోహర్**
**పెద్దపల్లి, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)**



ఓబిసిల సామాజిక అభివృద్ధికి కేంద్రం అడ్డుకుంటుందని జనగణలలో కుల గణన చేస్తే కేంద్రం రాజ్యాధికారం వదులుకోవాల్సి వస్తుంద నే భయంతో ఓబీసీల వాటా తేల్చకుండా అడ్డుకుంటున్నారని కాకతీయ యూనివర్సిటీ విశ్రాంతి ప్రొఫెసర్ జాతీయ జ్యోతిరావు పూలే సత్యశోధక అధ్యక్షులు కే మురళి మనోహర్ మరియు ప్రొఫెసర్ తిరునగరి శేషు లు అభిప్రాయపడ్డారు. గురువారం పెద్దపల్లిలో బహుజన ప్రజాస్వామిక వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు తాడూరి శ్రీమన్నారాయణ అధ్యక్షతన జరిగిన ఓబీసీల రౌండ్ టేబుల్ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై జనగణలలో కులగనన మరియు భవిష్యత్తు బిసి ఉద్యమ కార్యచరణ పై ప్రసంగించారు వెనుకబడిన

వర్గాల వారి లెక్కలు తేల్చకపోవడం వల్ల ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా పారిశ్రామికంగా విద్యాపారంగా ఉద్యోగ పరంగా అనేక రంగాలలో వెనుకబడి పోతున్నామని పేర్కొన్నారు కేంద్రం ఇప్పటికైనా డ్రాప్ డౌన్ పద్ధతిలో కుల గణన చేసి ప్రతి కులానికి క్యాస్ట్ కోడ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు

కుట్రపూరితంగానే ఓబీసీల లెక్కలు తేల్చకుండా కేంద్రం అణచి వేస్తుందని ఆరోపించారు బీసీలు తనకు తాను బానిసత్వంలోకి లొంగిపోతూ రాజ్యాధికారం ఇతరుల చేతిలో పెడుతున్నారని వారు ఆవేదన చెందారు బీసీలు బానిసత్వ భావజాలం విడిచిపెట్టి విముక్తి ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని కోరారు బలమైన బీసీ ఉద్యమ నిర్మాణానికి తెలంగాణ నేల కదులుతుందని భవిష్యత్తు బీసీ ఉద్యమ విస్ఫోటంలో పెద్దపెల్లి జిల్లా ఉద్యమానికి కీలక భాగస్వామ్యం కానుంది ఆశాభావం వ్యక్తం చేశారు తాదూరి శ్రీమన్నారాయణ స్థాపించిన బహుజన ప్రజాస్వామిక వేదిక నిర్మాణాత్మకమైన బీసీ ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని ఆకాంక్షించారు కులాల వైశ్యమ్యాల తో బీసీలు అస్తిత్వాన్ని కోల్పోతున్నారని పేర్కొన్నారు తెలంగాణ ఉద్యమంలో వెనుకబడిన వర్గాల వారి త్యాగాల వల్లనే రాష్ట్రం ఆవిర్భవించిందని తెలిపారు రాష్ట్రంలో 56% ఉన్న బీసీలు రాజ్యాధికారంలో వాటా దక్కే వరకు అస్తిత్వ ఉద్యమాలు చేయవలసిందిగా పిలుపునిచ్చారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అడుగడుగున బీసీలను అణిచివేస్తున్నాయని అన్నారు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆశపడి సామాజిక అభివృద్ధి లేకుండా ఆర్థిక అనిచివేతకు నెట్టు వేయబడుతున్నారని అన్నారు ప్రభుత్వ ఉచిత పథకాలకు ఆశాజీవులుగా బీసీలు నిలిచిపోయారని అన్నారు. జిల్లా స్థాయిలో జరిగిన ఈ సమావేశానికి అనేక బీసీ సంఘాలతో పాటు కుల సంఘాల ప్రతినిధులు విద్యార్థులు ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక రంగాలకు చెందిన బీసీలు పాల్గొని భవిష్యత్తు జన గణనలో కులగలను చేపట్టే వరకు అంకిత భావంతో ఉద్యమం చేస్తామని ఢిల్లీ పీఠం కదిలేలా ప్రజల ఆందోళన చేస్తామని అనేక మంది వక్తలు తెలిపారు.

## స్పీకర్ పై అనిత వ్యాఖ్యలు చేసిన బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీల వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం

**మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బత్తిని సునీల్**
**ఖానాపురం, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):**



అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీలు తాత మధు, శ్రీనివాస్ రెడ్డిలు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బత్తిని సునీల్ తెలిపారు. నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాలనుసారం, ఏఎంసి వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు సలహా సూచన మేరకు మండల కేంద్రంలోని మండల పార్టీ అధ్యక్షుని ఇంటి వద్ద సమావేశం ఏర్పాటు చేసి ముఖ్యఅతిథిగా మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాల్గొని మాట్లాడుతూ అసెంబ్లీ స్పీకర్ ను అవమానపరిచే విధంగా మాట్లాడిన ఎమ్మెల్సీలను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కందిగ రాంబాబు, ప్రధాన కార్యదర్శిలు స్లోగల స్టాలిన్, జాడి వెంకటేష్, ప్రచార కార్యదర్శి మగ్రి దావీదు, కోశాధికారి కందిక యాకయ్య, సహాయ కార్యదర్శి మగ్రి ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు బొక్క బాబు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడికి ఘన సన్మానం

**పెద్దపల్లి, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)**

పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు భూతగడ్డ సంపత్ కు శాలువతో సత్కరించి స్వీట్లు తినిపించారు Swimming మిత్రులు గానబోయిన రాజేందర్, అల్లెంకిప్రకాష్,ఎడ్లా మహేందర్,ఎర్రమ్ భూమయ్యా, బీమోజు సురేందర్,సమ్మిరెడ్డి,కొత్త సత్య నారాయణ,బత్తుల లక్ష్మణ్,బుట్టు రాజు,ఉదయ్ పాల్గొన్నారు.

## కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కృషితో...

**రాజేశ్వరరావుపేటలో శ్మశాన వాటికకు కల్వర్టు నిర్మాణానికి 26 లక్షల రూపాయల నిధులు మంజూరు**

**మెట్ పల్లి**
**సెప్టెంబర్ 10 (వుదయం విలేకరి)**

మెట్‌పల్లి మండలం రాజేశ్వరరావు పేట గ్రామంలో శ్మశాన వాటికకు వెళ్లే రహదారిపై కల్వర్టు నిర్మాణానికి 26 లక్షల రూపాయల నిధులు మంజూరు అయ్యాయని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ప్రజల అవసరాన్ని గుర్తించి జిల్లా కలెక్టర్ కు గతంలో సమర్పించిన వినతిపత్రం మేరకు ఈ నిధులు మంజూరు అయ్యాయన్నారు రాజేశ్వర రావుపేట గ్రామంలోని శ్మశాన వాటికకు వెళ్లే మార్గంలో కల్వర్టు లేకపోవడంతో వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఈ సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ 16 8 2026న జిల్లా కలెక్టర్ కు లేఖ రాసి 26 లక్షల రూపాయల అంచనా వ్యయంతో కల్వర్టు నిర్మాణానికి వి బి జి రామ్ నిధుల కింద వెంటనే మంజూరు చేయాలని కోరారు ఎమ్మెల్యే విజ్ఞప్తిపై అధికారులు చర్యలు చేపట్టి జగిత్యాల జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ 10 9 2026న 26 లక్షల రూపాయలు వ్యయంతో కల్వర్టు నిర్మాణానికి మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు ఈ నిధులు మంజూరు చేయించిన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## పాకాల సరస్సు నిండే వరకు కంటిన్యూషన్ గా మోటార్లను నడిపించాలి

**మాజీ ఏఎంసీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్**



**ఖానాపురం, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):**

పాకాల సరస్సు నిండే వరకు కంటిన్యూషన్ గా మోటార్లను నడిపించాలని మాజీ ఏఎంసీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఏఎంసీ చైర్మన్ మాట్లాడుతూ ప్రస్తుతం పాకాల సరస్సులో 21 ఫీట్ల 6 ఇంచుల నీటిమట్టం ఉండడం పాకాల సరస్సు ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలుపుతూ, ఎలాంటి కారణాలు లేకుండా బుధవారం సాయంత్రం నుండి రామప్ప పంపు హౌస్ వద్ద మోటార్లను ఆఫ్ చేయడం ఎందుకని ఆయన ప్రశ్నిస్తూ, ఇంకా 9 ఫీట్లు నీరు పాకాల సరస్సులోకి వస్తే సరస్సు నిండుకుండలా ఉంటుందని ఆయకట్టు రైతులకు రెండు పంటలకు సరిపడా నీరు సరస్సులో నిలువ ఉంటుందని అలాగే త్రాగునీటికి, సాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండదని ప్రస్తుత పరిస్థితుల్లో వర్షాలు పడతాయో పడయో తెలియని పరిస్థితి ఎదురవుతుందని తెలుపుతూ, ప్రస్తుతం గోదావరిలో నీరు వృధాగా పోతుంది కనుక తక్షణమే మోటాలను ఆన్ చేసి సరస్సు నింపాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన ఆయకట్టు రైతుల పక్షాన ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని అధికారులను డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

## పోషణ లోపంతో అనారోగ్య సమస్యలు

**రాయపర్తి, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)**



పోషకాహార లోపాన్ని నివారించి గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉండేలా ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అంగన్వాడీ సూపర్‌వైజర్ మాధవిలత అన్నారు.మండలంలోని జయరాంతండా (ఎస్) గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మాధవి లత మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపం కారణంగా తలెత్తే రక్తహీనత వంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోజువారీ ఆహారంలో పౌష్టిక విలువలు కలిగిన పదార్థాలను తీసుకోవడంతో పాటు సరైన ఆహార అలవాట్లు పాటించాలని తెలిపారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలలో లోపాలు రాకుండా తగిన పౌష్టికాహారం అందించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలను నివారించవచ్చని వివరించారు. ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం అందేలా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో సర్పంచ్ గుగులోత్ రమేష్, ఆర్. సురేష్, డి. రాధాబాయి, గ్రామ కార్యదర్శి అనిల్ కుమార్, బి. నీలా, ఆయాలు విమల, పారిజాతం, గ్రామ పెద్దలు గుగులోత్ అరుణ్ నాయక్, గుగులోత్ భూపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిస్తే సహించేది లేదు




- **బీఆర్ఎస్, బీజేపీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి**
- **డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్**

**వర్ధన్నపేట, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):**

దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వ్యవహరించిన బీఆర్ఎస్, బీజేపీ నేతల తీరును నిరసిస్తూ వర్ధన్నపేట పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం భారీ నిరసన, ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ హాజరై ఈ సందర్భంగా దళిత నేతలు పర్యటించిన ప్రాంతాలను శుద్ధి చేయడం, వారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం వంటి చర్యలు దళితుల ఆత్మగౌరవాన్ని అవమానించడమేనని ఆరోపించారు. దేశంలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దళితులపై వివక్ష, దాడులు కొనసాగుతుండటం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఉన్నత స్థానాలు కల్పించే లక్ష్యంతో పనిచేస్తోందన్నారు.రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న దళిత నాయకులను అవమానించడం సరికాదన్నారు. దళితులపై వివక్షకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ గళమెత్తాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్, బీజేపీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోశాల వెంకన్నగౌడ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ తాత మధు సభ్యత్వాన్ని రద్దు చేసి, బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సంబంధిత వ్యాఖ్యలపై బహిరంగ క్షమాపణ చెప్పాలని కోరారు. మహిళా పోలీసులపై దాడికి పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ నాయకులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈగ దామోదర్ మాట్లాడుతూదళితులకు ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. దళితుల సంక్షేమం విషయంలో కాంగ్రెస్ పార్టీ నిరంత రం పోరాడుతుందని తెలిపారు.ఈకార్యక్రమంలో అయినవోలు దేవస్థాన చైర్మన్ కమ్మగోని ప్రభాకర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పత్రి భానుప్రసాద్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దామెర ప్రశాంత్, మాజీ కౌన్సిలర్లు సమ్మెట సుధీర్‌గౌడ్, మంచాల రామకృష్ణ, డివిజన్ అధ్యక్షులు కొండేటి సుధాకర్, చందు రవి, మాజీ సర్పంచ్ మరుపట్ల అరుణ సాయి, సర్పంచులు చిటూరి రాజు, నాగరాజు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మట్టి గణపతినే పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం

**భూపాలపల్లి : సెప్టెంబర్ 10,(వుదయం విలేకరి)**




పర్యావరణ పరిరక్షణ మనందరి భాద్యత అనే నినాదంతో మహాదేవపూర్ జడ్.పి.హెచ్.ఎస్ బాలుర పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల చేత మట్టి గణపతి విగ్రహాలు తయారు చేయించారు.గ్రామస్తులు సోమవారం జరుపుకోబోయే వినాయక చవితి పండుగకు మట్టితో చేసిన గణపతి విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎన్.జీ.సీ ఇంచార్జి ఉపాధ్యాయుడు బి ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు.ఈ మట్టి గణపతి విగ్రహాలు తయారి వర్క్ షాప్ ను సర్పంచ్ ప్రారంభించి పర్యావరణం కాపాడడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని అన్నారు.ప్రధానోపాధ్యాయుడు అనిల్ కుమార్, సైన్స్ టీచర్ ప్రభాకర్ రెడ్డి, మాట్లాడుతూ మట్టి విగ్రహాలు నేలలో త్వరగా కరిగిపోయి కాలుష్యం నుండి రక్షిస్తాయని అన్నారు. ప్రతీ సంవత్సరం మట్టి గణపతి విగ్రహాలు తయారు చేస్తూ కాలుష్యం తగ్గించడానికి కృషి చేస్తున్న బాలుర పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయులను అభినందించారు. పీ ఓ పీ తో చేసిన విగ్రహాలకు వాడిన కెమికల్ రంగులు జలచరాలకు హాని కలిగించి జల కాలుష్యం ఏర్పడిన పర్యావరణ సమస్యలు వస్తాయని అన్నారు అవగాహన లోపంతో మానవ కార్యకలాపాల వల్ల పర్యావరణం పాడైపోవడంతో ఎల్ నినో ప్రభావం ఈరోజు మనం ప్రత్యక్షంగా అనుభవిస్తున్నాం అని విద్యార్థులకు పర్యావరణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, రాజయ్య, దేవేందర్ రెడ్డి,రమేష్, లచ్చయ్య, అనిల్ సమ్మయ్య,షాజహా, అనిత, కవిత, కిరణ్ కుమార్, కోటేశ్వర్ మరియు రమాదేవి విద్యార్థులు పాల్గొన్నారు.

## మద్ది మేడారం అమ్మవార్లకు పట్టు వస్త్రాల సమర్పణ

**నల్లబెల్లి, సెప్టెంబరు 10 ( వుదయం):**



మండలంలోని నాగరాజుపల్లె పరిధిలో వేంచేసియున్న శ్రీ మద్ది మేడారం సమ్మక్క-సారలమ్మ అమ్మవార్లకు శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని గురువారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాస కానుకగా అమ్మవార్లకు పట్టు వస్త్రాలను భక్తిశ్రద్ధలతో సమర్పించారు.ఆలయ ప్రధాన పూజారి దురిశెట్టి నాగరాజు – దీపిక దంపతులు అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు జరిపారు. అనంతరం ఆలయ చైర్మన్ పబ్బు రాజేష్ – మీనా దంపతులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమంలో సర్పంచ్ ఎరుకల లలిత రఘు, ఉప సర్పంచ్ బైరి శోభన అశోక్, పంచాయతీ కార్యదర్శి విష్ణు, జీపీఓ నూనె ఉపేందర్, ముత్యాల అశోక్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేర నియంత్రణ శాంతి భద్రత పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి

- జిల్లా సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్
- జాతీయ మెగా లోక్ ఆదాలత్ పై ప్రజల్లో అవగాహన కల్పించాలి

జగిత్యాల సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)

సమస్యలను క్షేత్ర స్థాయిలో గుర్తించి నేరాల నివారణకు ప్రాధాన్యత ఇస్తూనే జరిగిన నేరాలను త్వరితగతిన ఛేదించి బాధితులకు న్యాయం అందించే విధంగా పోలీస్ అధికారులు సిబ్బంది పని చేయాలని జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్ సూచించారు గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ క్రైమ్ మీటింగ్‌లో డీఎస్పీలు సీఐలు ఎస్ఐలు పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా నమోదైన నేరాల పరిస్థితి వాటి దర్యాప్తు పురోగతి పెండింగ్ కేసులు చార్జ్‌షీట్లు నేర నియంత్రణ చర్యలు శాంతిభద్రతల నిర్వహణ ట్రాఫిక్ అమలు సైబర్ నేరాలు మహిళలు చిన్నారుల భద్రత గణేష్ నవరాత్రి ఉత్సవాలు తదితర అంశాలపై ఎస్పీ సమగ్రంగా సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నేరాల నియంత్రణ విచారణా వ్యవస్థను వేగవంతం చేయడం పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించడం ప్రతి కేసు విచారణ నాణ్యతతో పాటు సాక్ష్యాధారాల సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు పెండింగ్ కేసులను ప్రాధాన్యతగా తీసుకొని కోర్టుల్లో కన్విక్షన్ రేట్ పెంచేలా కృషి చేయాలన్నారు మహిళా భద్రత మత్తుపదార్థాల నివారణ చోరీలు వంటి అంశాలపై క్షుణ్ణంగా విశ్లేషించారు ప్రతి స్టేషన్‌లో విజబుల్ పోలీసింగ్ పెంచాలని ప్రజలతో సత్సంబంధాలు నెలకొల్పి నమ్మకం పెంచేలా ప్రవర్తించాలని సూచించారు సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజల్లో అవగాహన కల్పించడంలో సైబర్ టీములు చురుకుగా పనిచేయాలని సూచించారు

**గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా...**

ఈ నెల 14 వ తేదీన ప్రారంభంకానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన వేడుకలను ప్రజలు శాంతియుతంగా ప్రణాళిక ప్రకారం జరగాలని ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని అధికారులకు సూచించారు ఎక్కడా శాంతిభద్రతల సమస్య రానివ్వవద్దని ఈ విషయంలో అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు డయల్ 112 కు వచ్చే కాల్స్ ను ప్రత్యేక శ్రద్ధతో పరిగణించాలన్నారు సీసీటీవీలపై దృష్టి సారించాలన్నారు విజిబుల్ పోలీసింగ్ కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు

ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో వున్న గణేష్ మండపం నిర్వాహకుల కమిటీ వివరాలు తీసుకోవాలని సూచించారు వినాయక మండపాల దగ్గర ఎటువంటి సమస్యలు ఘర్షణలు లేకుండా చర్యలు చేపట్టాలని సమస్యాత్మక ప్రాంతాలు వుంటే బందోబస్తును పెంచాలని సూచించారు అవసరమైన ప్రదేశాల్లో ప్రత్యేక పికెట్ ఏర్పాటు చేయాలన్నారు గణేష్ శోభయాత్రలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా నిర్వహించడానికి పటిష్టమైన పోలీసులతో బందోబస్తు నిమజ్జనోత్సవానికి అవసరమైన స్విమర్స్ నిమజ్జనానికి వినియోగించే క్రేన్స్ లైటింగ్స్ సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుపై సంబంధిత శాఖల




సమన్వయంతో నిమజ్జనాన్ని విజయవంతం చేసేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు ఈ సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు ఈసమావేశంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్ డీఎస్పీ రాములు ఇన్‌స్పెక్టర్లు సుధాకర్ సురేష్ బాబు లక్ష్మీ నారాయణ శ్రీనివాస్ కరుణాకర్ రాజ్ కుమార్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వేణు సైదులు ఎస్ఐ లు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వినాయక చవితికి పకడ్బందీ బందోబస్తు..

- డీజే సౌండ్ ఓనర్లకు కౌన్సెలింగ్.. బౌండోవర్
- చెరువులు, మైలారం ప్రాంతాల్లో సీఐ సంజీవరావు ముందస్తు తనిఖీలు

రాయపర్తి సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):



వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు.వర్ధన్నపేటకు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ వై సంజీవరావు గురువారం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అనంతరం డీజే సౌండ్ ఓనర్లకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.కౌన్సెలింగ్ అనంతరం వారిని ఎంఆర్ఓ సమక్షంలో బౌండోవర్ చేశారు.వినాయక చవితి సందర్భంగా డీజే శబ్దాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణపై పోలీసు అధికారులు స్పష్టమైన సూచనలు చేశారు.వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా చెరువులు, మైలారం రిజర్వాయర్ ను సీఐ సంజీవరావు పరిశీలించారు.ఉత్సవాల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ ముత్యం రాజేందర్, హెడ్‌కానిస్టేబుల్ పొన్నం భాస్కర్, సంపత్, అనిల్‌కుమార్, నవ్య, సునీత, గణపతిరెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మను 'తెలంగాణ తల్లి'గా ప్రకటించాలి

**టిఆర్ఆర్ఎస్వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్ డిమాండ్**

సిద్దిపేట, సెప్టెంబర్ 10 (వుదయం బ్యూరో)

వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి టిఆర్ఆర్ఎస్ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు వద్ద గల ఐలమ్మ విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. నేషనల్ ధోబి రిజర్వేషన్ సంఘ్ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్ చిన్నరంగారి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా విజయ్ గణేష్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 'తెలంగాణ తల్లి'గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తిని, త్యాగాలను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అందుకోసం ప్రతి గ్రామంలో ఐలమ్మ విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. రజక సమాజం ఐక్యంగా ముందుకు సాగుతూ తమ న్యాయమైన



హక్కుల సాధన కోసం చైతన్యంతో ఉద్యమాలను బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తొగుట మండల రజక సంఘం అధ్యక్షుడు గణపతి చందు, రాచకొండ శ్రీనివాస్, చికోడ్ వేణు, పోతరాజు యాదగిరి, పరశురాములు, కనకరాజు, నరేష్, అరవింద్, వేణు, సంజీవ్ తదితర రజక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రాత్రివేళ విద్యుత్ కోతలు నివారించాలి

**విద్యుత్ శాఖ ఏడీకి వినతిపత్రం అందజేసిన రైతు రక్షణ సమితి నేతలు**

పరకాల సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):

పరకాల నియోజకవర్గ పరిధిలో గత వారం రోజులుగా రాత్రి వేళల్లో తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు వరికెల కిషన్ రావు అన్నారు. రాత్రివేళల్లో విద్యుత్ కోతలను వెంటనే నివారించి, వ్యవసాయానికి అవసరమైన సమయంలో నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించాలని కోరుతూ వరికెల కిషన్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు సురావు బాబురావుతో కలిసి పరకాల విద్యుత్ శాఖ ఏడీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వరికెల కిషన్ రావు మాట్లాడుతూ.. గత వారం రోజులుగా దాదాపు ప్రతిరోజూ రాత్రి సమయంలో 40 నుంచి 60 నిమిషాల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని తెలిపారు. విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొనడంతో రైతులు వ్యవసాయ మోటార్లు నడపలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పటికే వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం తదితర కారణాలతో రైతులు పంటల విషయంలో ఆందోళన చెందుతున్నారని, దీనికి తోడు వ్యవసాయ విద్యుత్ కోతలు వారి కష్టాలను మరింత పెంచుతున్నాయని అన్నారు. విద్యుత్ అంతరాయాల కారణంగా రైతులతో పాటు పిల్లలు, వృద్ధులు, మహిళలు,



సాధారణ ప్రజలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా వ్యవసాయానికి విద్యుత్ అత్యవసరమైన సమయంలో కోతలు విధించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రాత్రివేళల్లో విద్యుత్ కోతలు లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. రైతుల సమస్యను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి విద్యుత్ అంతరాయాలను వెంటనే పరిష్కరించాలని వరికెల కిషన్ రావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా ఉపాధ్యక్షులు సురావు బాబురావు పాల్గొన్నారు.



# మృతుల కుటుంబాలకు సంతాపం

చిట్యాల: సెప్టెంబర్ 10(వుదయం ప్రతినిధి):

మృతుల కుటుంబాలను అంబేద్కర్ వాదులు గురువారం పరామర్శించారు చిట్యాల మండల కేంద్రంలోని రామ్ నగర్ కాలనీకి చెందిన చిట్యాల వార్తా విలేకరి కట్కూరి మొగిలి తండ్రి, అంబేద్కర్ వాది అయిన కట్కూరి నర్సయ్య, ఇదే కాలనీకి చెందిన ఈర్ల ఎల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు మృతుల కుటుంబాలను అంబేద్కర్ యువజన సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో పరామర్శించి, చిత్రపటాల వద్ద పూలు వేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని 2 నిమిషాలు మౌనం పాటించారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య, మండల నాయకులు గురుకుంట్ల కిరణ్, మైదం మహేష్, మిట్టపల్లి మిత్ర మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు పుల్ల సతీష్ కుమార్, శీలపాక ప్రణీత్, ఏబీవీపీ నాయకులు వేల్పుల రాజ్ కుమార్, రాజ మౌళి, గని మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా హెచ్‌పీ పెట్రోల్ బంక్?

**నేషనల్ హైవే వరకు నిర్మాణం.. పూర్తి అనుమతులు ఉన్నాయా?**

**అధికారుల స్పందన కోసం గ్రామస్తుల ఎదురుచూపు**

సదాశివపేట వుదయం :

సదాశివపేట మండలంలోని పెద్దాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంక్ నిర్మాణంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నేషనల్ హైవేకు ఆనుకుని నిర్మాణం చేపట్టారనే ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.

పెట్రోల్ బంక్ ఏర్పాటు విషయంలో నేషనల్ హైవేకు 30 మీటర్ల దూరం విడిచిపెట్టి నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులు సూచించినట్లు ఎంపీఓ వెల్లడించినట్లు సమాచారం. అయితే, సదరు పెట్రోల్ బంక్ నిర్మాణంలో హైవేకు సంబంధించిన స్థలాన్ని సైతం వినియోగించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.నిబంధనలకు అనుగుణంగానే పెట్రోల్ బంక్ నిర్మాణం జరిగిందా? అన్ని శాఖల నుంచి పూర్తి స్థాయి అనుమతులు పొందారా?






నేషనల్ హైవే పరిధిలోని నిబంధనలు పాటించారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, నిర్మాణానికి సంబంధించిన అనుమతులను తనిఖీ చేసి నిబంధనల ఉల్లంఘన జరిగితే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# మండల కేంద్రాన్ని పోషకాహార లోపంలేని గ్రామంగా తీర్చిదిద్దాలి



**సర్పంచ్ల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి రమేష్**

ఖానాపురం, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):

మండల కేంద్రాన్ని పోషకాహారలోపంలేని గ్రామంగా తీర్చిదియడమే లక్ష్యంగా అంగన్వాడి అధికారులు టీచర్లు ఆయాలు పని చేయాలని గ్రామ సర్పంచ్ సర్పంచ్ల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్ అంగన్వాడి బృందానికి తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడి సెంటర్ లో 9వ పోషణ మాసం వారోత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు తెలుపుతూ, ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి పాల్గొని మాట్లాడుతూ పోషకాహారలోపంలేని గ్రామంగా మండల కేంద్రాన్ని తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలుపుతూ, గర్భిణీ స్త్రీలు, బాలింతలకు అంగన్వాడీ ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటుచేసిన చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలతో ఏర్పాటు చేసిన పోషణ ప్రదర్శన అద్భుతంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ మధురిమ, సూపర్వైజర్ రమ, అంగన్వాడీ టీచర్లు మల్లికాంబ, నాగమణి, అంగన్వాడి ఆయాలు, గర్భిణీ స్త్రీలు బాలింతలు సిబ్బంది పిల్లలు తదితరులు పాల్గొన్నారు.



# లయన్స్ క్లబ్ తొర్రూర్ వినాయక ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఘనంగా గాజుల వేడుక

తొర్రూరు సెప్టెంబర్ 10( వుదయం ప్రతినిధి):

లయన్స్ క్లబ్ తొర్రూర్ వినాయక ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో లయన్స్ మహిళా సభ్యులు గాజులు వేసుకునే కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సభ్యులు పరస్పరం గాజులు వేసుకుంటూ, సంతోషాన్ని పంచుకున్నారు. మహిళల మధ్య స్నేహభావం, ఐక్యతను పెంపొందించడంతో పాటు మన సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ మహిళా సభ్యులు ఉపాధ్యక్షురాలు లయన్ బుదారపు పద్మ, సహాయ కార్యదర్శి లయన్ కందకట్ల సులోచన, సహాయ కోశాధికారి లయన్ పద్మం అనురాధ, సభ్యులు లయన్ వనం భవాని, లయన్ ఎనగందుల ఉదయశ్రీ, లయన్ రేవూరి ధనలక్ష్మి, లయన్ రాగి శ్రీదేవి, లయన్ బైరు శైలజ, లయన్ పట్టూరి శోభా, కవిత, ఆడెపు సరిత, బీజ్జల పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ఐలమ్మ పోరాట స్ఫూర్తి తెలంగాణ ప్రజల రక్తంలోనే ఉంది : మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



పెద్దపల్లి, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)

నైజాం నవాబుల మూకలకు మరియు విస్నూరు దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి అరాచకాలకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడిన గొప్ప పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ అని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి కొనియాడారు. చాకలి ఐలమ్మ గారి వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆనాడు చాకలి ఐలమ్మ చూపిన విప్లవాత్మక స్ఫూర్తితోనే తెలంగాణ ఉద్యమంలో ఎంతోమంది ప్రజలు సమైక్యాంధ్ర పాలకులకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటాలు సాగించారని, తెలంగాణ మట్టిలో మరియు తెలంగాణ ప్రజల రక్తంలోనే ఐలమ్మ గారి పోరాట పటిమ దాగి ఉందని పేర్కొన్నారు.

**అధికారికంగా నిర్వహించే..**

తెలంగాణ పోరాట చరిత్రలో చాకలి ఐలమ్మ గారికి ఉన్న విశిష్ట స్థానాన్ని గుర్తించి, వారి జయంతి మరియు వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించే సంప్రదాయాన్ని బిఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ప్రారంభించారని గుర్తుచేశారు. బిఆర్ఎస్ పాలనలోనే రజక సోదరుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ వారికి ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కల్పించి ఆర్థికంగా, సామాజికంగా అండగా నిలిచామని తెలిపారు.

చాకలి ఐలమ్మ, కొమురం భీమ్ వంటి అమరవీరుల త్యాగాలను మరియు స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాలనే ఉన్నతమైన లక్ష్యంతో బిఆర్ఎస్ ప్రభుత్వం వారిని సముచితంగా గౌరవించిందని చెప్పారు. ఐలమ్మ గారి చారిత్రాత్మక త్యాగానికి ప్రతిరూపంగా మరియు వారి జ్ఞాపకార్థం చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయాన్ని కూడా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. తెలంగాణ సమాజంలో చాకలి ఐలమ్మ గారి స్థానం శాశ్వతమైనదని, ఆమె పోరాట స్ఫూర్తి ఎప్పటికీ కొనియాడదగినదని చెప్పారు. ప్రజా ఉద్యమాలకు, హక్కుల పోరాటాలకు ఐలమ్మ గారి స్ఫూర్తి నిరంతరం మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొంటూ ఐలమ్మ గారి వర్ధంతి వేళ వారికి స్మరాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజు కుమార్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులతో పేద కుటుంబాలకు ఆహార భరోసా..



**మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి**

వర్ధన్నపేట, సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి):

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని వర్ధన్నపేట మున్సిపాలిటీ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఘనంగా నిర్వహించారు.ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి హాజరై అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు.ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.స్మార్ట్ రేషన్ కార్డులతో అర్హులైన కుటుంబాలకు ఆహార భద్రత మరింత సులభంగా అందుతుందని పేర్కొన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆసరా పింఛన్లు, గ్యాస్ సిలిండర్ పథకం, కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలు ప్రజలకు అండగా నిలుస్తున్నాయని వివరించారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆర్థిక భారం తగ్గిందని, ఆసరా పింఛన్లతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా లభిస్తోందన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సహాయం, ఇందిరమ్మ ఇండ్ల ద్వారా సొంతింటి కల సాకారం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తారని చైర్మన్ స్పష్టం చేశారు. ప్రజలు తమకు అందుబాటులో ఉన్న సంక్షేమ పథకాల వివరాలను తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ (ఇన్‌చార్జి) కమ్మం కృష్ణ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

# గణేష్ మండపాల నిర్వాహకులకు పోలీస్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలి ఎస్సై అశోక్ బాబు సూచించారు

మాగనూర్ సెప్టెంబర్ 10 (వుదయం న్యూస్



గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలో ఉత్సవ నిర్వాహకులు పోలీస్ శాఖ రూపొందించిన ప్రత్యేక పోర్టల్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని ఎస్సై అశోక్ బాబు సూచించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేసేవారు ముందస్తు అనుమతి తీసుకుంటే మానిటరింగ్ చేయడం సులభం అవుతుందన్నారు. కావునా ప్రతి మండప నిర్వాహకులు పోర్టల్‌లో తమ వివరాలు నమోదు చేయాలన్నారు.ఇందుకోసం https://policeportal.tspolice.gov.in/index.htm కి లాగిన్ అయి వివరాలు నమోదు చేసుకోవచ్చన్నారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ఎలాంటి డీజేలకు అనుమతులు లేనందున నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మొద్దని, సందేహాలు ఉంటే వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతవరణంలో, ఆనందోత్సవాల మధ్య శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్సై అశోక్ బాబు పేర్కొన్నారు.

# విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం

**వెంకటాపూర్ సర్పంచ్ ద్యాగ గంగాధర్**

కోరుట్ల సెప్టెంబర్ 10 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల మండలం వెంకటాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గ్రామ సర్పంచ్ ద్యాగ గంగాధర్ గురువారం సందర్శించారు ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనంలో పాల్గొని భోజన నాణ్యతను పరిశీలించారు విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు విద్యా బోధన పాఠశాల పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు ఇటీవల జరిగిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన వెంకటాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థినులను సర్పంచ్ ద్యాగ గంగాధర్ అభినందించారు విజేత విద్యార్థినులకు శాలువాలు కప్పి సన్మానించి.వారి ప్రతిభను ప్రశంసించారు ఈ సందర్భంగా సర్పంచ్ ద్యాగ గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించడం అభినందనీయమని పేర్కొన్నారు మండల స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించి



గ్రామానికి పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చిన విద్యార్థినులను అభినందించారు విద్యార్థులు క్రీడల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి జిల్లా రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా విజయాలు సాధించాలని ఆకాంక్షించారు పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల ప్రోత్సాహానికి గ్రామపంచాయతీ తరపున అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ సెక్రటరీ శ్రీనివాస్ బాజోజి రవీందర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.